సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 69

శుక్రవారం 31-5-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'



ప్రజ్ఞానంద సంచలనం

నార్వే చెస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్ కార్ల్‌సన్‌పై 37 ఎత్తుల్లో విజయం -13లో



అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు 78,213 కోట్లు

వార్షికంగా 26 శాతం అప్. 2024–25 లోనూ 7%పైన వృద్ధి -13లో



లోయలో పడిన బస్సు..

జమ్మూకశ్మీర్‌లో తీర్థయాత్రికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి లోయలో పడిన ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸



దూసుకెళ్లిన 'అగ్నిబాణ్'

ప్రైవేట్ అంతరిక్ష స్టార్టప్ కంపెనీ అగ్నికుల్ కాస్మోస్‌కు చెందిన చిన్న తరహా రాకెట్ 'అగ్నిబాణ్' ప్రయోగం విజయవంతమైంది.

వివరాలు 6లో ▸



వడదెబ్బ.. 108 డిగ్రీల జ్వరం

ఢిల్లీలో వడదెబ్బకు గురైన ఓ వ్యక్తి శరీర ఉష్ణోగ్రత 108 డిగ్రీల ఫారన్‌హీట్‌కు చేరింది. చికిత్స పొందుతూనే ఆయన కన్నుమూశారు.

వివరాలు 6లో ▸



ప్రచారం పరిసమాప్తం

సార్వత్రిక ఎన్నికల్లో చివరిదైన ఏడో దశ ప్రచారం గురువారంతో ముగిసింది. జూన్ 1న 57 స్థానాలకు పోలింగ్ జరగనుంది.

వివరాలు 6లో ▸

రాష్ట్ర గేయం రెండు వెర్షన్లు

'జయ జయహే తెలంగాణ'ను ఆమోదించినట్టు ముఖ్యమంత్రి ప్రకటన



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దీపాదాస్ మున్షీ, గుత్తా సుఖేందర్‌రెడ్డి, గడ్డం ప్రసాద్‌కుమార్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు

- 2.30 నిమిషాలు ఒకటి, 13.30 నిమిషాలు మరొకటి
- భవిష్యత్ తరాలు పాడుకునేందుకు వీలుగా ఆమోదం
- జూన్ 2న దశాబ్ది ముగింపు వేడుకల్లో జాతికి అంకితం
- అధికార చిహ్నానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి కూడా మార్పులు.. అసెంబ్లీలో చర్చించాకే నిర్ణయం
- అధికార, మిత్రపక్ష పార్టీల నేతలతో సీఎం సమావేశం

సాక్షి, హైదరాబాద్: 'జయ జయహే తెలంగాణ' గేయం రెండు వెర్షన్లను తెలంగాణ రాష్ట్ర గీతంగా ఆమోదించినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి దశాబ్దం పూర్తి అవుతున్న సందర్భంగా జూన్ 2న ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లోనే 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని జాతికి అంకితం చేస్తామని చెప్పారు. ఉద్యమ కాలంలో అందరినీ ఉర్రూతలూగించి తెలంగాణ ఖ్యాతిని చాటిన ఈ గీతాన్ని అందరి ఆమోదంతో, భవిష్యత్తులో తరతరాలు పాడుకునేలా రాష్ట్ర గీతంగా ఆమోదించినట్లు వెల్లడించారు. తెలంగాణ కవి, రచయిత అందెశ్రీ 20 ఏళ్ల క్రితం రాసిన ఈ గీతాన్ని యథాతథంగా ఆమోదించామన్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం.ఎం.కీరవాణి సంగీతంతో పాటు స్వరాలు కూర్చినట్లు తెలిపారు. ఈ మేరకు సీఎంఓ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. గురువారం సాయంత్రం సచివాలయంలో అధికార, మిత్రపక్ష పార్టీల నేతలతో సమావేశమైన సీఎం.. తెలంగాణ రాష్ట్ర గీతంతో పాటు రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకల నిర్వహణపై చర్చించారు. ఈ సమావేశంలో అందెశ్రీ,

మిగతా 3వ పేజీలో ▶

ఉదయం పరేడ్ గ్రౌండ్స్‌లో.. సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై..

జూన్ 2న తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు 2లో

13.30 నిమిషాలు.. 12 చరణాలు

ఇదీ పూర్తి స్థాయి రాష్ట్ర గేయం 3లో

చార్మినార్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో కేటీఆర్ తదితరులు



రాజకీయ కుట్రతోనే చారిత్రక చిహ్నాల తొలగింపు

చార్మినార్ చిహ్నాన్ని తొలగించడమంటే హైదరాబాదీలను అవమానించడమే: కేటీఆర్

- జాక్‌పాట్ సీఎం మూర్ఖపు ఆలోచనను వ్యతిరేకిస్తున్నాం
- కేసీఆర్‌పై కక్షతోనే ప్రజా వ్యతిరేక పనులు
- ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తే ఊరుకోం
- చార్మినార్ వద్ద పార్టీ నేతలతో కలిసి కేటీఆర్ నిరసన
- గుల్జార్‌హౌస్ నుంచి చార్మినార్ వరకు ర్యాలీ

- వివరాలు 2లో



పత్తి విత్తనాల కోసం ఆదిలాబాద్ జిల్లాలో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఆదిలాబాద్‌లోని తాంసి బస్టాండ్ సమీపంలోని ఓ విత్తన దుకాణదారు గురువారం ఉదయం 7.30 సమయంలో దుకాణం తెరిచాడు. అరగంటలోనే నోస్టాక్ బోర్డు పెట్టడంతో రైతులు పంజాబ్ చౌక్ వద్ద రహదారిపై రాస్తారోకో చేపట్టారు.

విత్తనాల కోసం రోడ్డెక్కిన రైతన్న 5లో

రైతులు అడిగేదొకటి..మార్కెట్‌లో ఉన్నదొకటి..

డిమాండ్ ఉన్న పత్తి విత్తనాల సరఫరాలో వ్యవసాయ శాఖ విఫలం

న్యూస్‌రీల్

ప్రీస్కూల్స్‌గా అంగన్‌వాడీలు!



అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలు (ప్రీ స్కూల్స్)గా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు అవసరమైన సదుపాయాల కోసం రూ.30 కోట్లతో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రతిపాదనలు రూపొందించింది.

- వివరాలు 3లో▶

డిగ్రీ పేర్లకు అంతర్జాతీయ లుక్



సంప్రదాయ డిగ్రీ, పీజీ కోర్సులైన బీఏ, బీకాం, బీబీఎం, ఎంఏ, ఎంకామ్, ఎంబీఏలకు త్వరలో కొత్త పేర్లు రానున్నాయి. ఇకపై ఆయా కోర్సులను అమెరికాలో పిలుస్తున్న తరహాలో బీఎస్, ఎంఎస్‌గా పిలవనున్నారు. ఈ మేరకు యూజీసీ అన్ని విశ్వవిద్యాలయాలకు సూచనలు చేసింది.

- వివరాలు 3లో▶

నేడు బీజేపీ ధర్నా



బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న 'ఫోన్ ట్యాపింగ్' అంశాన్ని రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశం చేయాలని బీజేపీ భావిస్తోంది. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐతో విచారణ లేదా సమగ్ర దర్యాప్తు జరిపించాలనే డిమాండ్‌తో శుక్రవారం ధర్నా నిర్వహించనుంది.

- వివరాలు 2లో▶

తలెత్తుకు బతికేలా!



అవమానాలు.. ఛీదరింపులు భరిస్తూ.. సమాజంలో 'చిన్న చూపు' జీవనాన్ని సాగిస్తున్న ట్రాన్స్‌జెండర్ల శాశ్వత ఉపాధికి రాజన్న సిరిసిల్ల జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ట్రాన్స్‌జెండర్లు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా రాష్ట్రంలోనే తొలిసారిగా ఓ పెట్రోల్‌బంక్ ఏర్పాటు చేస్తోంది.

- వివరాలు 14లో▶

ఇదండీ సంగతి



మీరు అప్పుడు చూశారా గాంధీ సినిమా!?

కుట్రపూరితం..!

పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటుపై ఈసీ కొత్త నిబంధనలు ఎందుకు?

టీడీపీ ఇలా అడగ్గానే అలా ఆగమేఘాలపై ఎలా నిబంధనలు మారుస్తారు?



- అటెస్టేషన్ అధికారి సీల్ వేయక పోయినా, హోదా వివరాలు రాయకపోయినా చెల్లుబాటట!
- ఈ సవరణ ఎవరి కోసం.. ఎందుకోసం? దొంగ ఓట్లకు అవకాశం ఇచ్చినట్లు కాదా?
- సంతకం ఉంటే చాలట.. ఓట్ల లెక్కింపు సమయంలో సందేహాలు రావా?
- అలాంటప్పుడు వందలాదిగా ఉండే స్పెసిమెన్ సంతకాలతో సరిపోల్చడం కుదిరే పనా?.. ఎన్నికల సంఘం వ్యవహార శైలిపై ప్రజాస్వామ్యవాదుల ఆందోళన

- వివరాలు 10లో

జూన్ తొలి వారంలో రాష్ట్రంలోకి నైరుతి

- జూన్ 5 నుంచి 11 మధ్య రాష్ట్రమంతటా విస్తరించే అవకాశం
- ఈలోగా మరింతగా దంచికొట్టనున్న ఎండలు.. సీజన్‌లోనే అత్యధికంగా భీమారంలో 47.2 డిగ్రీలు నమోదు

- వివరాలు 14లో

ఒకరోజు ముందే.. కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు - 6లో

అమ్మ అనే పిలుపు కోసం..

- పిల్లలను తమకే దత్తతివ్వాలని వినతి
- శిశువిహార్ వద్ద పెంచిన తల్లిదండ్రుల పడిగాపులు.. పిల్లలతో ఏళ్ల అనుబంధాన్ని వీడలేక తీవ్ర ఆవేదన
- చిన్నారులకు డీఎన్‌ఏ పరీక్షల కోసం కోర్టుకెళ్లిన పోలీసులు
- ముగ్గురు ప్రధాన నిందితుల కోసం ప్రత్యేక బృందాల గాలింపు

- వివరాలు 14లో

కన్యాకుమారిలో మోదీ ధ్యానముద్ర



తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్ ధ్యాన మండపంలో ప్రధాని మోదీ గురువారం సాయంత్రం ధ్యానం ప్రారంభించారు. ధ్యానం శనివారం సాయంత్రం ముగియనుంది. 6లో



రూ. 200 కోట్ల మోసం కేసులో నిమ్మగడ్డ వాణి అరెస్టు

- ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ కేసులో టెస్కాబ్ జీఎం, ఆమె భర్త, కుమారుడిని అరెస్ట్ చేసిన సీసీఎస్ పోలీసులు

- వివరాలు 2లో▶

క్లుప్తంగా...

కాంగ్రెస్ సర్కార్‌లో 'ప్రజాపాలన' తప్పిపోయింది

బీజేపీ నేత బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంలో 'ప్రజాపాలన' కనబడకుండా తప్పిపోయిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్ర చిహ్నం, రాష్ట్ర గీతం మార్పు విషయంలో ప్రజాభిప్రాయం తీసుకున్నారా అని ప్రశ్నించారు. ఇది ఎరువుల పంపిణీ, విత్తనాల కొనుగోలు, ఫోన్ ట్యాపింగ్ వంటి సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించే ఎత్తుగడ తప్ప మరొకటి కాదని మండిపడ్డారు. గురువారం ఎక్స్ వేదికగా సంజయ్ స్పందిస్తూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, గత బీఆర్ఎస్ సర్కార్‌ల మధ్య ఎలాంటి తేడా లేదన్నారు. చార్మినార్ అంటే హైదరాబాదేనని మాజీ మంత్రి కేటీఆర్ చెబుతున్నారని, అయితే అది ఆయన ఒక్కరికే వర్తిస్తుందని అన్నారు. హైదరాబాద్ అంటే భాగ్యలక్ష్మి దేవాలయం కూడా అని పేర్కొన్నారు. కేటీఆర్ చార్మినార్‌కు వెళ్లిన సందర్భంగా, భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకోకుండా ఆయనను ఎవరు అడ్డుకున్నారని బండి ప్రశ్నించారు.

హరీశ్‌రావు ఫోన్ కూడా ట్యాప్ చేశారు

ట్యాపింగ్ కేసును సీబీఐతో దర్యాప్తు చేయించాలి: ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఫోన్ కూడా గత ప్రభుత్వ హయాంలో ట్యాప్ చేశారని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తెలిపారు. ఒంటేరు ప్రతాప్‌రెడ్డి-హరీశ్‌రావు మధ్య జరిగిన సంభాషణను ట్యాపింగ్ ద్వారానే కేసీఆర్ తెలుసుకున్నారని అన్నారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడంలేదు? ఎందుకు సీబీఐ విచారణ కోరడం లేదు? గత ప్రభుత్వంలో జరిగిన కుంభకోణాలపై ఎందుకు నోరు మెదపడం లేదు? అని ఆయన ప్రశ్నించారు. తన ప్రభుత్వాన్ని కాపాడుకోవడం కోసమే రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌తో లాలూచీ పడుతున్నారని ఆరోపించారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దీనిపై త్వరలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. అలాగే సోనియా గాంధీని దశాబ్ది ఉత్సవాలకు ఆహ్వానించడంపై ప్రభాకర్ మండిపడ్డారు. వందల మంది బలిదానాలకు కారణమైన ఆమెను ఏ హోదాలో పిలుస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే సోనియాగాంధీ దశాబ్ది వేడుకలకు హాజరు కావాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు.

కాకతీయ కళాతోరణం తొలగించే ప్రయత్నం విరమించుకోవాలి

బీజేపీ నేత గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: వరంగల్ కాకతీయ కళాతోరణం తెలంగాణ ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశమని, తెలంగాణ రాజముద్ర నుంచి దీనిని తొలగించాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలని బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ తోరణం తొలగింపునకు చేస్తున్న ప్రయత్నాలు, అనుసరిస్తున్న విధానాన్ని గురువారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కాకతీయ కళాతోరణం రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజలకు ప్రపంచవ్యాప్తంగా గౌరవం కల్పించడంతో పాటు సాంస్కృతిక సాంప్రదాయాలకు గుర్తింపునిస్తోందని అందులో పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంత ప్రజలు కాకతీయ సామ్రాజ్యాన్ని ఒక సుపరిపాలనకు గుర్తుగా భావిస్తారని, ఇది ఒక తీపి గుర్తుగా నేటికీ ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ వరంగల్ పట్టణానికి స్మార్ట్ సిటీతో పాటు హెరిటేజ్ సిటీగా గుర్తింపును తీసుకొచ్చారని తెలిపారు.

గోవుల తరలింపుపై పోలీసుల బెదిరింపు

బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: జూన్ 17న బక్రీద్ సందర్భంగా గోవుల తరలింపు అడ్డుకోవద్దని హిందువులను పోలీసులు బెదిరిస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ ఆరోపించారు. గోవధ చేయవద్దని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు పాటించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి లేదా? అని ఆయన ప్రశ్నించారు. రాజాసింగ్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గోవుల తరలింపు, హత్యలను అడ్డుకునే హిందూ కార్యకర్తలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పోలీసులు చేయాల్సిన పని హిందూ కార్యకర్తలు చేస్తుంటే.. వారిని బెదిరించడమేమిటని ప్రశ్నించారు. గోవుల తరలింపు అడ్డుకుంటున్న కార్యకర్తలపై రౌడీషీట్ పెడతారా అని నిలదీశారు. గోవధ అడ్డుకోవడానికి తానే రంగంలోకి దిగుతానని, దమ్ముంటే అడ్డుకోవాలని రాజా సింగ్ సవాల్ విసిరారు. గోవధను అడ్డుకుంటే బుల్లెట్ దించుతా.. అని ముస్లింలు బెదిరిస్తున్నారని, ఎవరి బుల్లెట్ ఎవరికి దిగుతుందో చూసుకుందామని హెచ్చరించారు.

ఉదయం పరేడ్ గ్రౌండ్స్‌లో.. సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై..

జూన్ 2న రెండు పూటలా తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు

- ఉదయం 9.30కు అమరవీరుల స్తూపం వద్ద నివాళులు
- తర్వాత పరేడ్ గ్రౌండ్స్‌లో కార్యక్రమం.. తెలంగాణ అధికారిక గీతం ఆవిష్కరణ
- ప్రసంగించనున్న సోనియా, రేవంత్
- చివరిగా బాణసంచా వెలుగులతో ముగియనున్న వేడుకలు



దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా రంగులు వేస్తున్న కార్మికులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను జూన్ 2న అత్యంత వైభవంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వ యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా వేడుకలను నిర్వహించాలని సూచించారు. ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 2న జరిగే కార్యక్రమాల షెడ్యూల్ ఇదీ..

అమరవీరులకు నివాళులతో మొదలు

జూన్ 2న ఉదయం 9.30కు అసెంబ్లీ ఎదుట ఉన్న గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద సీఎం రేవంత్, మంత్రులు నివాళులు అర్పిస్తారు. ఉదయం 10 గంటలకు పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రత్యేక కార్యక్రమం ప్రారంభమవుతుంది. తొలుత సీఎం జాతీయ పతాకావిష్కరణ చేస్తారు. పోలీసు బలగాల పరేడ్, మార్చ్ ఫాస్ట్, వందన స్వీకార కార్యక్రమం ఉంటాయి. తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతం 'జయ జయహే తెలంగాణ'ను ఆవిష్కరిస్తారు. అనంతరం ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తారు. విశిష్ట సేవలు అందించిన పోలీసు సిబ్బందికి, ఉత్తమ కాంటింజెంట్లకు అవార్డులను ప్రదానం చేస్తారు. అవార్డు స్వీకర్తలతో ఫొటో సెషన్ అనంతరం ఉదయం కార్యక్రమం ముగుస్తుంది.

సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై వేడుకగా..

2న సాయంత్రం ట్యాంక్‌బండ్ మీద వేడుకలు నిర్వహిస్తారు. తెలంగాణకు సంబంధించిన హస్తకళలు, ప్రత్యేక ఉత్పత్తులు, వివిధ రకాల ఫుడ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. సాయంత్రం 6.30కు సీఎం రేవంత్ ట్యాంక్‌బండ్‌కు చేరుకుని వివిధ స్టాళ్లను సందర్శిస్తారు. తర్వాత తెలంగాణ కళారూపాలకు అద్దం పట్టేలా కార్నివాల్ నిర్వహిస్తారు. దాదాపు 700 మంది కళాకారులు ఇందులో పాల్గొంటారు. ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేస్తున్న వేదికపై 70 నిమిషాల పాటు వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఉంటాయి. అనంతరం జాతీయ జెండాలతో ట్యాంక్‌బండ్‌ఒక చివర నుంచి మరో చివరి వరకు 5 వేల మంది భారీ ఫ్లాగ్‌వాక్ నిర్వహి స్తారు. ఈ ఫ్లాగ్‌వాక్ జరుగుతున్న సమయంలో 'జయ జయహే తెలంగాణ' రాష్ట్ర గేయం ఫుల్‌వెర్షన్ (13.30 నిమిషాల)ను విడుదల చేస్తారు. గీత రచయిత, కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణిలను సన్మానిస్తారు. రాత్రి 8.50 గంటలకు పది నిమిషాల పాటు హుస్సేన్ సాగరం మీదుగా ఆకాశంలో రంగులు విరజిమ్మేలా సాగే బాణసంచా కార్యక్రమంతో వేడుకలు ముగుస్తాయి.

యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్న ఏర్పాట్లు

తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తోంది. పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాన వేదికతోపాటు, ముఖ్య అతిథులు, ఆహ్వానితులు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేకంగా లాంజ్‌లు సిద్ధం చేస్తున్నారు. వేసవి తీవ్రత నేపథ్యంలో భారీ టెంట్లను, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు ట్యాంక్‌బండ్‌పై నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, కార్నివాల్, బాణసంచా, లేజర్ షో, ఫుడ్, గేమింగ్ స్టాళ్ల ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. దాదాపు 80 స్టాళ్లను సిద్ధం చేస్తున్నారు. వీటిలో హస్తకళలు, మహిళా బృందాలు తయారు చేసిన ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు, హైదరాబాద్‌లోని పలు ప్రముఖ హోటళ్ల స్టాల్స్, చిన్న పిల్లలకు గేమింగ్ షోలు ఉన్నాయి. కార్నివాల్‌లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన పలు సాంస్కృతిక కళాబృందాలు ప్రదర్శన ఇవ్వనున్నాయి.

కేసీఆర్‌కు రేవంత్ ప్రత్యేక ఆహ్వానం!

- వ్యక్తిగత ఆహ్వాన లేఖ, పత్రికను పంపిన సీఎం
- ప్రొటోకాల్ సలహాదారు ద్వారా అందించేందుకు ఏర్పాట్లు



చుక్కా రామయ్యతో ముచ్చటిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 2న పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించే అధికారిక కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా లేఖ రాశారు. ఈ వ్యక్తిగత ఆహ్వాన లేఖను, ఆహ్వాన పత్రికను స్వయంగా కేసీఆర్‌కు అందించాలని ప్రొటోకాల్ సలహాదారు హర్కర వేణుగోపాల్, డైరెక్టర్ అరవింద్ సింగ్‌లను సీఎం ఆదేశించారు. ఈ మేరకు కేసీఆర్‌ను కలసి ఆహ్వాన లేఖ, పత్రికను అందించేందుకు వారిద్దరూ కేసీఆర్ సిబ్బందితో చర్చలు జరిపారు. కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో ఉన్నారని సిబ్బంది వెల్లడించడంతో.. ఫామ్‌హౌస్‌కు వెళ్లి ఆహ్వాన పత్రిక, లేఖను అందించేందుకు వేణుగోపాల్, అరవింద్ సింగ్ ప్రయత్నిస్తున్నారని సీఎం కార్యాలయం తెలిపింది.

చుక్కా రామయ్యకు సీఎం పరామర్శ.. వేడుకలకు ఆహ్వానం..

సాక్షి, హైదరాబాద్: కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్యను సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శించారు. గురువారం నల్లకుంటలోని చుక్కా రామయ్య నివాసానికి సీఎం వెళ్లారు. రామయ్య ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. శాలువా కప్పి సన్మానించారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు హాజరుకావాలంటూ రామయ్యను ఆహ్వానించారు.

కేంద్ర మాజీమంత్రి పి.శివశంకర్ భార్య లక్ష్మీబాయి కన్నుమూత

80 - 90 సంవత్సరాల వయసు మధ్యలో రెండు పీహెచ్‌డీ డాక్టరేట్‌లు



సాక్షి, హైదరాబాద్: కేంద్ర మాజీ మంత్రి, కేరళ, సిక్కిం రాష్ట్రాలకు గవర్నర్‌గా పని చేసిన పి.శివశంకర్ సతీమణి లక్ష్మీబాయి (94) గురువారం కన్నుమూశారు. లక్ష్మీబాయి అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన వయొలిన్ విద్వాంసుడు ద్వారం వెంకటస్వామి నాయుడు మేనకోడలు. విశాఖ జిల్లా ఎలమంచిలికి చెందిన ఆమె తండ్రి వృత్తిరీత్యా ఒడిశాకు మారారు.

ఒడిశాలో మొదటి గ్రాడ్యుయేట్...


ఒడిశా రాష్ట్రానికి చెందిన మొదటి మహిళా గ్రాడ్యుయేట్ లక్ష్మీబాయి. ఆమె ఉత్కల్ యూనివర్సిటీలో బీఏ చేసి, బెనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి పోస్టల్ కోర్సు ద్వారా ఎంఏ పట్టా పుచ్చుకున్నారు. 1955లో పి.శివశంకర్‌ను వివాహం చేసుకున్నారు. ఆమె 80 నుంచి 90 సంవత్సరాల వయస్సు మధ్యలో రెండు పీహెచ్‌డీ డాక్టరేట్‌లు సాధించారు. ఆమె చేసిన పీహెచ్‌డీల్లో ఒక దానికి బంగారు పతకంతోపాటు జీవిత సాఫల్య పురస్కారం లభించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించిన థీసిస్ ''భగవద్గీత, ఆధునిక కాలపు మనిషికి దాని ఔచిత్యం'పై 5,000 పేజీల ప్రవచనం. ఇది ఆమె పూర్తిగా చేతితో రాసిన వ్రాత ప్రతిని యూనివర్సిటీకి సమర్పించారు. ఆమెకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటాలజిస్ట్ డాక్టర్ వినయ్. కాగా, డా.లక్ష్మీబాయి మృతిపట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

అందెశ్రీకి గౌరవం దక్కుతుందనే కేసీఆర్ పట్టించుకోలేదు


రకుల్‌ప్రీత్, సమంతను బ్రాండ్ అంబాసిడర్లుగా ఎలా చేశారు?:ఆది శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: జయ జయహే తెలంగాణ పాట తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగసిపడేలా చేసిందని, బీఆర్ఎస్‌కు పదేళ్లలో ఆ పాటను రాష్ట్ర గీతంగా చేయాలన్న సోయి లేకుండా పోయిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో మాట్లాడుతూ ప్రజలు, కవులు, కళాకారుల అభిప్రాయంతోనే చిహ్నం రూపొందిస్తున్నారని, తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు సీఎం రేవంత్‌రెడ్డి గౌరవం ఇస్తున్నారన్నారు. కవి అందెశ్రీకి గౌరవం దక్కుతుందన్న అక్కసుతోనే కేసీఆర్ కుటుంబం ఆ పాటను ఇన్నాళ్లూ పట్టించుకోలేదని ఆరోపించారు. తెలంగాణకు సంబంధం లేని మంచులక్ష్మి, రకుల్‌ప్రీత్ సింగ్, సమంతను గత ప్రభుత్వం బ్రాండ్ అంబాసిడర్లుగా నియమించలేదా అని శ్రీనివాస్ ప్రశ్నించారు. తెలంగాణపై ప్రేమ ఉంటే పార్టీ పేరులో తెలంగాణ ఎందుకు తీసేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

రూ. 200 కోట్ల మోసం కేసులో నిమ్మగడ్డ వాణి అరెస్టు



నేతాజీ, వాణీబాల



శ్రీహర్ష

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్‌లో (టెస్కాబ్) జనరల్ మేనేజర్‌గా పనిచేస్తూ శ్రీ ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ ముసుగులో రూ.200 కోట్ల మేర డిపాజిట్లు వసూలు చేసి మోసానికి పాల్పడిన నిమ్మగడ్డ వాణీబాల, ఆమె భర్త, కుమారుడిని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంస్థ చేతిలో మోసపోయిన 532 మందిలో 147 మంది టెస్కాబ్ ఉద్యోగులేనని డీసీపీ ఎన్.శ్వేత గురువారం తెలిపారు. వాణీబాలతోపాటు ఆమె భర్త మేక నేతాజీ, కుమారుడు మేక శ్రీహర్షలను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

అధిక వడ్డీ ఆశచూపి..: ఏపీలోని ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన మేక నేతాజీ 1985లో హైదరాబాద్‌లోని తిలక్ రోడ్‌లో శ్రీ ప్రియాంక ఫైనాన్స్ అండ్ చిట్‌ఫండ్స్ పేరుతో సంస్థను ఏర్పాటు చేశారు. ఇతర వ్యాపారాలు కూడా చేసిన ఆయన.. వాటి నిర్వహణ కోసం ప్రియాంక సంస్థ ద్వారా డిపాజిట్లు సేకరించడం మొదలుపెట్టారు. తమ వద్ద నగదు డిపాజిట్ చేస్తే ఏడాదికి 24% చొప్పున వడ్డీ చెల్లిస్తానంటూ నమ్మబలికాడు. అలాగే ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ పేరుతో మరో సంస్థ ఏర్పాటు చేసి ముద్రణ రంగంలో వినియోగించే ప్లేట్లు, రంగులు తదితరాలను కంపెనీల నుంచి కొని ప్రింటింగ్ ప్రెస్‌లకు విక్రయించడం మొదలెట్టారు. నేతాజీ భార్య నిమ్మగడ్డ వాణీబాల ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్‌లో ఉద్యోగంలో చేరారు. రాష్ట్ర విభజన తర్వాత టెస్కాబ్‌గా మారిన ఈ సంస్థలో కొనసాగారు. రాష్ట్ర స్థాయి పోస్టు అయిన జనరల్ మేనేజర్ వరకు వెళ్లారు. శ్రీహర్ష తన తండ్రి నిర్వహిస్తున్న సంస్థలోనే డైరెక్టర్‌గా చేరారు. వాణీబాల టెస్కాబ్‌లో పనిచేసే ఉద్యోగులను భర్త సంస్థలో పెట్టుబడులు పెట్టాలని హుకుం జారీ చేసింది. దీంతో 147 మంది రూ. 26 కోట్లు డిపాజిట్లు చేశారు. అలాగే టెస్కాబ్‌లో డిపాజిట్ చేయడానికి వచ్చే వారిని సైతం మాయమాటలతో నమ్మించి పెద్ద మొత్తంలో డిపాజిట్ చేయించుకుంది.

రశీదులన్నీ వేరే సంస్థ పేరుతో..: తమ వద్ద పెట్టుబడులు పెట్టిన డిపాజిట్‌దారులకు ఇవ్వడానికి నేతాజీ, శ్రీహర్షలు ప్రత్యేకంగా శ్రీ ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ పేరుతో రసీదులు తయారు చేయించారు. దీనిపై వివరాలు రాసి రూపాయి విలువైన రెవెన్యూ స్టాంప్ అతికించి సంతకాలు చేసిచ్చారు. కరోనా తర్వాత కాస్త ఒడుదొడుకులు ఎదురైనా గతేడాది నవంబర్, డిసెంబర్ నుంచి వినియోగదారులకు వడ్డీ చెల్లింపులు ఆపేశారు. ఈ నెల 3న సిటీ సివిల్ కోర్టులో ఏకంగా దివాలా పిటిషన్ (ఐపీ) దాఖలు చేసి ముగ్గురూ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీనిపై బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న ఏసీపీ కేఎం కిరణ్‌కుమార్ నేతృత్వంలోని బృందం గురువారం ముగ్గురినీ అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించింది. విచారణ నిమిత్తం 14 రోజుల కస్టడీకి కోరాలని నిర్ణయించింది.

అంజన్నకు భద్రాద్రి పట్టువస్త్రాలు

ఘనంగా పెద్ద జయంతి ఉత్సవాలు



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న దృశ్యం

కొండగట్టు (చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టులో కొలువుదీరిన శ్రీఆంజనేయ స్వామి పెద్ద జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం భద్రాచలం నుంచి స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆటపాటలు, కోలాటాలు, ఒగ్గుడోలు కళాకారులు, సన్నాయి బృందాల నృత్యాల మధ్య వాటిని కొండగట్టుకు తీసుకొచ్చారు. భద్రాచలం రామయ్య ఆలయ ఈవో రమాదేవి, కొండగట్టు ప్రత్యేకాధికారి వినోద్‌రెడ్డి, ఈవో చంద్రశేఖర్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు అంజన్న జయంతి సందర్భంగా మాలధారుల కోసం ఆలయ ఆవరణలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. భక్తుల కోసం మూడు లక్షల లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేశామన్నారు.

ఆకట్టుకున్న శోభాయాత్ర

భద్రాచలం నుంచి తెచ్చిన పట్టువస్త్రాలను స్వామివారికి సమర్పించిన అనంతరం ఆలయ ఆవరణలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలో ఆంజనేయుడు, సీతారామలక్ష్మణుల వేషధారణలతో కళాకారులు అలరించారు.



గురువారం చార్మినార్ వద్ద నిరసనలో పాల్గొన్న కేటీఆర్ తదితరులు

రాజకీయ కుట్రతో చారిత్రక చిహ్నాల తొలగింపు

- చార్మినార్ చిహ్నాన్ని తొలగించడమంటే హైదరాబాదీలను అవమానించడమే: కేటీఆర్
- జాక్‌పాట్ ముఖ్యమంత్రి మూర్ఖపు ఆలోచనను వ్యతిరేకిస్తున్నాం
- ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తే ఊరుకోం
- చార్మినార్ వద్ద పార్టీ నేతలతో కలిసి కేటీఆర్ నిరసన

చార్మినార్ (హైదరాబాద్): తెలంగాణ రాజముద్రలోని చారిత్రక చిహ్నాలను రాజకీయ కుట్రతోనే మార్చాలనుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. జాక్‌పాట్ ముఖ్యమంత్రి మూర్ఖపు ఆలోచనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తెలంగాణ రాజముద్రలో చార్మినార్, కాకతీయ కళాతోరణం చిహ్నాలను తొలగించాలని రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తూ కేటీఆర్ ఆధ్వర్యంలో బుధవారం చార్మినార్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. అనంతరం గుల్జార్‌హౌజ్ నుంచి చార్మినార్ వరకు కాలినడకన వచ్చిన ఆయన చార్మినార్ వద్ద విలేకరులతో మాట్లాడారు. చేతనైతే గత పదేళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలి తప్ప.. కేసీఆర్‌పై కక్షతో ఆయన చేసిన అభివృద్ధిని కాలరాయొద్దని హితవు పలికారు. రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు.

చారిత్రక గుర్తింపును విస్మరించారు..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఉన్న వారసత్వ కట్టడాల చిహ్నాలను రాజముద్ర నుంచి తొలగించాలని చూడటం తెలుగు ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీయడమేనని కేటీఆర్ చెప్పారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ కట్టడాలకు చారిత్రక గుర్తింపు ఉందన్న విషయాలను సీఎం రేవంత్‌రెడ్డి విస్మరించడం దురదృష్టకరమ న్నారు. లేని వాటిని చేర్చితే మంచిదే గానీ.. తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండిపోయిన చిహ్నాలను ఎలా తొలగిస్తారని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించడం మంచిది కాదని హితవు పలికారు. చార్మినార్ చిహ్నాన్ని తొలగించడమంటే ప్రతి హైదరాబాదీని అవమానించినట్లేనన్నారు. ఎన్నో ఉద్యమాలు, త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని.. వీరందరి ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే విధంగా ఉన్న ఈ నిర్ణయాన్ని తెలంగాణ ప్రజలు, ఉద్యమకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పద్మారావు, మాగంటి గోపీనాథ్, మాజీ మంత్రులు రాజయ్య, పొన్నాల లక్ష్మయ్య, చార్మినార్ బీఆర్ఎస్ ఇంచార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ తదితరులు పాల్గొన్నారు.

ఆనవాళ్లు చెరిపేస్తే ఆగ్రహానికి బలవుతారు

బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్



సాక్షి, హైదరాబాద్: ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణ సాధించిన కేసీఆర్ ఆనవాళ్లను కాంగ్రెస్ సర్కార్ చెరిపివేసే ప్రయత్నం చేస్తే ప్రజాగ్రహానికి బలికాకతప్పదని బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్ హెచ్చరించారు. కొత్త చిహ్నాలతో తెలంగాణ చరిత్రను మాయం చేయాలని కాంగ్రెస్ చూస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, పార్టీ నేతలు రూప్‌సింగ్, గోసుల శ్రీనివాస్ యాదవ్‌లతో కలసి గురువారం దేవీప్రసాద్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అస్తిత్వం, చరిత్రపై మరోమారు దాడి చేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన అన్నారు. కేసీఆర్ పాలనలో పదేళ్లపాటు జరిగిన అభివృద్ధిని విధ్వంసంగా చూపేందుకు కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోందన్నారు. ఇలాంటి కుట్రలపై పోరాడేందుకు విశాల ప్రజా వేదిక అవసరముందన్నారు. చార్మినార్, కాకతీయ కళాతోరణం గురించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవగాహన లేదని, ప్రభుత్వం తీసుకునే తప్పుడు నిర్ణయాలపై బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు చిహ్నాల మార్పు జరుగుతోందని ఆయన ఆరోపించారు. తెలంగాణ ద్రోహుల కుట్రలను రేవంత్ అమలు చేస్తున్నారని గెల్లు శ్రీనివాస్ విమర్శించారు. రాజముద్ర నుంచి చార్మినార్ చిహ్నం తొలగించడంపై ఎంపీ అసదుద్దీన్ పార్టీ స్పందించాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని రేవంత్‌రెడ్డికి కాకతీయ కళాతోరణం, చార్మినార్ గురించి తెలిసే అవకాశం లేదని ఆయన అన్నారు.

6 నెలల పాలనలో రైతులు ఆగం

- మాజీమంత్రి జోగు రామన్న
- ప్రభుత్వ చేతకానితనం వల్లే రైతులకు ఇబ్బందులు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రాష్ట్రంలో రైతులు ఆగమయ్యారని, ప్రభుత్వం చేతకానితనం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి జోగు రామన్న విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, పార్టీ ఖానాపూర్ ఇన్‌చార్జ్ జాన్సన్ నాయక్‌తో కలిసి గురువారం తెలంగాణభవన్‌లో జోగు రామన్న మీడియాతో మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలో విత్తనాల కోసం వచ్చిన రైతులపై పోలీసుల లాఠీచార్జ్ ప్రభుత్వానికి సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే 250 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రైతుల ఈ తరహా కష్టాలు ఎదుర్కోలేదని, వారు కోరిన విధంగా విత్తనాలు అందజేశామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతుల గురించి పట్టింపు లేదని దుయ్యబట్టారు.

సీఎంకు మంత్రులకు మధ్య సమన్వయం లేదు

డిప్యూటీ సీఎం పాలన గాలికి వదిలి ఇతర రాష్ట్రాల పర్యటనలో తీరిక లేకుండా ఉన్నారని జోగు రామన్న విమర్శించారు. విత్తనాల కొరత లేదని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అబద్ధాలు మాట్లాడుతున్నారని, మంత్రులకు సీఎంకు నడుమ సమన్వయం లేదని చెప్పారు. ప్రజా సమస్యలపై మంత్రులకు ఏ మాత్రం శ్రద్ధ కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో సాగునీటి విడుదలకు సంబంధించి ప్రభుత్వానికి కార్యాచరణ లేదని విమర్శించారు. రైతులు అడిగిన విత్తనాలు అందుబాటులోకి రాకుంటే రెండు మూడు రోజుల్లో ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పాయల్ శంకర్‌పై హైకోర్టులో పిటిషన్

అఫిడవిట్‌లో లోపాలున్నాయన్న మాజీ మంత్రి జోగు రామన్న

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఎన్నికపై బీఆర్ఎస్ మాజీ మంత్రి జోగు రామన్న హైకోర్టును ఆశ్రయించారు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో పాయల్ శంకర్ నామినేషన్ అఫిడవిట్‌లో లోపాలు ఉన్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 17న ఆయన హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై స్పందించిన కోర్టు, పాయల్ శంకర్‌తోపాటు మరో 24 మంది అభ్యర్థులకు నోటీసులు జారీ చేసింది. జూన్ 14న కోర్టుకు తమ న్యాయవాదితో కలిసి వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన పాయల్ శంకర్ గెలుపొందగా, బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన జోగు రామన్న ద్వితీయ స్థానంలో నిలిచారు.

నేడు ధర్నాచౌక్‌లో బీజేపీ ధర్నా

ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ కోరుతూ నిరసనలు



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న 'ఫోన్‌ట్యాపింగ్' అంశాన్ని రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశం చేయాలని బీజేపీ భావిస్తోంది. ఫోన్‌ట్యాపింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐతో విచారణ లేదా సమగ్ర దర్యాప్తు జరిపించాలనే డిమాండ్‌తో ధర్నాలు, వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమైంది. ఈ కార్యాచరణలో భాగంగా...శుక్రవారం ఉదయం 11 గంటలకు ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించనుంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ కొనసాగుతున్న నేపథ్యంలో...ఈ ధర్నా నిర్వహణకు ఎన్నికల కమిషన్ అనుమతి కోరుతూ రాష్ట్ర పార్టీ లేఖ రాసింది. ధర్నాచౌక్‌లో నిరసన తెలిపేందుకు పోలీసుల అనుమతి కోరుతూ సంబంధిత అధికారులకు లేఖను అందజేసింది. ఈ ఆందోళనా కార్యక్రమంలో బీజేపీ ఓబీసీమోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, సీనియర్ నాయకులు పాల్గొననున్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో విచారణను నీరుగార్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి కేసును తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.



డిగ్రీ పేర్లకు అంతర్జాతీయ లుక్..

అమెరికా తరహాలో బీఎస్, ఎంఎస్‌గా మార్పులు..

సాక్షి, హైదరాబాద్: సంప్రదాయ డిగ్రీ, పీజీ కోర్సులైన బీఏ, బీకాం, బీబీఎం, ఎంఏ, ఎంకామ్, ఎంబీఏలకు త్వరలో కొత్త పేర్లు రానున్నాయి. జాతీయ నూతన విద్యా విధానం–2020 (ఎన్‌ఈపీ) అమల్లో భాగంగా అంతర్జాతీయ స్థాయికి అనుగుణంగా వాటి పేర్లలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇకపై ఆయా కోర్సులను అమెరికాలో పిలుస్తున్న తరహాలో బీఎస్, ఎంఎస్‌గా పిలవనున్నారు. ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అన్ని విశ్వవిద్యాలయాలకు సూచించింది.

నూతన జాతీయ విద్య విధానంలోనూ ప్రస్తావన..

దేశంలో సంప్రదాయ డిగ్రీ కోర్సులు చేసిన విద్యార్థులు విదేశాల్లో ఉద్యోగాలు లేదా ఉన్నత చదువులకు వెళ్లినప్పుడు ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకే ఇలా పేర్లు మార్చనున్నారు.

విస్తృత కసరత్తు అనంతరం..

సంప్రదాయ కోర్సుల పేర్ల వల్ల కలిగే ఇబ్బందులపై జాతీయ నూతన విద్యా విధానం ప్రత్యేకంగా అధ్యయనం చేసింది. క్రెడిట్ విధానం అమలు చేయాలని సూచించిన

అన్ని వర్సిటీలూ పాటించాలని యూజీసీ సూచన

ఈ విధానం.. ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విద్యావిధానం భారత్‌లోనూ ఉండాలని కేంద్రానికి సూచించింది. ఈ సూచనల మేరకు గతేడాది యూజీసీ నిపుణులతో ఓ కమిటీని నియమించింది. అమెరికాలో ఉద్యోగాల కోసం వెళ్లే భారతీయులు అక్కడ గుర్తించే డిగ్రీలకన్నా భిన్నంగా ఉండటం వల్ల కొన్ని సమస్యలొస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని పేర్లు మార్చాలని ప్రతిపాదించింది. స్పెషలైజేషన్ చేసే విద్యార్థులకు దీనివల్ల అంతర్జాతీయంగా గుర్తింపు ఉంటుందని అధికారులు అంటున్నారు.

యూజీసీ సూచనలు ఇలా..

- దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు డిగ్రీల కొత్త విధానంపై యూజీసీ లేఖ రాసింది. ఇప్పటివరకు దేశంలో మూడేళ్ల కాలపరిమితి డిగ్రీ కోర్సులున్నాయి. వాటి స్థానంలో ఆనర్స్ కోర్సులను ప్రవేశపెడుతున్నారు. వాటి కాలపరిమితి నాలుగేళ్లు. సంబంధిత సబ్జెక్టులో లోతుగా అధ్యయనం చేసేలా కోర్సును నిర్వహించడం ఆనర్స్ కోర్సుల ఉద్దేశం.
- ఉదాహరణకు బీకాం ఆనర్స్ అనే కోర్సులో సాధారణ కోర్సుతోపాటు నిపుణులు, వివిధ వర్గాల అనుభవజ్ఞులతో ప్రాక్టికల్ నాలెడ్జ్ ఉండేలా కోర్సును రూపొందిస్తారు. మన రాష్ట్రంతోపాటు అనేక రాష్ట్రాల్లో బీఏ, బీకాం ఆనర్స్ కోర్సులను ప్రవేశపెట్టారు.
- ఉత్తరాది రాష్ట్రాల్లో మరికొన్ని కోర్సులూ అమల్లోకి వచ్చాయి. ఇష్టమైన సబ్జెక్టును ఆన్‌లైన్ ద్వారా ఏ దేశంలోని వర్సిటీ నుంచైనా చేసే వీలు కల్పించారు. ఇలా ప్రపంచ స్థాయిలో విద్యావిధానం ఏకీకృతం అవుతున్న నేపథ్యంలో బీఏ, బీకాంలను బీఎస్, ఎంఎస్‌లుగా మార్చాలని యూజీసీ భావిస్తోంది.
- రాష్ట్రంలోనూ ఇందుకు అనుగుణంగా కొన్ని కోర్సుల్లో మార్పులు చేస్తున్నారు. మల్టీ డిసిప్లినరీ కోర్సులను ఎంచుకొనే అవకాశం కల్పిస్తున్నారు. ఉదాహరణకు ఒక విద్యార్థి చరిత్ర, భౌతిక శాస్త్రం, కామర్స్ సబ్జెక్టులను ఎంపిక చేసుకొనే విధానం తీసుకొస్తున్నారు. ఇలాంటి సందర్భంలో ఈ డిగ్రీని స్పెషలేషన్ సబ్జెక్టులుగా పేర్కొనాల్సి వస్తోంది. కాబట్టి బీఎస్, ఎంఎస్ వంటి పేర్లు మార్చడం వల్ల అన్ని దేశాల్లో ఉపయుక్తంగా ఉంటుందని భావిస్తున్నారు. అయితే దీనికి అన్ని రాష్ట్రాలూ ఆమోదం తెలపాల్సి ఉంటుంది.

ఒకేచోట ఐదేళ్లు దాటితే స్థానచలనం

- నీటిపారుదల శాఖలో ఇంజనీర్ల బదిలీలు
- వివరాలు సమర్పించాలని ఆ శాఖ కార్యదర్శి ఆదేశం
- కీలక స్థానాల నుంచి అప్రధాన పోస్టులకు బదిలీ

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖలో ఒకే చోట ఐదేళ్లకు పైగా కొనసాగుతున్న ఇంజనీర్ల బదిలీలకు రంగం సిద్ధమైంది. గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో కీలక పోస్టింగ్స్ పొందిన ఇంజనీర్లకు స్థానచలనం కల్పించడానికి కాంగ్రెస్ సర్కారు కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 31 నాటికి ఏఈ/ఏఈఈ, డీఈఈ, ఈఈ, ఎస్ఈ, సీఈ, ఈఎన్‌సీ హోదాల్లో ఒకే చోట ఐదేళ్లకు పైగా సర్వీసు పూర్తిచేసుకున్న ఇంజనీర్ల వివరాలను జూన్ 4లోగా సమర్పించాలని నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా బుధవారం ఆదేశాలు జారీ చేశారు. గత ఐదేళ్లలో ఒకే చోట వేర్వేరు హోదాల్లో పనిచేసిన వారిని సైతం బదిలీ చేయనున్నారు. ఇంజనీర్లు పనిచేస్తున్న నగరం, పట్టణం, గ్రామాన్ని ప్రామాణికంగా తీసుకుని ఐదేళ్ల సర్వీసును లెక్కించనున్నారు. ప్రాధాన్యం గల పోస్టుల్లో కొనసాగుతున్న వారిని ప్రాధాన్యం లేని పోస్టులకు, ప్రాధాన్యం లేని పోస్టుల్లో కొనసాగుతున్న వారిని ప్రాధాన్యం గల పోస్టులకు బదిలీ చేయనున్నారు. విచారణలు, క్రమశిక్షణ కేసులను సైతం పరిగణనలోకి తీసుకుని బదిలీలపై నిర్ణయం తీసుకోనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల విషయంలో విచారణ ఎదుర్కొంటున్న ఇంజనీర్లను ప్రాధాన్యం లేని స్థానాలకు బదిలీ చేసే అవకాశం ఉంది.

పర్యావరణ పరిరక్షణలో ఐఆర్‌డీఏ కృషి ప్రశంసనీయం: మంత్రి కొండా సురేఖ



ప్రకృతి మిత్ర లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి సురేఖ

సాక్షి, హైదరాబాద్: సామాజిక బాధ్యతతో పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతున్న ఐఆర్‌డీఏ (ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్) స్వచ్ఛంద సేవా సంస్థ కృషి గొప్పదని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. గురువారం ఐఆర్‌డీఏ సంస్థ ప్రతినిధులు, విద్యార్థులతో కలిసి 'ప్రకృతి మిత్ర'లోగోను మంత్రి ఆవిష్కరించారు. గిన్నిస్ బుక్ రికార్డు లక్ష్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో 450 టన్నుల వేస్ట్ పేపర్‌ను సేకరించి, రీసైకిల్ చేసేందుకు ఈ సంస్థ కృషి చేస్తోంది. ఈ విధంగా రీసైకిల్ చేసిన నోట్ బుక్‌లను ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో ఐఆర్‌డీఏ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమైనదని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ సంస్థ ఆధ్వర్యంలో జూన్ 5న లక్ష మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కానున్న వారికి ఆమె అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌డీఏ సంస్థ అధ్యక్షుడు వినయ్ కుమార్, సురేశ్, మట్టా వికాస్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలో మహిళా శక్తి పాలసీ

సందీప్‌కుమార్ సుల్తానియా

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ క్రమంలో త్వరలోనే మహిళా శక్తి పాలసీని తీసుకురానున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంలో మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని ఆయన సందర్శించి విద్యార్థుల కోసం కుడుతున్న యూనిఫాంను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి యూనిఫాం అందించే లక్ష్యంతో రాష్ట్రంలో 70 లక్షల జతల దుస్తులు కుట్టించే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించినట్లు తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ 45 రోజుల్లోనే మహిళా స్వశక్తి కుట్టు కేంద్రాల ద్వారా నాణ్యతతో దుస్తులు సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ఇకపై ప్రతి పనిలో మహిళా సంఘాలకు చేయూత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 12న ప్రభుత్వం అందించే యూనిఫాం ధరించి విద్యార్థులు పాఠశాలలకు హాజరు కావాలని కోరారు. ఆయన వెంట సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావు, అదనపు కలెక్టర్ ప్రియాంక, డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, డీఈఓ అశోక్ ఉన్నారు.

165 ఆదివాసీ జంటలకు సామూహిక వివాహాలు

చినజీయర్‌స్వామి ఆధ్వర్యంలో నిర్వహణ



సామూహిక వివాహాలు నిర్వహిస్తున్న దృశ్యం

మణుగూరు రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామంలో దానధర్మ ట్రస్ట్, వికాస తరంగిణి, చినజీయర్ స్వామి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 165 ఆదివాసీ జంటలకు గురువారం ఒకే సమయంలో సామూహిక వివాహాలు జరిపించారు. చిన జీయర్ స్వామి పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా ఈ వేడుక నిర్వహించారు. ఆయన వేద మంత్రాలు చదువుతుండగా హిందూ సంప్రదాయం ప్రకారం జరిగిన ఈ వివాహాల్లో వధూవరులకు జీయర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు అందించారు. వీటితో పాటు మెట్టెలు, మంగళసూత్రాలు, శ్రీసీతారామచంద్ర స్వామి ప్రతిమ అందజేశారు. ఈ సందర్భంగా జీయర్‌స్వామి మాట్లాడుతూ.. ఆదివాసీ గ్రామాల్లోని ప్రజల్లో ఆధ్యాత్మిక జ్యోతి వెలిగించాలని, హిందూ సంప్రదాయం గురించి తెలియజేయాలని అన్నారు. నిర్వాహకులు ఒక్కో జంటకు రూ.65 వేల విలువైన వివాహ సామగ్రిని అందించడం ప్రశంసనీయమన్నారు. వివాహాలకు హాజరైన అందరికీ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవనాథ జీయర్ స్వామి, దానధర్మ ట్రస్ట్ చైర్మన్ గంటా రాధ, చిన జీయర్ స్వామి శిష్యుడు దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల పేరుతో రసాభాస

బీజేపీ ప్రధానకార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ధ్వజం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలకడలేని విధంగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రతిష్టను అభాసుపాలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు యాదవ్ ధ్వజమెత్తారు. తెలంగాణ అధికారిక చిహ్నం నుంచి చార్మినార్, కాకతీయ కళాతోరణాలను తొలగిస్తారనే అపోహలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారులు సాగించి పోరాటం ముఖ్యమైనదని.. ప్రజాభిప్రాయాలు తెలుసుకోకుండా రాష్ట్ర గేయంలో మార్పులు చేయడం సరికాదని హితవు పలికారు. గురువారం బీజేపీ కార్యా లయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి విధానపర నిర్ణయాలు తీసుకోలేక, ఏదో మార్క్ చూపించుకోవాలనే ఆతృతతో పాలన నడిపిస్తున్నారన్నారు. 6 నెలలు తిరగకముందే రేవంత్ అసమర్థపాలన పట్ల ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమౌతోందని చెప్పారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం అధికారిక చిహ్నాన్ని మార్చాలనుకుంటే ఒక కమిటీ వేసి మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉందన్నారు. తెలంగాణ జేఏసీ చైర్మన్‌గా ఉన్న కోదండరాం కాంగ్రెస్ ప్రభుత్వంలో చేరి, ఉద్యమకారుల త్యాగాలను మరిచిపోయారని విమర్శించారు.

టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా ఇనాయతుల్లా

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా మహమ్మద్ ఇనాయతుల్లా నియమితులైనట్లు టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు నడుచుకుంటానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఇనాయతుల్లా పేర్కొన్నారు.

క్లుప్తంగా...

గురుకుల సిబ్బంది సమస్యలపై వినతి

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. వేతన చెల్లింపుల్లో ఇతరుల ప్రమేయం లేకుండా.. నేరుగా ప్రిన్సిపల్ నుంచి ఆన్‌లైన్ పద్ధతిలో జరపాలని సూచించారు. మధ్యవర్తుల ద్వారా చెల్లింపుల వల్ల కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభంలోపు ప్రభుత్వం ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రూ. ఏడు వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్



ముషీరాబాద్ (హైదరాబాద్): రాష్ట్రంలోని 20 లక్షల మంది ఇంజనీరింగ్, మెడిసిన్, పీజీ, డిగ్రీ విద్యార్థుల మొత్తం ఫీజు బకాయిలు రూ. ఏడువేల కోట్లను వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. బీసీ భవన్‌లో జరిగిన 13 బీసీ సంఘాల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...గత మూడేళ్లుగా రాష్ట్ర కాలేజీ కోర్సులు చదివే బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల రూ.ఏడు వేల కోట్ల ఫీజుల బకా యిలు ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. దీనితో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గుర వుతున్నారన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే ఫీజు బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేశ్, బీసీ సంఘం అధ్యక్షుడు సి.రాజేందర్, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లాపల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

'ఎస్కీ'లో పీజీ డిప్లమో కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ)లో పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమో ఇన్ సైబర్ సెక్యూరిటీ పేరిట నిర్వహించే కోర్సుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు గురువారం తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి ఏడాది కాలపరిమితితో కూడిన ఈ కోర్సుకు దరఖాస్తులను కోరుతున్నామన్నారు. గ్రాడ్యుయేషన్ లేదా తత్సమాన కోర్సు పూర్తి చేసి 50% మార్కులు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని, గ్రాడ్యుయేషన్ ఫైనల్ ఇయర్ వార్షిక పరీక్షలు రాసేవారికి కూడా అవకాశం కల్పిస్తామన్నారు. జూన్ 1నుంచి ప్రక్రియ ప్రారంభమవుతుందని, దరఖాస్తులను సమ ర్పించడానికి జూన్ 30 చివరి తేదీగా నిర్ణయించామని తెలిపారు. రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామని, కోర్సు లో 6 సబ్జెక్టులు ఉంటాయని చెప్పారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 8886661060, 8143997446లో సంప్రదించాలని సూచించారు.

నేడు టెస్కాబ్ చైర్మన్ కొండూరి రాజీనామా!



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్ కొండూరి రవీందర్‌రావు శుక్రవారం రాజీనామా చేయనున్నారు. బోర్డు డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. వచ్చే నెల 10న అవిశ్వాస తీర్మానానికి టెస్కాబ్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అవిశ్వాస తీర్మానానికంటే ముందే ఆయన రాజీనామాకు సిద్ధపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొండూరి టెస్కాబ్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీకి అనుకూలంగా మారిన డైరెక్టర్లు రవీందర్‌రావును చైర్మన్ పదవి నుంచి తొలగించాలని నిర్ణయించడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది.

13.30 నిమిషాలు.. 12 చరణాలు

- ఇది పూర్తి స్థాయి రాష్ట్ర గేయం
- తెలంగాణ ప్రాచీన సాహిత్యం, ఆది కవులను కీర్తించేలా చరణాలు
- తెలంగాణ పోరాట సాహసవీరుల గాథల ప్రస్తావన
- 'పది జిల్లల' పదం స్థానంలో 'పదపదాన' అనే పదం
- 'నవాబుల' పదం గాయబ్.. దాని స్థానంలో భాగ్యనగరి చేర్పు

సాక్షి, హైదరాబాద్: 'జయ జయహే తెలంగాణ.' గేయాన్ని అధికారిక కార్యక్రమాల్లో ఆలపించడానికి వీలుగా..రెండున్నర నిమిషాల నిడివితో రూపొందించగా, మొత్తం 12 చరణాలతో 13.30 నిమిషాల రాష్ట్ర గేయాన్ని సిద్ధం చేశారు. రచయిత అందెశ్రీ రాసిన గేయాన్ని యథాతథంగా ఆమోదించారు. రాష్ట్రంలోని జిల్లాల సంఖ్య 10 నుంచి 33కి పెరిగిన నేపథ్యంలో తొలి చరణంలోని 'పది జిల్లల'.. అనే పదాన్ని తొలగించి 'పదపదాన' అనే కొత్త పదాన్ని చేర్చారు. 'ప్రత్యేక రాష్ట్రాన ప్రజల కలలు పండాలి'.. అనే పంక్తితో పాత గేయంలోని చివరి చరణం ముగుస్తుండగా, దాని స్థానంలో 'ప్రతిదినమది తెలంగాణ ప్రజల కలలు పండాలి' అనే పంక్తిని కొత్తగా చేర్చారు. మూడు చరణాలకు కుదించిన షార్ట్ వెర్షన్‌లో ఇవి మినహా ఇతర మార్పులు పెద్దగా లేవు. కానీ 12 చరణాల గేయంలో చాలా మార్పులు చేర్పులు జరిగాయి. 'గోలుకొండ నవాబుల గొప్ప వెలుగు చార్మినారు' అనే పంక్తిలో 'నవాబుల' అనే పదాన్ని తొలగించి దాని స్థానంలో 'భాగ్యనగరి' అనే కొత్త పదాన్ని చేర్చారు. తెలంగాణ ప్రాంత ప్రాచీన పద్య సాహిత్యంతో పాటు పంపన, బద్దెన, భీమకవి, హాలుడు, పాల్కురికి సోమనాథుడు, కాళిదాసు, మల్లినాథసూరి వంటి ఆది కవుల ప్రాశస్త్యాన్ని కొత్త తరాలకు తెలియజేసేలా వారిని కీర్తిస్తూ అందెశ్రీ నాలుగు కొత్త చరణాలను రాశారు. బౌద్ధ తార్కికత సంప్రదాయానికి పునాదులు వేసిన దిజ్ఞాగుడు, 600 ఏళ్ల కింద రాచకొండను ఏలిన సింగ భూపాలుడు, సాహస గాథల సమ్మక్క, సారక్కలు, సర్వాయి పాపన్నలు, మీరసాబు, పండు గొల్ల సాయన్నల వీరగాథలను గుర్తు చేసేలా కొత్త చరణాలు సాగుతాయి. సీఎం రేవంత్‌రెడ్డి గురువారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో మిత్రపక్ష పార్టీల నేతలకు అందించిన రాష్ట్ర గేయం వెర్షన్లు ఈ కింది విధంగా ఉన్నాయి.

2.30 నిమిషాల నిడివి గేయం

1) జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం
ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం
తరతరాల చరిత గల తల్లీ నీరాజనం
పదపదాన నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

2) జానపద జనజీవన జావళీలు జాలువార
కవిగాయక వైతాళిక కళలా మంజీరాలు
జాతిని జాగృతపరచే గీతాల జనజాతర
అనునిత్యము నాగానం అమ్మనీవే మా ప్రాణం
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

3) గోదావరి కృష్ణమ్మలు తల్లీ నిన్ను తడుపంగా
పచ్చని మా నేలల్లో పసిడిసిరులు పండంగా
సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగా ఉండాలి
ప్రతిదినమది తెలంగాణ ప్రజల కలలు పండాలి
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

13.30 నిమిషాల పూర్తి స్థాయి గేయం

1) జయజయహే తెలంగాణ జననీ జయకేతనం
ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం
తరతరాల చరితగల తల్లీ నీరాజనం
పదపదాన నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

2) పంపనకు జన్మనిచ్చి బద్దెనకు పద్యమిచ్చి
భీమకవికి చనుబాల బీజాక్షరమైన తల్లి
హాలుని గాథాసప్తశతికి అయువులూదిన నేల
బృహత్కథల తెలంగాణ కోటి లింగాల కోన
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

3) ప్రజల భాషలో కావ్య ప్రమాణాలు ప్రకటించిన
తెలుగులో తొలి ప్రజాకవి 'పాలకుర్కి' సోమన్న
రాజ్యాన్ని ధిక్కరించి రాములోరి గుడిని గట్టి
కవిరాజై వెలిగె దిశల 'కంచర్ల గోపన్న'
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

4) కాళిదాస కావ్యాలకు భాష్యాలను రాసినట్టి
'మల్లినాథసూరి' మా మెతుకు సీమ కన్నబిడ్డ
ధూళికట్ట నేలినట్టి బౌద్ధానికి బంధువతడు
దిజ్ఞాగుని గన్న నేల ధిక్కారమే జన్మహక్కు
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

5) 'పోతన'దీ పురిటిగడ్డ.. 'రుద్రమ'దీ వీరగడ్డ
గండరగండడు 'కొమురం భీముడే' నీ బిడ్డ
కాకతీయ కళాప్రభల కాంతి రేఖ రామప్ప
గోలుకొండ భాగ్యనగరి గొప్ప వెలుగు చార్మినారు
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

6) రాచకొండ ఏలుబడిగ రంజిల్లిన రేచర్ల
'సర్వజ్ఞ సింగ భూపాలుని' బంగరుభూమి
వాణీ నా రాణీ అంటూ నినదించిన కవి కులరవి
'పిల్లలమర్రి పినవీరభద్రుడు' మాలో రుద్రుడు
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

7) 'సమ్మక్క'లు 'సారక్క'లు సర్వాయి పాపన్నలు
సబ్బండ వర్ణాల సాహసాలు కొనియాడుతు
ఊరూర పాటలైన 'మీరసాబు' వీరగాథ
దండు నిడిపే పాలమూరు 'పండు గొల్ల సాయన్న'
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

8) కవిగాయక వైతాళిక కళల మంజీరాలు
డప్పు, ఢమరుకము, డక్కి, శారద స్వరనాదాలు
పల్లవుల చిరుజల్లుల ప్రతి ఉల్లము రంజిల్లగ
అనునిత్యము నీ గానం అమ్మ నీవే మా ప్రాణం
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

9) జానపద జనజీవన జావళీలు జాలువార
జాతిని జాగృతపరిచే గీతాల జనజాతర
వేలకొలదిగా వీరులు నేల ఒరిగి పోతేనేమి
తరుగనిదీ నీ త్యాగం మరువనిదీ శ్రమ యాగం
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

10) బడుల గుడులతో పల్లెల ఒడలు పులకరించాలి
విరిసే జనవిజ్ఞానం నీ కీర్తిని పెంచాలి
తడబడకుండా జగాన తల ఎత్తుకొని బ్రతుక
ఒక జాతిగ నీ సంతతి ఓయమ్మ వెలగాలి
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

11) సిరివెలుగులు జిమ్మే సింగరేణి బంగారం
అణువణువున ఖనిజాలే నీ తనువున సింగారం
సహజమైన వనసంపద సక్కనైన పువ్వుల పొద
సిరులు పండె సారమున్న మాగాణమె కదా నీ యెద
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

12) గోదావరి కృష్ణమ్మలు తల్లీ నిన్ను తడుపంగా
పచ్చని మా నేలల్లో పసిడి సిరులు పండంగా
సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగ ఉండాలి
ప్రతి దినమది తెలంగాణ ప్రజల కలలు పండాలి
జై తెలంగాణ జైజై తెలంగాణ
జై తెలంగాణ జైజై తెలంగాణ

రాష్ట్ర గేయం రెండు వెర్షన్లు!

▶ మొదటి పేజీ తరువాయి

కీరవాణితో పాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, మాజీ మంత్రి జానారెడ్డి, టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు తెలంగాణ బిల్లును ఆమోదించినప్పుడు పార్లమెంటులో ఉన్న మాజీ ఎంపీలు, ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

2.30 నిమిషాల్లో మూడు చరణాలు

జయ జయహే తెలంగాణ గీతాన్ని 2.30 నిమిషాల నిడివితో ఒక వెర్షన్‌గా, 13.30 నిమిషాల పూర్తి నిడివితో మరో వెర్షన్‌గా రూపొందించారు. రెండున్నర నిమిషాల వెర్షన్ ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆలపించేందుకు వీలుగా మూడు చరణాలతో ఉంటుందని సీఎం ప్రకటించారు. ఈ రెండింటినీ రాష్ట్ర గీతంగానే పరిగణిస్తామని స్పష్టం చేశారు. కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకే రాష్ట్ర గీతాన్ని ఆమోదించటం జరిగిందని తెలిపారు.

తెలంగాణ ప్రతిష్ట ఇనుమడించేలా కార్యాచరణ

'రాష్ట్ర అధికారిక చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలు మార్చాలనే నిర్ణయం కూడా జరిగింది. కొత్త అధికారిక చిహ్నానికి సంబంధించి ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల కళాకారుల నుంచి దాదాపు 500 నమూనాలు అందాయి. ఇవన్నీ ఇంకా చర్చల దశలోనే ఉన్నాయి. తుది రూపమేదీ ఖరారు కాలేదు. తెలంగాణ తల్లి విగ్రహానికి సంబంధించి కూడా తుది నిర్ణయం జరగలేదు. కళాకారులు వివిధ నమూనాలు తయారు చేస్తున్నారు. కొత్త చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహాలకు సంబంధించి అపోహలు, తప్పుడు ప్రచారాలకు తావు లేకుండా అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా తెలంగాణ ప్రతిష్టను ఇనుమడించేలా, భావి తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా మా కార్యాచరణ ఉంటుంది..' అని రేవంత్ చెప్పారు. ఈ సందర్భంగా కీరవాణి సంగీత సారథ్యంలోని యువ గాయనీ గాయకుల బృందం ఆలపించిన రాష్ట్ర గేయం అందరినీ అలరించింది. ఇలావుండగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహం ధనవంతుల విగ్రహంలా ఉందంటూ.. తెలంగాణ కష్టజీవుల బతుకు పోరాటం ఉట్టిపడేలా కొత్త తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించాలనే నిర్ణయం తీసుకున్నట్టుగా సీఎం చెప్పినట్లు తెలిసింది.

టీఎస్‌కు బదులు టీజీ

తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా తమ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందని, అందులో భాగంగానే రాష్ట్రానికి సంబంధించిన సంక్షిప్త రూపం టీఎస్‌ను టీజీగా మార్చినట్లు ఈ సమావేశంలో సీఎం తెలిపారు. 'వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్లకు సంబంధించి, అలాగే అన్ని ప్రభుత్వ సంస్థల విషయంలో కూడా టీఎస్‌ను టీజీగా మార్పు చేశాం..' అని చెప్పారు.

ప్రీస్కూల్స్‌గా అంగన్‌వాడీలు!

రాష్ట్ర ప్రభుత్వ యోచన..

- తొలి విడతలో ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణంలో ఉన్న 15 వేల కేంద్రాల అప్‌గ్రేడేషన్
- ఈ మేరకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రతిపాదనలు.. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సర్కార్ గ్రీన్ సిగ్నల్!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను క్రమంగా పూర్వ ప్రాథమిక పాఠశాలలు (ప్రీ స్కూల్స్)గా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. జాతీయ విద్యా విధానం–2020కు అనుగుణంగా వీటిని అభివృద్ధి చేసేలా రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కసరత్తు చేస్తోంది. తొలి విడత కింద ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణంలో ఉన్న వాటిని ప్రీస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేసే దిశగా చర్యలు వేగవంతం చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల సమాచారాన్ని క్రోడీకరించిన రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ.. ఈ మేరకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఈ కేంద్రాల ఆధునీకరణకు అవసరమైన మౌలిక వసతులు,నిధులు...తదితర అంశాలతో ప్రతిపాదనలను ప్రాథమికంగా ఖరారు చేశారు. వీటిని ప్రభుత్వ ఆమోదం కోసం పంపినట్లు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో.. జూన్ 6 తర్వాత ప్రభుత్వం ఆమోదం పొందే అవకాశం ఉన్నట్లు తెలిపాయి.

వసతులకు రూ.30 కోట్లు

ప్రస్తుతం తెలంగాణలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 15,640 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల పరిధిలో కొనసాగుతున్నాయి. వీటిల్లోనే సూత్రప్రాయంగా ప్రీ స్కూల్ విద్యను అమలు చేసేందుకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాచరణ రూపొందించింది. వీటి పరిధిలోని 3 లక్షల మంది 3 – 6 సంవత్సరాల మధ్యనున్న చిన్నారులకు ప్రీస్కూల్ విద్యను అందించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లలో భాగంగా కార్పెట్ల కొనుగోలు కోసం రూ.3.57 కోట్లు బడ్జెట్ అవసరమని ప్రతిపాదించింది. పుస్తకాలు, పఠన సామాగ్రి, బుక్ ర్యాక్స్ కోసం రూ.7.53 కోట్లు ప్రతిపాదించింది. ఆయా కేంద్రాలకు కొత్తగా రంగులు వేసేందుకు సమగ్ర శిక్షా విభాగంతో అవగాహన చేసుకుంది. పిల్లలకు ప్రత్యేక యూనిఫాం కోసం రూ.6.90 కోట్లు, ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో రెండు టేబుల్స్ ఇతర సామాగ్రి ఏర్పాటు కోసం రూ.12.96 కోట్లు ప్రతిపాదించింది. మొత్తంగా రూ.30 కోట్ల విలువైన ప్రతిపాదనలు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రభుత్వానికి సమర్పించింది.

కొత్త టీచర్లా? ప్రస్తుత సిబ్బందేనా?

ప్రీస్కూల్స్‌లో విద్యాబోధనకు శిక్షణ పొందిన టీచర్ల ఆవశ్యకత ఉంది. ప్రస్తుతం అంగన్‌వాడీల్లో పనిచేస్తున్న టీచర్లు, హెల్పర్లు పదో తరగతి అర్హతతో విధుల్లో చేరినవారే. ఈ క్రమంలో ప్రీ ప్రైమరీ విద్యాబోధనకు కొత్తగా టీచర్లను నియమిస్తారా? లేక ఇప్పుడున్న వారితో నిర్వహిస్తారా? అనే అంశంపై స్పష్టత లేదు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సమర్పించిన ప్రతిపాదనలకు ప్రభుత్వ ఆమోదం దక్కిన తర్వాత దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

సర్వస్తోత్రాలకు అర్హుడు అల్లాహ్ మాత్రమే! ఆకాశాలు మరియు భూమి యొక్క సృష్టికి మూలాధారి. ఆయన తన సృష్టిలో తాను కోరిన దానిని అధికం చేస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 31 మే 2024

ప్రకృతి వికృతి

రికార్డులు బద్దలవుతున్నాయి. వారం రోజుల్లోనే అటు రాజస్థాన్‌లో, ఇటు దేశ రాజధానిలో తాపమానం తారాజువ్వలా పైకి ఎగసింది. ఒక్క బుధవారమే రాజస్థాన్‌లో ఉష్ణోగ్రతలు పలుచోట్ల 50 డిగ్రీల సెంటీగ్రేడ్‌ను దాటేశాయి. వాయవ్య ఢిల్లీలోని ముంగేశ్‌పూర్‌లో దేశచరిత్రలోనే అత్యధికంగా 52.9 డిగ్రీలు నమోదైనట్టు స్థానిక వాతావరణ కేంద్రం నుంచి వెలువడ్డ వార్త సంచలనమైంది. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) లెక్కల్లో ఏమన్నా తప్పు దొర్లిందేమో అని అమాత్యులు అత్యుత్సాహమూ చూపారు. సరిచూసుకోవడంలో తప్పు లేదు కానీ, అన్నిటికీ ప్రామాణికమని ప్రభుత్వమే చెప్పే ఐఎండీని పక్కనబెట్టినప్పటికీ ఈ వేసవిలో దేశంలో ఉష్ణోగ్రతలు ఎన్నడెరుగని స్థాయికి చేరిన మాట చెమటలు పట్టిస్తున్న నిజం. క్రమంగా ఈ ప్రచండ ఉష్ణపవనాలు తగ్గుతాయని చెబుతూనే, ఉత్తర భారతావనికి ఐఎండీ 'రెడ్ ఎలర్ట్' జారీ చేయడం గమనార్హం. గత రెండున్నర నెలల్లో దేశవ్యాప్తంగా కనీసం 16.5 వేల మందికి పైగా వడదెబ్బకు గురైతే, పదుల మరణాలు సంభవించాయి. ఒకపక్క ఈశాన్యంలో రెమాల్ తుపాను బీభత్సం, మరోపక్క పశ్చిమ, ఉత్తర భారతావనుల్లో ఉష్ణోగ్రతల నిప్పులగుండం ఒకేసారి సంభవించడం ప్రకృతి వికృతికి చిహ్నం.

ఒక్క మనదేశంలోనే కాదు... ఇవాళ ప్రపంచవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు, అసాధారణ వాతావరణ మార్పులు కనిపిస్తున్నాయి. 2013 నుంచి 2023 మధ్య పదేళ్ళ కాలంలో అంటార్కిటికాతో సహా ప్రపంచంలో దాదాపు 40 శాతం ప్రాంతంలో అత్యధిక రోజువారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరీ ముఖ్యంగా గత రెండు మూడేళ్ళలో వివిధ దేశాల్లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 2021లో యూరప్‌లోకెల్లా అత్యధికంగా ఇటలీలోని సిసిలీలో తాపమానం 48.8 డిగ్రీలు చేరింది. 2022 జూలైలో అమెరికాలో ఉష్ణోగ్రత తొలిసారిగా 40 డిగ్రీలు దాటింది. నిరుడు చైనా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఓ పట్టణంలో 52 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఏడాది మన దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా సాధారణం కన్నా 5 నుంచి 10 డిగ్రీలు పెరగడం ఆందోళనకరం. ఇది మన స్వయంకృతం. పచ్చని చెట్లు, నీటి వసతులు లేకుండా కాంక్రీట్ జనారణ్యాలుగా మారుతున్న నగరాలతో మీద పడ్డ శాపం.

గత 2023 ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన వత్సరమైతే, ఈ 2024 కూడా అదే బాటలో నడుస్తోంది. నిజానికి, ప్రకృతి విపత్తుల స్వరూప స్వభావాలు గత 20 ఏళ్ళలో గణనీయంగా మారాయి. దేశంలో నిరుడు శీతకాలమైన ఫిబ్రవరిలోనే వడగాడ్పులు చూశాం. అనూహ్య వాతావరణ పరిస్థితులు, అందులోనూ తీవ్రమైనవి ఇవాళ దేశంలో తరచూ ఎదురవుతున్నాయి. భరించలేని ఎండలు, భారీ వరదలకు దారి తీసేటంత వానలు, బయట తిరగలేనంత చలి... ఒక దాని వెంట మరొకటిగా బాధిస్తున్నాయి. గతంలో భరించగలిగే స్థాయిలో ఉండే ప్రకృతి సిద్ధమైన వేసవి ఎండ, వడగాడ్పులు ప్రకోపించి... సరికొత్త విపత్తులుగా పరిణమించాయి. ఒకప్పుడు అసాధారణమైన 45 డిగ్రీలు సర్వసాధారణమై, ఇక 50 డిగ్రీల హద్దు తాకుతున్నాం. దేశవ్యాప్త ప్రచండ గ్రీష్మం అందులో భాగమే. పైగా, అధిక వర్షపాతంతో పర్వత ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడడం, లోతట్టున ఆకస్మిక వరదలు రావడం... భరించలేని గ్రీష్మతాపంతో కార్చిచ్చులు రేగడం... ఇలా గొలుసుకట్టు చర్యలా ఒక వైపరీత్యం మరొకదానికి దారి తీయడమూ పెరుగుతోంది.

మరో వారం పదిరోజుల్లో ఋతుపవనాల ప్రభావంతో ఎండలు తగ్గాక అనూహ్యమైన తుపానుల బెడద ఉండనే ఉంది. ఇప్పటికే ఆదివారం బెంగాల్ తీరం తాకిన రెమల్ తుపానుతో నాలుగైదు ఈశాన్య రాష్ట్రాలు దెబ్బతిన్నాయి. పెరుగుతున్న భూతాపం, దరిమిలా వాతావరణ మార్పుల వల్ల రానున్న రోజుల్లో ఇలాంటివి మరింత తీవ్రస్థాయిలో సంభవించే ప్రమాదం ఉంది. అందులోనూ ఇప్పటి తుపానులకు రెండింతల విధ్వంసం సృష్టించగలిగినవి వస్తాయని పలు అధ్యయనాల అంచనా. ఈ ముప్పు నుంచి తప్పించుకొనేందుకు అస్సామ్, మిజోరమ్, మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్ సహా రాష్ట్రాలన్నీ సన్నద్ధం కావాలి. తుపాను వస్తుందంటే ఒడిశా లాంటివి ప్రజల్ని ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు నమూనా ప్రణాళికల్ని సిద్ధం చేసుకొని, ప్రాణనష్టాన్నీ, ఆస్తినష్టాన్నీ తగ్గించుకుంటున్న తీరు నుంచి అందరూ పాఠాలు నేర్వాలి.

అసలు మన దేశంలో జాతీయ విపత్కాల నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) దాదాపు రెండు దశాబ్దాలుగా ఉంది. 1999లో ఒరిస్సాలో భారీ తుపాను, 2004లో సునామీ అనంతరం 2005లో దాన్ని స్థాపించారు. అప్పటి నుంచి జాతీయ విపత్తుల అంచనా, నివారణ, విపత్కాల పరిస్థితుల నిర్వహణ, బాధితుల సహాయ పునరావాసాలకు అది కృషి చేస్తోంది. ఎక్కడ ఏ మేరకు పనిచేస్తున్నాయన్నది పక్కనపెడితే, ప్రస్తుతం దాదాపు ప్రతి రాష్ట్రమూ దేనికది విపత్కాల నిర్వహణ సంస్థ పెట్టుకుంది. అయితే, ఇది చాలదు. అంతకంతకూ పెరుగుతున్న విపత్తుల రీత్యా కొత్త అవసరాలకు తగ్గట్టుగా ఈ వ్యవస్థలలో సమూలంగా మార్పులు చేర్పులు చేయాలి. వేడిమిని తట్టుకొనేందుకు శీతల కేంద్రాల ఏర్పాటు, విస్తృతంగా చెట్ల పెంపకం, పునర్వినియోగ ఇంధనాల వైపు మళ్ళడం లాంటివి ఇక తప్పనిసరి. థానే లాంటి చోట్ల ఇప్పటికే అమలు చేస్తున్న పర్యావరణహిత ప్రణాళికల లాంటివి ఆదర్శం కావాలి. ఎండ, వాన, చలి... ఏది పెచ్చరిల్లినా తట్టుకొనేలా ప్రాథమిక వసతి సౌకర్యాల కల్పన సాగించాలి. వేసవి ఉక్కపోత పోయిందని సంబరపడే లోగా భారీ వర్షాలు విపత్తుగా పరిణమించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇకనైనా ప్రకృతి ప్రమాదఘంటిక వినకుంటే కష్టమే!

ముస్లిం కోటా చుట్టూ రాజకీయాలు

విశ్లేషణ



ఖాలిద్ అనీస్ అన్సారీ

ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ముస్లింల కోటా అంశం తెరపైకి వస్తూ... గతం తాలూకు గాయాలను గుర్తు చేస్తూ ఉంటుంది. ముస్లింలు వెనుకబడిపోయారన్న అంశం కోటా కోరడానికి ప్రాతిపదిక. వీరు వెనుకబడిపోయారన్న కారణంతోనే 1906లో 'ఆలిండియా ముస్లిం లీగ్' ఏర్పడింది. అలాగే ముస్లింలకు వేరుగా ఓటరు జాబితా (1909), ప్రభుత్వ సర్వీసుల్లో ప్రత్యేకంగా 25 శాతం కోటా (1926)లు అందుబాటులోకి వచ్చేందుకూ ఇదే కారణం. వీటివల్ల అష్రాఫ్‌ల వంటి ఉన్నతవర్గాలతో 'ముస్లిం సమాజం' ఒకటి కొత్తగా పుట్టుకొచ్చింది. లాభపడింది కూడా ఈ సమాజమే. అనవసరమైన చేర్పులతో కాంగ్రెస్ పార్టీ ; దళిత మూలాలున్న ముస్లింలను ఎస్సీ కోటాలో చేర్చడాన్ని వ్యతిరేకించిన బీజేపీ... రెండూ ముస్లింల వెనుకబాటుకు కారణమయ్యాయి.

ముస్లింలకు కోటా విషయంలో బీజేపీ, కాంగ్రెస్‌లు రెండూ కొట్లాటకు దిగుతూండటం మనం చూస్తూనే ఉన్నాం. అయితే ఈ కొట్లాటల మూలం మాత్రం బ్రిటిష్ పాలకుల కళ్లముందు జరిగిన దేశ విభజన గాయాలే అని మేధో వర్గంలోనూ అటు ఏకాభిప్రాయం, ఇటు భిన్నాభిప్రాయమూ ఉన్నాయి. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి కూడా ముస్లింల కోటా అంశం తెరపైకి వస్తూ... గతం తాలూకూ గాయాలను గుర్తు చేస్తూ ఉంటుంది. తద్వారా రాజకీయం మొత్తం హిందూ-ముస్లిం, మెజార్టీ-మైనార్టీ, సెక్యులర్-కమ్యూనల్, ఇస్లామోఫోబియా అన్న అంశాలకే పరిమితమవుతూ ఉంటుంది. ఈ భావజాలం కాస్తా కుల మతాలకు అతీతంగా సామాజిక న్యాయం వంటి విస్తృతాంశాలపై జరగాల్సిన చర్చను కట్టడి చేసేందుకు ఒక వర్గానికి చక్కగా ఉపయోగపడుతోంది.

వలస పాలన ముగింపు దశలో ప్రభుత్వ పాలన వ్యూహాలు, అంతులేని మత ఘర్షణలు, మత పునరుజ్జీవన యత్నాల ఫలితంగానే దేశంలో హిందు, ముస్లిం సమాజాలన్న భావన పుట్టుకొచ్చింది. ఈ వర్గాల్లోని ఉన్నత వర్గాలు 'ద్విజులు', 'అష్రాఫ్'లు ఈ భావజాలాన్ని పెంచి పోషించారు. ఈ కారణంగా మతం ఆధారంగా కొనసాగిన రాజకీయాలు... మతానికి వ్యతిరేకంగా నడిచిన ఉద్యమాలతో వైరం పెంచుకున్నాయి. గతంలో పాల్‌బ్రాస్ చెప్పినట్లు 'ముస్లింలు వెనుకబడిపోయారన్న భ్రమ' పునాదులు 1882 నాటి హంటర్ కమిషన్ నాటి నుంచే కనిపిస్తుంది. అప్పట్లో కేవలం బెంగాల్ నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ముస్లిం సమాజం మొత్తం వివక్షకు గురైనట్లు చిత్రీకరించారు. ఉదాహరణకు 1881 – 1921 మధ్యలో ప్రభుత్వ ఉద్యోగాల్లోని ముస్లింల శాతం 34.8 నుంచి 47.2కు వెళ్లింది. అయితే ఈ మధ్యకాలంలోనే దేశంలో ముస్లింల జనాభా కూడా 19 శాతం (1881) నుంచి 23 శాతానికి (1921) పెరిగింది. మతానికీ, సామాజిక స్థాయికీ మధ్య సంబంధం ఉందన్న దృష్టికోణం నుంచి ఈ సమాచారాన్ని పరిశీలిస్తే వలసపాలకుల ప్రాపకంతో వచ్చిన లబ్ధిని ముస్లింలలోని ఉన్నత వర్గాలైన అష్రఫీలు అందుకున్నట్లు స్పష్టమవుతుంది. సాంస్కృతిక అంశాలను పెట్టుబడిగా పెట్టి వీరు సాధారణ ముస్లింలను పక్కకు తోసి ఈ లాభాలు పొందారు. ముస్లింలు వెనుకబడిపోయారన్న భ్రమే 1906లో 'ఆలిండియా ముస్లిం లీగ్' ఏర్పాటుకు కారణమైంది. అలాగే ముస్లింలకు వేరుగా ఓటరు జాబితా (1909), ప్రభుత్వ సర్వీసుల్లో ప్రత్యేకంగా 25 శాతం కోటా (1926)లు అందుబాటులోకి వచ్చేందుకూ ఇదే కారణం. వీటి వల్ల అష్రాఫ్‌ల వంటి ఉన్నతవర్గాలతో కూడిన 'ముస్లిం సమాజం' ఒకటి కొత్తగా పుట్టుకొచ్చింది. లాభపడింది కూడా ఈ సమాజమే. 'ముస్లింలు ముప్పును ఎదుర్కొంటున్నారు'... 'ముస్లింల మెప్పు పొందే ప్రయత్నాల'న్న భావజాలం కూడా ఈ అష్రాఫ్‌ల వంటి ఉన్నత వర్గాలు సమాజంలోకి చొప్పించినవే.



భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ కూడా తొలినాళ్ల నుంచి వలసపాలకుల 'ముస్లిం ఫస్ట్' విధానంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దిగువ తరగతి ముస్లింలతో 'మోమిన్ కాన్ఫరెన్స్'ను స్థాపించిన అబ్దుల్ ఖయ్యూమ్ అన్సారీ కూడా ఈ కోవకు చెందిన వ్యక్తే. 1930ల్లో ఏర్పడ్డ మోమిన్ కాన్ఫరెన్స్ ముస్లిం లీగ్‌ను అష్రాఫ్ ముస్లిం కూటమిగా వ్యవహరించేది. అలాగే మహమ్మద్ అలీ జిన్నా ప్రతిపాదించిన 'టూ నేషన్ థియరీ'ని తీవ్రంగా వ్యతిరేకించింది కూడా. 1939లో దేశంలోని ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనీ, దిగువ తరగతి ముస్లింలకు వేరుగా జాబితా, ప్రాతినిధ్యం కల్పించాలనీ మోమిన్ కాన్ఫరెన్స్ డిమాండ్ చేసింది.

పన్నులు కట్టే, విద్యార్హతలు, ఆస్తులుండే వారికి మాత్రమే ఓటు హక్కు ఉండేది అప్పట్లో. వీరు ముస్లిం లీగ్‌కు ప్రాతినిధ్యం వహించేవారు. ముస్లిం ఉన్నత వర్గాల ప్రయోజనాల కోసమే పనిచేసేవారు. అయితే 1946 ఎన్నికల్లో ముస్లింలీగ్ విజయం సాధించడంతో దేశ విభజన అడ్డుకునేందుకు మోమిన్ కాన్ఫరెన్స్ ప్రయత్నాలు సరిపోలేదు. స్థూలంగా చూస్తే ముస్లిం అష్రాఫ్‌లు జిన్నా దేశ విభజన పిలుపునకు ఊ కొట్టారనీ, దిగువస్థాయి ముస్లింలు వ్యతిరేకించడంతోపాటు గాంధీ, కాంగ్రెస్ పార్టీలతో కలిసి పని చేశారనీ అర్థమవుతుంది. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కాంగ్రెస్ పార్టీలో ముస్లిం లీగ్ భాగమైపోయింది. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ వంటి వారితో కలిసి ముస్లింలను జనజీవన స్రవంతిలోకి చేర్చేందుకు ఇది అవసరమన్న మిష చూపింది. కాలక్రమంలో ఈ అష్రాఫ్ నేతలు కాంగ్రెస్‌లో ముస్లిం వ్యవహారాలపై వ్యాఖ్యాతలుగా మారారు. ఈ క్రమంలోనే దిగువ జాతి ముస్లింల అభివృద్ధి నలిగిపోయింది.

స్వాతంత్ర్యం తరువాత రెండుసార్లు (1955, 1979) ఏర్పాటైన వెనుకబడిన వర్గాల కమిషన్లు (కాకా కేల్కర్, మండల్ కమిషన్లు) కూడా ముస్లింలను వెనుకబడిన వర్గాలుగా పరిగణించలేదు. మండల్ కమిషన్ నివేదిక 82 కులాల ముస్లింలు సామాజికంగా వెనుకబడి ఉన్నారని చెప్పడంతో... మతాలకు అతీతంగా అణచివేతకు గురైన కులాల అంశంపై విస్తృత చర్చకు మార్గం ఏర్పడింది. అలీ అన్వర్ నేతృత్వంలోని 'పస్మాందా ఉద్యమం' ముస్లిం కోటాను వ్యతిరేకిస్తూనే దళిత, ఆదివాసీల వంటి సామాజిక వెనుకబాటుతనం ఎదుర్కొంటున్న కులాలకు న్యాయం చేయాలనీ, ఇది మతాలకు అతీతంగా జరగాలనీ డిమాండ్ చేస్తూ వచ్చింది.

1990 తొలి నాళ్లలో భారతీయ ముస్లింలలో 85 శాతం వరకూ ఉన్న దిగువ తరగతి ముస్లింలకు వేర్వేరు రాష్ట్రాల్లోని ఓబీసీ కోటాల్లో రిజర్వేషన్లు లభించేవి. అయితే కాంగ్రెస్‌లోని అష్రాఫ్ ముస్లింలు పస్మాంద వర్గాలకు లభిస్తున్న చిన్నపాటి సౌకర్యాలను కూడా పట్టాలు తప్పించే ప్రయత్నం చేసేవారు. ముస్లిం కోటాను డిమాండ్ చేయడం, ఓబీసీ వర్గాల్లో మతం ప్రస్తావన తేవడం ద్వారా ఇది జరిగేది. 2004 కాంగ్రెస్ మేనిఫెస్టోలో ముస్లిం కోటా ప్రస్తావన, కేంద్ర ఓబీసీ కోటాలో మైనార్టీల్లోని వెనుకబడిన వర్గాల వారికి 4.5 శాతం సబ్‌కోటా ఏర్పాటు వంటివన్నీ పస్మాందా వర్గాలకు లభిస్తున్న సౌకర్యాలను తప్పించే ప్రయత్నాలకు నిదర్శనాలు. దళితుల కంటే ముస్లింలు వెనుకబడి పోయారన్న తప్పుడు అంచనాకు సచార్‌కమిటీ వచ్చిందంటారు. నిజానికి దీన్ని అష్రాఫ్ వర్గాలు ముందుకు తెచ్చాయి.

ముస్లిం కోటాపై కాంగ్రెస్ వైఖరిని ఇటీవలే ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విమర్శించారు. ముస్లిం ఓట్ల కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని బీజేపీ చెబుతున్నా... దాన్ని అష్రాఫ్ వర్గం మెప్పుకు మాత్రమే కాంగ్రెస్ ప్రయత్నించిందన్నట్లుగా చెప్పాలి. కాంగ్రెస్ పార్టీ గతంలో కొన్ని తప్పులు చేసిందని రాహుల్ గాంధీ పరోక్షంగా ఒప్పుకున్నప్పటికీ వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం ఇప్పుడు చేస్తారా అన్నది మాత్రం స్పష్టం చేయలేదు. హంటర్ నుంచి సచార్ వరకూ ఏర్పాటైన కమిషన్ల నివేదికలను అధ్యయనం చేసి ముస్లింల వెనుకబాటుతనాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తుందా? అనవసరమైన చేర్పులతో కాంగ్రెస్ పార్టీ ముస్లింల వెనుకబాటు తనానికి కారణమైతే; బీజేపీ... ముస్లింలు, క్రిస్టియన్లు, దళిత మూలాలున్న ముస్లింలను ఎస్సీ కోటాలో చేర్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకించడం ద్వారా ముస్లింల వెనుకబాటు తనానికి కారణమైందని చెప్పాలి.

వ్యాసకర్త అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ ప్రొఫెసర్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వందే భారతం



జూన్ 2న జరగనున్న మెక్సికన్ జాతీయ ఎన్నికల్లో ఇప్పటివరకూ 36 మంది అభ్యర్థులు హత్యకు గురయ్యారు. ప్రపంచ వ్యాప్త ఎన్నికల ప్రజాస్వామ్యాలను మనం ఎంతగా అధ్యయనం చేస్తే, ఇండియా అంత అద్భుతంగా కనబడుతుంది. అన్నట్టూ, మెక్సికో తలసరి ఆదాయం ఇండియా కంటే రెండున్నర రెట్లు ఎక్కువ.

– శమికా రవి, ఆర్థికవేత్త

నవ్వకూడదా?



దౌత్యకార్యాలయాల్లో పనిచేసేవారిని నవ్వడానికి, మర్యాదగా వ్యవహరించడానికి, దయగా ఉండటానికి ఎందుకు అనుమతించరో అర్థం కాదు. అక్కడికొచ్చే చాలా మంది టెన్షన్‌లో, అనిశ్చితిలో, ఆఖరికి ఒకింత భయంతో కూడా ఉంటారు. మానసికంగా వారిని కొంచెం తేలికపరిస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. కానీ మన దౌత్య సిబ్బంది అలా చేయరు.

– హర్ష భోగ్లే, క్రికెట్ కామెంటేటర్

మీ ఓటు వల్లే...



జెనులారా, మీ ఓటు నిజంగా లెక్కలోకి వస్తుందా అని ఎవరైనా ఆశ్చర్యపోతుంటే, ఇది గుర్తుంచుకోండి. నల్లజాతి అమెరికన్లు ఓటు వేయడం వల్లనే... నేను అధ్యక్షుడినయ్యాను. కమలా హ్యారిస్ చారిత్రకంగా ఉపాధ్యక్షురాలయ్యారు. ఇక డోనాల్డ్ ట్రంప్ ఓడిపోయారు.

– జో బైడెన్, అమెరికా అధ్యక్షుడు

అలసట



నాకు 26 ఏళ్లు. ఉద్యోగం చేయడం మొదలుపెట్టాను. నాన్న ఎందుకు ప్రతిరోజూ రాత్రి తొమ్మిదిన్నర, పదికల్లా నిద్రపోయేవారో ఇప్పుడు అర్థమవుతోంది.

– అనుభా పాండే, జర్నలిస్ట్

ఉష్ణ ప్రపంచం




50 డిగ్రీల ఉష్ణోగ్రతల ప్రపంచానికి స్వాగతం. మిమ్మల్ని చల్లబరుచుకోవడానికి బిగించుకున్న ఏసీల్లో ఈ భరించలేని అధిక వేడిలో మంటలు రేగుతాయి. వేగంగా ఉద్గారాలు తగ్గకపోతే 60 డిగ్రీల ప్రపంచం ఎంతో దూరంలో లేదు. కర్బన ఇంధన వినియోగం మానేయడం తప్ప మరేదీ అధిక వేడి నుంచి ఈ భూగ్రహాన్ని మరొకటి కాపాడ లేదు.

– నీలిమ వల్లంగి, కాలమిస్ట్

చిత్రం చెక్కిలిపై చెదరని సంతకం!

1968 మే నెలలో, ఇటువంటి రాళ్ళు పగిలే ఎండల్లోనే ఒక ప్రభుత్వ బృందం అనంతపురం జిల్లా బయలుదేరింది. అక్కడి లేపాక్షి, తాడిపత్రి తదితర ప్రాంతాలను సందర్శించి అప్పటి ప్రభుత్వ పత్రిక 'ఆంధ్రప్రదేశ్' లో వ్యాసాలు రాయడానికి, ఒక రిపోర్ట్ తయారు చేయడానికని. అందుకోసం ఆ జట్టులో రాసేవాళ్ళు, ఫోటోలు తీసేవాళ్లు, బొమ్మలు వేయడానికి కూడా ఒక ఆర్టిస్ట్ ఉన్నారు. తెలుగు చిత్రకళ చెదరని సంతకాలలో ఒకరైన శీలా వీర్రాజు (శీలావీ) ఆ బృంద సభ్యుల్లో ఒకరు. ఆయన లేపాక్షి సందర్శన ఒక చిత్రకారుడి హోదాలో కాదు, సమాచారశాఖలో ఒక ఉద్యోగిగా మాత్రమే. అయినా చిత్రకళ మీద ఉన్న అభిరుచి కారణంగా తన స్కెచ్ బుక్ పట్టుకుని కదిలారు ఆ పురాతన శిథిలాలయ క్షేత్రానికి.

లేపాక్షి చేరి దేవాలయ చరిత్ర గురించి, శిల్పాల గురించి పూజారి చెబుతున్న వివరాలను ఒక చెవిన వింటూ, తన చేతనున్న స్కెచ్ బుక్‌ని బొమ్మలతో నింపేశారు శీలావీ. ఆయనకు ఆ దేవతలు, వారి కథలు – గాథలు, భక్తి, కైవల్యం, కైంకర్యం, ఏమీ పట్టలేదు. ఆయన అక్కడ చూసిందల్లా ఆ శిల్పాలనూ, కఠినమైన నల్లరాయికి ఉలి అంచు పరుసవేది తాకించి ఆ రాయీ రప్పా, బండలను వెన్న చేసి శిల్ప మూర్తులుగ మలచిన సంతకం తెలియని కళాకారుడి దప్పి మాత్రమే. పెద్ద శిలను లేపాక్షినందిగా మలచి, దాని మెడను చుట్టిన మంజీర శబ్దాలు మాత్రమే ఆయనకు వినపడ్డాయి.



లేపాక్షిలో... శీలా వీర్రాజు (1968)

మోచేయి వంపులో స్కెచ్ పుస్తకాన్ని ఇరికించుకుని గంటల తరబడి బొమ్మను గీస్తే ఏం వస్తుంది. ఉద్యోగంలో ఉన్నత స్థానానికి ఎక్కగలిగే కాలి కింది మెట్టుగా పనికి వచ్చేనా? నలుగురు మనుషుల కళ్ల గుమ్మం గుండా వెళ్ళి గుండెను పలకరించేనా ఆర్ట్? కర్ట్ వానెగట్ అనే అమెరికన్ రచయిత బడి పిల్లలకోసం ఒక అద్భుతమైన లేఖను రాశారు. గుండెపొరలలో దాచుకుని పదేపదే తడుముకోవాల్సిన లేఖ అది. ఆ ఉత్తరంలో ఆయన పిల్లలను ఉద్దేశించి అన్నా, మనమందరం నేర్చుకోవలసిన పాఠం ఉంది. 'నాయనలారా మీరు ఏదైనా కళను అభ్యసించండి. అది పాడటం కావచ్చు, రాయడం కావచ్చు, బొమ్మలు గీయడం కావచ్చు, ఏదయినా కావచ్చు, కానీ కళలను అభ్యసించండి. డబ్బుకోసం, కీర్తికోసం, పెద్దపేరు కోసం కాదు. అనుభూతి చెందడం, మీలో ఏముందో తెలుసుకోవడం, టు మేక్ యువర్ సోల్ గ్రో వంటివాటి కోసం కళను తెలుసుకోండి'. జీవితాంతం శీలావీ అదే పని చేశారు. ఆయన కళ ద్వారా తన హృదయంలో దీపం వెలిగించుకున్నారు. దీపం దీపాన్ని వెలిగిస్తుంది అని నమ్మారు.

రాయి ప్రకృతిది, రాయిని చెక్కిన ఉలి లోహం ప్రకృతిది. బొమ్మను గీసుకున్న కాగితం ప్రకృతిది; పెన్సిల్ ముక్క తాలుకు బొగ్గు, దానిని ఇముడ్చుకున్న కలప ప్రకృతిలో భాగాలే. కాగితం మీద బొమ్మ వేయడం అంటే ప్రకృతి ప్రకృతిని కౌగిలించుకోవడమే. శీలా వీర్రాజు లేపాక్షిలో రెండు రోజులు ఉన్నారు. ఆ రెండు రోజుల్లో దాదాపు యాభై స్కెచ్‌లు గీసుకున్నారు. మండే సూర్యుడి కింద నిలబడి, కాలే రాళ్ళ మీద కూచుని బొమ్మలు గీశారు. ఈ బొమ్మలన్నీ దాదాపుగా 30 సెంటీ మీటర్ల వెడల్పు, 42 సెంటీ మీటర్ల కొలతల్లో వేసిన పెద్ద బొమ్మలు. ఫౌంటైన్ పెన్ గీతల బొమ్మలివి. ఎదురుగా కనిపిస్తున్న దృశ్యాన్ని బొమ్మ వేస్తున్నప్పుడు చిత్రకారుడి చూపు వస్తువు వైపే ఉంటుంది. చేతి వేళ్ళు, ఇంకు పెన్ను ముక్కు మాత్రమే కాగితాన్ని చూస్తుంటాయి. మంచి చిత్రకారుడి దృష్టి ఏమాత్రం కాగితాన్ని చూడదు. అంత పెద్ద కాగితంపై తొట్రుపడకుండా పరుగెత్తిన వీర్రాజు గీత తీవ్రత మనల్ని విస్మయుల్ని చేస్తుంది. తోటి చిత్రకారులను కొంచెం భయపెడుతుంది కూడా. కేవలం రెండు రోజుల్లో అంత పెద్ద బొమ్మలను, అంత నైపుణ్యంగా వేయడం మాట కాదు అనుకుంటామా, శీలావీ ఇంకోలా అంటారు: 'నేను అక్కడి శిల్పాలకు మాత్రమే స్కెచ్‌లు గీసుకున్నాను. గోడల మీద, పైకప్పు మీద రంగుల్లో చిత్రించిన పురాతన చిత్రాలు కూడా ఉన్నాయి. అచ్చమైన దేశీయ శైలి చిత్రాలవి. నేను వాటి జోలికి పోలేదు. సమయం చాలకపోవటం ఒక కారణమైతే, తీసుకెళ్లిన స్కెచ్ బుక్ పూర్తయిపోయి ఆ పల్లెటూళ్ళో డ్రాయింగ్ పేపర్లు దొరక్కపోవడం మరో కారణం'. ఈ రోజుల్లోలా విరివిగా దొరికే కాలమై ఉంటే ఈ బొమ్మలు చెప్పే కథ ఇంకోలా ఉండేది.

కాలం గడిచి కథలు కంచికి చేరుతాయి. గాలిపటాన్ని దారం వదిలేస్తుంది. రెండు సంవత్సరాల క్రితం శీలా వీర్రాజు కాలం చేశారు. ఆయన ఎగురవేసిన గాలిపటాన్ని తెగిపడనీయకుండా ఆయన సహచరి శీలా సుభద్రాదేవి ఎత్తిపట్టుకున్నారు. ఆయన చిత్రించిన ప్రతి బొమ్మల గాలిపటాన్నీ ఆకాశం ఎత్తుకు తీసుకు వెళ్ళి ప్రపంచానికి చూపించే పని ఆరంభించారు. శీలావీ లేపాక్షి స్కెచ్‌లతో పాటు రామప్ప, అజంతా–ఎల్లోరా, కోణార్క్ స్కెచ్‌లన్నీ కలిపి ఒక పెద్ద గాలిపటమంత పుస్తకం ప్రచురించారు. జూన్ ఒకటవ తేదీ శనివారం హైదరాబాదు రవీంద్రభారతిలో ఆ పుస్తక ఆవిష్కరణ, వీర్రాజు గారి సంస్మరణ.


– అన్వర్ | ఆర్టిస్ట్
(హైదరాబాదులో రేపు శీలా వీర్రాజు సంస్మరణ సభ)

గొప్ప పరిపాలనా దక్షురాలు

దేశమంతా ఈ నెల 31 నుంచి వచ్చే ఏడాది మే 31 దాకా అహిల్యాబాయి త్రిశత జయంతి ఉత్సవాలు జరుపుకుంటోంది. సాధారణ రైతు కుటుంబంలో జన్మించినప్పటికీ తెలివి, మేధస్సు, ధైర్యసాహసాలతో ఆమె మహారాణిగా ఎదిగారు. సువిశాల భూభాగంలో పరిపాలన చేసి ఎన్నెన్నో సంస్కరణలు తెచ్చారు. మహిళలకు ఆస్తి హక్కు, బాలిక విద్య కోసం కృషి చేసిన సంఘ సంస్కర్త ఆమె.

మహారాష్ట్రలోని అహ్మద్ నగర్ వద్ద గల చోండి గ్రామంలో అహిల్యాబాయి 1725 మే 31న జన్మించారు. ఆమె తల్లి సుశీలా షిండే, తండ్రి మంకోజీ షిండే. నేటి రాజకీయ భాషలో సంచార తెగల కుటుంబం ఆమెది. చిన్న నాటనే ఆమెకు గల భక్తి, నిర్భీతి చూసి మల్హార రావు హోల్కర్(మరాఠా సుబేదారు) ముగ్ధుడయ్యారు. తన కుమారుడు ఖాండేరావు హోల్కర్‌కు ఇచ్చి వివాహం చేశారు. అప్పుడామె వయస్సు పదేళ్లు, పెళ్లి కొడుకు వయస్సు పన్నెండేళ్లు. అలా రాజ కుటుంబంలోకి ప్రవేశించింది. అక్కడే యుద్ధ విద్యలు, ప్రజా పాలనా విద్యలు నేర్చింది. వారి మామగారి వెంట అనేక యుద్ధాలకు వెళ్లి, యుద్ధ విద్యలో నైపుణ్యం సంపాదించింది. గెరిల్లా యుద్ధ విద్యలో ఆరితేరింది.

అయితే, భర్త ఖాండే రావు 1754లో, తండ్రి వంటి మామ మల్హార రావు 1766లో, తర్వాతి ఏడాది కుమారుడు మాలే రావు... ఇలా ముఖ్యులందరూ అకాలంగా తనువు చాలించారు. ఈ పిడుగుపాటు ఘటనలతో అహిల్య కుంగిపోలేదు. 16 యేండ్ల కుమారుణ్ణి కోల్పోయిన దుఃఖంలోనే 1767లో సింహాసనం అధిరోహించారు. శివ భక్తురాలుగా శివుని ప్రతినిధిగా పరిపాలన చేపట్టారు. ఇండోర్‌కు దూరంగా, నర్మదా నదీ తీరాన ఉన్న మహేశ్వర్ (మధ్య ప్రదేశ్) గ్రామాన్ని తన ముఖ్య పట్టణంగా నిర్మించారు. అది సమగ్ర పట్టణాభివృద్ధి యోజనకు మంచి ఉదాహరణ.



కాశీ విశ్వనాథ ఆలయ ఆవరణలోని అహిల్యాబాయి హోల్కర్ విగ్రహం

గొప్ప సంస్కరణ వాది

మహిళలకు విద్య, భర్తను కోల్పోయిన మహిళలకు భర్త ఆస్తిపై హక్కు, వితంతువులకు పునర్వివాహం చేసుకునే అవకాశం, బాల్య వివాహాల పట్ల ఆంక్షలు... ఇలా ఎన్నో సాహసోపేత నిర్ణయాలు ఆమె తీసుకున్నారు. ఆమె పాలనలో అడవుల నరికివేతను నిషేధించారు. ఆదాయం ఇచ్చే చెట్లను నాటించారు. త్రాగుడును నిషేధించారు. వరకట్నాన్ని నిషేధించారు. ఆమె కోట తలుపులు సామాన్యులు తమ గోడు చెప్పుకోడానికి ఎప్పుడూ తీసే ఉండేవి. వ్యవసాయం కొరకు నూతన చెరువుల నిర్మాణం, నీటి నిల్వకు ట్యాంకులు, నదులపై ఘాట్‌లు నిర్మించారు. వస్త్ర పరిశ్రమ, పట్టు పరిశ్రమ ఉత్పత్తుల అమ్మకాలకు వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేశారు. మహేశ్వరీ చీరలు అంటే ఇప్పటికీ మంచి పేరే ఉంది!

భిల్లులు, గోండులు వంటి గిరిజనులకు భూములను ఇచ్చి వారిని వ్యవసాయం వైపు మళ్లించారు. అటవీ ప్రాంతంలో ప్రజలకు దారి చూపుతూ ఉండే భిల్లులకు ప్రజల నుండి భిల్ కావడి వంటి పన్నును సేకరించుకునేట్లు ప్రోత్సహించారు. ఆ ఆదాయంతో గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, అభివృద్ధి పథకాలు చేపట్టారు.

హిందూ ఆలయాల పునరుజ్జీవనం కోసం...

తన రాజ్యం పైకి ఇతరులు దాడికి వస్తే, గుర్రం ఎక్కి, ఖడ్గం చేతపట్టి రణరంగంలో స్వయంగా నేతృత్వం చేపట్టిన ధీర వనిత ఆమె. 1783లో జైపూర్ రాజ కుటుంబానికి చెందిన చంద్రావంత్‌ను అణిచి వేయడంలో ఆమె చూపిన యుద్ధ నైపుణ్యాన్ని నానా ఫడ్నవీస్ పొగుడుతూ ఆనాడు పూనాలో గాలిలో శతఘ్నులను పేల్చాడు.

ఆమె హిందూధర్మ పునరుజ్జీవనానికి ఎంతగానో కృషి చేశారు. విదేశీ పాలకుల వల్ల దేశ వ్యాప్తంగా ధ్వంసం అయిన 82 మందిరాలను తిరిగి నిర్మించారు. సోమనాథ్, రామేశ్వరం, కాశీ, గయ, పూరి, శ్రీశైలం... ఇలా అనేక మందిరాలను పునర్నిర్మాణం చేశారు. అన్నదాన సత్రాలను కట్టించారు. తన రాజ్యంలో అన్ని కులాల, మతాల ప్రజల పట్ల సమ భావంతో వ్యవహరించారు. కనుకనే టిప్పు సుల్తాన్ వంటి ముస్లిం రాజులు సైతం ఆమె ధార్మిక నిర్మాణాలకు అడ్డు చెప్ప లేకపోయారు. ఆమె సంస్థానంలో దేశంలోని 13 రాజ్యాలకు చెందిన ప్రతినిధులు ఉండేవారు. వివిధ రాజులతో మిత్రత్వం నడిపి, నూతన దౌత్య విధానాలకు దారి చూపారు. కనుకనే దేశ వ్యాప్తంగా వివిధ రాజుల రాజ్యాలలోని హిందూ దేవాలయాలను పునర్నిర్మాణం చేయగలిగారు.

సాధారణంగా కవులు... రాజులను పొగిడి ధన సేకరణ చేసుకుంటూ ఉంటారు. కవులు ఆమెను పొగుడుతూ కవిత్వం రాయడాన్ని ఆమె అంగీకరించేది కాదు. 'నన్ను పొగుడుతూ కవిత్వం చెబితే మీకు ఆదాయం ఉండదు. ఆ శివుడిని పొగడండి లేదా దేశాన్ని కాపాడుతున్న సైనికులను పొగుడుతూ కవిత్వం రాయండి' అనేది. అయినా ఆమెను లోకమాత, సాధ్వి, పుణ్యశ్లోక, మాతృశ్రీ వంటి బిరుదులతో ప్రజలు గౌరవించారు. 1795 ఆగస్ట్ 13న తన 70వ ఏట తనువు చాలించిన ఆమెను ధార్మిక ప్రవృత్తి కల్గిన పరిపాలకురాలిగా పాశ్చాత్య చరిత్రకారులు కొనియాడారు. ఆమె జన్మించి 300 ఏళ్లయింది. కర్మ యోగిగా, మాతృత్వం నిండిన రాణిగా ఆమెను పేర్కొనడం సముచితం.

– శ్యాంప్రసాద్ జీ | అఖిల భారతీయ సంరసతా ప్రముఖ్
(నేటి నుంచి అహిల్యాబాయి హోల్కర్ త్రిశత జయంతి ఉత్సవాలు ప్రారంభం)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: బ.అష్టమి ఉ.8.47 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: శతభిషం ఉ.5.50 వరకు, తదుపరి పూర్వాభాద్ర తె.4.08 వరకు (తెల్లవారితే శనివారం), వర్జ్యం: ఉ.11.46 నుండి 1.15 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.04 నుండి 8.56 వరకు, తదుపరి ప.12.24 నుండి 1.16 వరకు, అమృతఘడియలు: రా.8.41 నుండి 10.11 వరకు; రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం : 5.28, సూర్యాస్తమయం : 6.26.

క్లుప్తంగా...

రాష్ట్రంలో విత్తనాల కొరత లేదు


• కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వానాకాలం పంటల సాగుకోసం అవసరమైన విత్తనాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని, విత్తనాల కొరత ఎక్కడా లేదని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ నేతలు దిగజారి మాట్లాడుతున్నారని, ఆపార్టీ ఛానళ్లలో విత్తనాలకోసం చెప్పుల లైన్ ఉన్నట్లు చూపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు ప్రతిదీ రాజకీయం చేస్తున్నారని, చివరికి తెలంగాణ చిహ్నం, గీతం విషయంలో కూడా రాజకీయం చేస్తున్నారన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒకే రకం కంపెనీ విత్తనాలకు డిమాండ్ ఎక్కువగా ఉందని, దాన్ని అతిగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

నకిలీ విత్తనాల కట్టడికి టాస్క్‌ఫోర్స్

• రాచకొండ సీపీ తరుణ్ జోషి వెల్లడి




సాక్షి, హైదరాబాద్: నకిలీ విత్తనాల సరఫరా, క్రయ విక్రయాలను అరికట్టేందుకు రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటయ్యాయి. వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నకిలీ విత్తన, ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఘట్ కేసర్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో తరుణ్ జోషి మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మేవారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. విత్తనాల షాపులపైన ఆకస్మికంగా దాడులు చేసి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. జూలై 1 నుంచి 'నూతన నేర న్యాయ చట్టాలు' అమలులోకి రానున్న నేపథ్యంలో కేసుల దర్యాప్తు, విచారణలో పాటించవలసిన నూతన విధానాల మీద అధికారులు, సిబ్బంది అందరూ అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. రిటైర్డు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాములు నూతన చట్టాల మీద అవగాహన కల్పించారు.

సునామీ నష్టాన్ని తగ్గించేందుకు యూకేతో ఎంఓఈఎస్ అవగాహన

సాక్షి, హైదరాబాద్: తీరప్రాంతాల్లో సునామీ ముందస్తు హెచ్చరికలకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై యునైటెడ్ కింగ్‌డమ్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ (యూకేఆర్ఐ)తో మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ (ఎంఓఈఎస్) అవగాహన కుదుర్చుకున్నాయి. గురువారం హైదరాబాద్‌లోని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్కాయిస్)లో జరిగిన కార్యక్రమంలో ఈ నూతన ప్రాజెక్టుపై ఎంఓయూ కుదిరింది. డిజాస్టర్ రిస్క్ తగ్గింపులో భాగంగా ఏడు పరిమాణాత్మక లక్ష్యాలకు ఈ ప్రాజెక్ట్ దోహదపడనుంది. విపత్తు మరణాలు తగ్గించడం, ప్రభావిత వ్యక్తుల సంఖ్యతో పాటు ఆర్థిక నష్టాలు తగ్గించడంలో ఈ ప్రాజెక్టు వ్యూహాత్మకంగా మారనుంది. మౌలిక సదుపాయాలకు నష్టం కలగకుండా, సేవలకు అంతరాయం కలగకుండా ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. ఈ కార్యక్రమంలో దాదాపు 40 మంది నిపుణులు పాల్గొన్నారు.

ఫెయిల్ అయ్యానని వైద్య విద్యార్థిని ఆత్మహత్య

• ఫిజియోథెరపీ నాలుగో ఏడాది చదువుతున్న కీర్తి
• థర్డ్ ఇయర్ ఎగ్జామ్స్‌లో ఓ సబ్జెక్టులో ఫెయిల్ కావడంతో మనస్తాపం



షాద్‌నగర్ రూరల్: పరీక్షలో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందిన ఫిజియోథెరపీ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం రాత్రి షాద్‌నగర్ రైతు కాలనీలో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన బుచ్చి బాబు, అమృత దంపతుల పెద్ద కూతురు కీర్తి (24) హైదరాబాద్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కళాశాలలో ఫిజియోథెరపీ నాలు గో ఏడాది చదువుతోంది. ఇటీవల థర్డ్ ఇయర్ ఎగ్జామ్స్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఓ సబ్జెక్టులో ఫెయిలైన కీర్తి తీవ్ర మనస్తాపంతో ఉంటోంది. ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న కీర్తి తల్లి, ఆర్ఎంపీ వైద్యుడైన తండ్రి బుచ్చిబాబు ఇద్దరూ వేర్వేరు పనులపై గురువారం సాయంత్రం బయటకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన కీర్తి సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటికి వచ్చిన తండ్రి బెడ్‌రూంలోకి వెళ్లి చూడగా ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాంచందర్ తెలిపారు.

అన్నదాత అడిగేదొకటి.. మార్కెట్‌లో ఉన్నదొకటి..

• డిమాండ్ ఉన్న పత్తి విత్తనాల సరఫరాలో వ్యవసాయ శాఖ విఫలం
• రైతులకు ఇష్టంలేని కంపెనీల విత్తనాలు అంటగడుతున్న వైనం
• తాము కోరుకునే విత్తన ప్యాకెట్ల కోసం గంటల తరబడి లైన్లలో..
• కొనుగోలు చేయని విత్తనాలను ప్రోత్సహిస్తున్న అధికారులు
• డిమాండ్ ఉన్న విత్తనాలను బ్లాక్ చేస్తున్న వ్యాపారులు.. రైతుల గగ్గోలు



సాక్షి, హైదరాబాద్: అధిక దిగుబడులు వచ్చే పత్తి విత్తనాల కోసం రైతులు కోరుతుంటే.. ఆ విత్తనాలు అందుబాటులో లేకుండా ఇతర కంపెనీల విత్తనాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. తమకు కావాల్సిన విత్తనాల కోసం రైతులు రాష్ట్రంలో పలుచోట్ల భారీ క్యూలలో నిలబడాల్సి వస్తోంది. కొన్నిచోట్ల రాస్తారోకోలు సైతం చేస్తున్నారు. డిమాండ్ ఉన్న విత్తనాలను సరఫరాలో చేయడంలో వ్యవసాయ శాఖ అధికారులు చేతులెత్తేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు కోరుకునే పత్తి విత్తనాలకు కొరత ఏర్పడింది. డిమాండ్ ఉన్న విత్తనాలను కొందరు వ్యాపారులు బ్లాక్ చేస్తున్నారన్న విమర్శలున్నాయి. విత్తనాల కొరత లేదని చెబుతున్న అధికారులు... డిమాండ్ ఉన్న విత్తనాల కొరత విషయంలో పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. రైతులు పెద్దగా కొనుగోలు చేయని విత్తనాలకు సంబంధించి ఆయా కంపెనీల నుంచి కొందరు అధికారులు వాటిని మార్కెట్‌లో ప్రోత్సహిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. వాస్తవానికి ఏ రకం విత్తనాలకు డిమాండ్ ఉంటుందో వ్యవసాయశాఖకు తెలుసు.. కానీ వాటిని మార్కెట్‌లో ఎందుకు అందుబాటులో ఉంచలేదో అధికారులు చెప్పాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సీజన్ ముంచుకొస్తున్నా...

రుతుపవనాలు త్వరలోనే రాష్ట్రాన్ని తాకనున్నాయి. చినుకు పడితే చాలు రైతులు తక్షణమే పత్తి విత్తనాలు చల్లేస్తారు. ఇప్పుడు రైతులకు అత్యంత కీలకమైనవి పత్తి విత్తనాలే. ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లనే ఈ ఇబ్బందులు వస్తున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సీజన్ ప్రారంభానికి ముందుగా అధికారులు ప్రణాళిక రచించలేదు. రాష్ట్రంలో ఈసారి 55 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనా వేయగా, అందుకోసం 1.26 కోట్ల విత్తన ప్యాకెట్లు సిద్ధం చేయాలని భావించారు. గురువారం నాటికి 68.16 లక్షల ప్యాకెట్లు మాత్రమే అందుబాటులో ఉంచారు. అయితే, మిగతా ప్యాకెట్లు కూడా వచ్చే నెల 5 నాటికి జిల్లాలకు చేరతాయని, అందువల్ల కొరతే లేదని వ్యవసాయశాఖ చెబుతోంది. ఇతర కంపెనీల విత్తనాలనూ కొనుగోలు చేసుకోవాలని పిలుపునిస్తున్న అధికారులు.. దిగుబడికి గ్యారంటీ ఇవ్వగలరా అని రైతులు నిలదీస్తున్నారు. దిగుబడి తక్కువ వస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

నకిలీ విత్తనాల ప్రవాహం...

ప్రభుత్వం అవసరమైన పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచకపోవడంతో ఇదే అదనుగా భావించిన విత్తన దళారులు మూకుమ్మడిగా నకిలీ విత్తనాలను అన్నదాతకు అంటగడుతున్నారు. నిషేధిత హెటీ కాటన్ (బీజీ-3) విత్తనాలను గుజరాత్, మహారాష్ట్ర నుంచి తెలంగాణ జిల్లాలకు తరలించారు. ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినా నకిలీ విత్తనాల బెడద వేధిస్తూనే ఉంది. ఇదిలావుంటే, పచ్చిరొట్ట విత్తనాలను కూడా ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచలేదు. 1.38 లక్షల ఎకరాల విస్తీర్ణానికి సరిపోయే మొత్తం 1.41 లక్షల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలైన డయాంచ, సన్‌హెంప్, పిల్లి పెసర విత్తనాలను అందుబాటులో ఉంచాలి. కానీ ఇప్పటివరకు కేవలం 79 వేల క్వింటాళ్లు మాత్రమే జిల్లాలకు చేరాయి. వ్యవసాయశాఖలోని ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లేమి ఈ సమస్యకు కారణమన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఒక ఉన్నతాధికారి ఎరువుల దుకాణాలను రోజూ పరిశీలించాలని వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈవో)ను ఆదేశిస్తుంటే... మరో ఉన్నతాధికారి మాత్రం అలా చేయొద్దని, తాను చెప్పినట్లుగా రైతుల వద్దకు వెళ్లి వారికి సలహాలు ఇవ్వాలని చెబుతున్నారు. ఒక ఏఈవోను ఇద్దరు ఉన్నతాధికారులు వేర్వేరుగా ఆదేశిస్తూ మరింత గందరగోళపరుస్తున్నారని వ్యవసాయ ఉద్యోగుల సంఘం నేత ఆరోపించారు.

ఐదో తేదీ నాటికి మిగతా పత్తి విత్తనాలు

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



రాష్ట్రంలో విత్తనాల కొరత లేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పారు. ఈ మేరకు ఆయన విత్తన కంపెనీలతో సమీక్ష నిర్వహించారు. ఎక్కడైనా రైతులు ఎక్కువ సంఖ్యలో వచ్చినట్లైతే, కౌంటర్లు ఎక్కువ ఏర్పాటు చేయాలని, కలెక్టర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్రంలో గతవారంలో కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు చేసుకొని సిద్ధంగా ఉన్నారని, అందువల్ల విత్తన కంపెనీలన్నీ ప్రణాళిక ప్రకారం మిగతా పత్తి విత్తన ప్యాకెట్లను జూన్ 5 కల్లా జిల్లాలకు చేరవేయాలని చెప్పారు. కొన్ని జిల్లాల్లో.. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలో ఒక కంపెనీ విత్తనాలనే రైతులందరూ కోరుతున్నారని, అన్ని విత్తనాల దిగుబడి ఒక్కటేనని ఆయన వివరించారు. రాష్ట్రంలో విత్తనాల కొరత లేదని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి కూడా అన్నారు.

విత్తనాలను బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే పీడీయాక్ట్

• జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసిన సీఎస్ శాంతి కుమారి



సాక్షి, హైదరాబాద్: విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించి, కృత్రిమ కొరతను సృష్టించే వ్యాపారులపై పీడీ చట్టం కింద కేసులను నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో వానాకాలం పంటలకు విత్తనాల సరఫరా, జూన్ 2వ తేదీన జరిపే రాష్ట్ర అవతరణ ఉత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో ఆమె గురువారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జీఏడీ, వ్యవసాయ శాఖల కార్యదర్శి రఘునందన్‌రావు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సీఎస్ మాట్లాడుతూ వానాకాలానికి సంబంధించి గత సంవత్సరం కన్నా అధిక మొత్తంలో వివిధ రకాల పంట విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విత్తనాల విషయంలో ఆందోళన చెందవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో అధిక డిమాండ్ ఉన్న పత్తి, సోయా, మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాలు సరిపడా ఉన్నాయని వివరించారు. వీటితోపాటు జీలుగ విత్తనాలు కూడా కావాల్సినంతగా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విత్తన వ్యాపారుల గోదాములు, దుకాణాలను తనిఖీ చేయించాలని కలెక్టర్లను ఆదేశించారు. దీనితోపాటు, గోదాములు, విత్తన విక్రయ కేంద్రాలవద్ద పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను నియమించాలని సూచించారు. రైతులతో సమావేశమై, సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వారిలో విశ్వాసం కల్పించాలన్నారు. ఇతర రాష్ట్రాలనుంచి రైతులు వచ్చి ఇక్కడి విత్తనాలు కొనుగోలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

జిల్లా కలెక్టర్లతో పతాకావిష్కరణ

తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ రెండవ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లో కలెక్టర్లు జాతీయ జెండాను ఆవిష్కరించాలని సీఎస్ శాంతికుమారి స్పష్టం చేశారు. రాష్ట్ర అవతరణ కోసం అమరులైన వారికి నివాళులు అర్పించిన అనంతరం కలెక్టర్లు జాతీయ పతాకావిష్కరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను, ఇతర ప్రముఖులను, జిల్లా అధికారులను ఆహ్వానించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమంలో అమర వీరులైన వారి కుటుంబ సభ్యులకు, ఉద్యమ కారులకు జిల్లా కలెక్టర్ల ద్వారా ఆహ్వానం పంపుతున్నట్లు తెలిపారు.

విత్తనాల కోసం రోడ్డెక్కిన రైతులు

ఆదిలాబాద్ టౌన్: ఆదిలాబాద్ జిల్లాలో రైతులు పత్తి విత్తనా ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులు గా మండుటెండల్లో బారులు తీరుతున్నారు. గురువారం సైతం అదే పరిస్థితి నెలకొంది. ఉదయం 6 గంటల సమ యంలో జిల్లా నలుమూలల నుంచి రైతులు విత్తన దుకాణా లకు చేరుకున్నారు. పట్టణంలోని తాంసి బస్టాండ్ సమీపంలోని ఓ విత్తన దుకాణం యజమాని ఉదయం 7.30 గంటల సమయంలో దుకాణం తెరిచాడు. అరగంటలోనే డీలర్ నో స్టాక్ బోర్డు పెట్టడంతో రైతులు పంజాబ్ చౌక్ వద్ద రహ దారిపై రాస్తారోకో చేపట్టారు. అదే సమయంలో డీలర్ గోదాం నుంచి 132 విత్తనాల ప్యాకెట్లను ఇచ్చోడకు తరలి స్తుండడంతో రైతులు వాహనాన్ని అడ్డుకున్నారు. వ్యాపారు లు కృత్రిమ కొరత సృష్టిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, జిల్లా వ్యవసా య శాఖ అధికారి పుల్లయ్య అక్కడికి చేరుకుని వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రైతులు ఆందోళన చెందవద్ద ని, సరిపడా విత్తనాల ను అందుబాటులో ఉంచుతామని వ్యవ సాయ అధికారి చెప్ప డంతో శాంతించారు.

ఏసీబీ అధికారులతో డీజీ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: ఏసీబీ అధికారులతో గురువారం ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మూడు నెలలశాఖ పనితీరుపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆనంద్ ఉద్యోగుల పనితీరును ప్రశంసించి.. బహుమతులు అందజేశారు.

ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నికలపై స్టేటస్ కో

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నికల నిర్వహణపై స్టేటస్ కో విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. జూన్ 9న ఎన్నికలు నిర్వహించే విషయంలో జూన్ 4వ తేదీ వరకు ఎలాంటి చర్యలు తీసుకోరాదని చెప్పింది. తమ ఓటు హక్కు తొలగించడంపై తెలంగాణ స్క్వాష్ రాకెట్స్, జిమ్నాస్టిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాయి. అలాగే నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికలు జరుపుతున్నారని తెలంగాణ తైక్వాండో అసోసియేషన్, తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ తదితరులు కూడా పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు అశోక్ ఆనంద్ కుమార్, చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. 'నిబంధనలు పాటించకుండా ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ అండ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికల్లో పిటిషనర్లను అనుమతించేలా ఆదేశాలు జారీచేయాలి. ఒలింపిక్ అసోసియేషన్ (2024–28) కార్యవర్గాన్ని ఎన్నుకోవడానికి ఈనెల 19న ఎలక్షన్ నోటిఫికేషన్ ఇచ్చారు. తర్వాత పలు అసోసియేషన్ ప్రతినిధుల ఓట్లను తొలగించారు. ఈ ఎన్నికలను అడ్డుకోవాలి' అని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. జూన్ 4 వరకు స్టేటస్‌కో విధించింది. తదుపరి విచారణ జూన్ 3కు వాయిదా వేసింది.

మోదీకి ధ్యానం ఎందుకు?: వీహెచ్

సాక్షి, హైదరాబాద్: మతాలను విడదీసే ప్రధాని నరేంద్రమోదీకి ధ్యానం ఎందుకని మాజీ మంత్రి వి.హనుమంతరావు ప్రశ్నించారు. దేవుడు పంపిన దేవదూత మోదీ అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నప్పుడు.. ధ్యానం అవసరమా? అని గురువారం ఒక ప్రకటనలో నిలదీశారు. పదేళ్ల మోదీ పాలనలో రైతులు, నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టారని ఆరోపించారు. ఐఐటీ, ఐఐఎం రిజర్వేషన్లు తెచ్చింది కాంగ్రెస్సేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని హామీ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికలలో ఇండియా కూటమి గెలుస్తుందని వీహెచ్ ధీమా వ్యక్తం చేశారు.
అవాస్తవాలుగా చిత్రీకరించేందుకు బీఆర్ఎస్, బీజేపీ కుట్రలు

అవాస్తవాలుగా చిత్రీకరించేందుకు బీఆర్ఎస్, బీజేపీ కుట్రలు

• టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: బాధ్యతగా వ్యవహరించాల్సిన ప్రతిపక్షాలు ప్రభుత్వంలో జరుగుతున్న వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరించేందుకు కుట్రలు చేస్తున్నాయని టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ ధ్వజమెత్తారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లాంటి వ్యక్తిపై ప్రతపక్ష నేతలు అసత్య ప్రకటనలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేటీఆర్ చిల్లర మాటలు ఆయన హోదాకు తగవని, వ్యక్తిగత ప్రచారం కోసమే బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పదేపదే ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. బయట ధాన్యం గురించి మాట్లాడి లోపల భూముల విషయం మాట్లాడే సంస్కారం తమది కాదని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి వేయి కోట్లు పంపాలనే రూ.100 కోట్లు అవినీతికి పాల్పడ్డారని ప్రతిపక్షాలు ఆరోపణ చేయడంలో అర్థం లేదన్నారు.

మద్యం మత్తులో ఈత కొడుతూ..

శంషాబాద్: మద్యం మత్తులో స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతూ ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం ఇంద్రచెడి గ్రామానికి చెందిన ఎం.శివకుమార్ (32) భార్య లలితతో కలిసి పట్టణంలోని ఇంద్రమ్మ కాలనీలో నివాసం ఉంటున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ అయిన శివకుమార్ గురువారం సెల్‌ఫోన్ రిపేరింగ్ చేయించుకుని వస్తానని చెప్పి బయటికి వెళ్లాడు. మధ్యాహ్నం తర్వాత సిద్దులగుట్ట సమీపంలో ఉన్న స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లిన అతడు ఈత కొట్టేందుకు అందులో దిగాడు. కొద్దిసేపు ఈత కొడుతూనే నెమ్మదిగా నీళ్లలో మునిగిపోయాడు. గమనించిన నిర్వాహకులు వెంటనే బయటికి తీసి 108కు సమాచారం ఇచ్చారు. పరీక్షించిన సిబ్బంది అప్పటికే అతడు మృతిచెందినట్లు నిర్ధారించారు.

పెంచిన తండ్రిని బంధించి.. ఆస్తులు లాక్కొని

• వ్యవసాయ భూమి సైతం రిజిస్ట్రేషన్
• బాధితుడి ఫిర్యాదుతో దత్తపుత్రుడు, కోడలు అరెస్టు

చిన్నకోడూరు (సిద్దిపేట): పెంచిన తండ్రిని బంధించి బంగారం, వెండి ఆభరణాలు, డబ్బులు బలవంతంగా లాక్కొని, దౌర్జన్యంగా వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఘటన చిన్నకోడూరు మండలంలో జరిగింది. ఎస్ఐ బాలకృష్ణ కథనం మేరకు.. రామంచ గ్రామానికి చెందిన కొమురవెల్లి ముత్తయ్య దంపుతులకు పిల్లలు లేరు. తన సొంత అన్న కొడు కు శ్రీనివాస్‌ను చిన్నప్పుడే దత్తత తీసుకొని పెంచి పెళ్లి చేశాడు. వారికి ఒక కుమారుడు ఉండగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ముత్తయ్య భార్య అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామంలోనే నివసిస్తున్నాడు. ఒంటరిగా ఉంటున్న ముత్తయ్య ముసలితనంలో తోడు కోసం మరో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాస్ దంపతులు మార్చి 5న రామంచకు వచ్చారు. ఇంట్లోని బీరువా తాళం పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదును లాక్కు న్నారు. అనంతరం ముత్తయ్యను బలవంతంగా హైదరాబాద్ తీసుకెళ్లి వారు నివసిస్తున్న ఇంట్లో బంధించారు. సిద్దిపేట రూరల్ మండ లం పుల్లూరులో ఉన్న ఒక ఎకరం భూమిని దానపత్రం కింద డాక్యుమెంట్ తయారు చేయించి రూరల్ తహసీల్దార్ ఆఫీస్‌లో శ్రీనివాస్ తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తిరిగి హైదరాబాద్‌కు తీసుకు వెళ్లి బంధించి చిత్రహింసలకు గురి చేస్తున్నారు. ఈ క్రమంలో ముత్తయ్య తప్పించుకొని చిన్నకోడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు శ్రీనివాస్, అతడి భార్య కనకలక్ష్మిని అరెస్టు చేశారు.

హెయిర్ కటింగ్ నచ్చలేదని బాలుడి ఆత్మహత్య

గంగారం: హెయిర్ కటింగ్ నచ్చలేదని ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం చింతగూడెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై రవి కుమార్ కథనం ప్రకారం.. చింతగూడెం గ్రామానికి చెందిన ఈసం కాంతారావుకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు హర్షవర్ధన్ (9) సీతానాగారం హాస్టల్‌లో ఉంటూ 6వ తరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ నెల 24న కాంతారావు హర్షవర్ధన్‌ను తీసుకెళ్లి హెయిర్ కట్ చేయించాడు. ఆ కటింగ్ ఇష్టం లేకపోవడంతో తండ్రితో గొడవపడ్డాడు. మరుసటి రోజు పురుగు మందు తాగాడు. బాలుడు వాంతులు చేసుకుంటుండగా అనుమానం వచ్చి అడగగా కటింగ్ నచ్చక పురుగుల మందు తాగినట్లు తల్లికి చెప్పడంతో బాలుడిని వెంటనే నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ హర్షవర్ధన్ గురువారం మృతిచెందాడు.

ఆస్పత్రి బాత్రూంలో ప్రసవం!

• నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రిలో శిశువు మృతి
• లేబర్ రూమ్‌లోనే ప్రసవం జరిగిందంటున్న సూపరింటెండెంట్

సాక్షి, నాగర్ కర్నూల్: పురిటి నొప్పులతో ఆస్పత్రికి వచ్చిన గర్భిణి వైద్యుల నిర్లక్ష్యంతో ఆస్పత్రి బాత్రూంలో ప్రసవించింది. దీంతో శిశువు మృతిచెందింది. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో గురువారం ఈ ఘటన జరిగింది. తాడూరు మండలం అల్లాపూర్‌కు చెందిన అస్కాని ఆంజనేయులు, మహేశ్వరి దంపతులకు కొడుకు, కూతురు ఉన్నారు. మూడో కాన్పు కోసం మహేశ్వరి లింగాల మండలం అప్పాయి పల్లిలోని తల్లిగారి ఇంట్లో ఉంటోంది. గురు వారం తెల్లవారు జామున 3 గంటలకు పురిటి నొప్పులు రావడంతో లింగాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. అక్కడి వైద్యులు కడుపులో శిశువు అడ్డం తిరిగిందని జిల్లాకేంద్రంలోని ఆస్పత్రికి రిఫర్ చేశారు. దీంతో కుటుంబ సభ్యులు లింగాల నుంచి 45 కి.మీ. దూరంలోని జనరల్ ఆస్పత్రికి ఉదయం 5 గంటలకు తీసుకువచ్చారు. అరగంట తర్వాత మహేశ్వరి బాత్రూం వెళ్లి అక్కడే ప్రసవించింది. దీంతో ఆడ శిశువు కిందపడి అక్కడికక్కడే మరణించింది. ఆస్పత్రికి వచ్చి అరగంట దాటినా వైద్యులు, సిబ్బంది పట్టించుకోలేదని, వైద్యుల నిర్లక్ష్యం తోనే శిశువు మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా మహేశ్వరి బాత్రూంలో ప్రసవించలేదని, ఆస్పత్రిలోని లేబర్ రూమ్‌లోనే ప్రసవించిందని, శిశువు బరువు తక్కు వగా ఉన్న కారణంగా మృతి చెందిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘు తెలిపారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

రాజేంద్రనగర్: గుట్టు చప్పుడు కాకుండా నిషేధిత డ్రగ్స్‌ను విక్రయిస్తున్న ఇద్దరిని శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 270 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. సన్‌సిటీ బండ్లగూడ జాగీర్‌లోని ఓ సూపర్ మార్కెట్ సమీపంలో గురువారం మహారాష్ట్రకు చెందిన తృప్తి ప్రభాకర్ హోళం (21), మధ్యప్రదేశ్ శివపురి గ్వాలియర్ ప్రాంతానికి చెందిన అనుభవ్ సక్సేనా (24)లు బ్యాగ్‌తో ప్యాసింజర్ ఆటోదిగి అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. దీనిపై సమాచారం అందుకున్న శంషాబాద్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాఘవేందర్, కానిస్టేబుళ్లు వారిని అదుపులోకి తీసుకొని తనిఖీలు చేయగా తెల్లటి పౌడర్ రూపంలో ఉన్న 270 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ లభించింది. దీంతో పోలీసులు విచారణ చేపట్టగా.. తాము ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ.. ఎండీఎం డ్రగ్స్‌ను ఐటీ, ఈవెంట్ మేనేజర్‌లకు విక్రయిస్తున్నామని తెలిపారు. తాము చంద్రపూర్‌కు చెందిన సాబేర్ అనే వ్యక్తి ద్వారా కొరియర్ తెప్పించుకొని ఎక్కువ ధరలకు హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఎండీఎంఏ డ్రగ్ విలువ మార్కెట్‌లో రూ.20 లక్షలు ఉంటుందన్నారు.

మంత్రాల నెపంతో వృద్ధుడి హత్య



సాయిలు

చిట్యాల (నల్లగొండ జిల్లా): మంత్రాల నెపంతో వృద్ధుడిని ఓ వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో గురువారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన జవాజి సాయిలు (75) వ్యవసాయ పనులు చేసుకుంటూ ఎక్కువ సమయం గ్రామ శివారులోని తన పొలం వద్ద నే గడుపుతుండేవాడు. గురువారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన జవాజి శ్యాం తాత వరుస అయ్యే సాయిలును హత్య చేసి చిట్యాల పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. దీంతో నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, చిట్యాల ఎస్ఐ సైదాబాబు ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. మారణాయుధా లతో దాడి చేయడంతో సాయిలు శరీరం గుర్తుపట్టలేని విధంగా ఉందని పోలీసులు పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం సాయిలు మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సాయిలు తమ కుటుంబానికి చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో శ్యాం ఈ హత్య చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

హైదరాబాద్ ఆర్చి బిషప్ ఎమిరిటస్

తుమ్మ బాల కన్నుమూత

• ఓరుగల్లు పీఠాధిపతిగా 25 సంవత్సరాలు సేవలు
• నేడు సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ బసిలికాలో అంతిమ సంస్కారాలు



కాజీపేట రూరల్/రాంగోపాల్‌పేట్: భారతీయ పీఠాధిపతి, హైదరాబాద్ ఆర్చి బిషప్ ఎమిరిటస్, ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ చైర్మన్, ది మోస్ట్ రెవరెండ్ ఫాదర్ తుమ్మ బాల (80) కన్నుముశారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురంలోని దివ్య జ్యోతి నిలయంలో తుదిశ్వాస విడిచారు. పలువురు రాజకీయ నాయకులు, క్రైస్తవ మత పెద్దలు, విశ్వాసులు తరలివచ్చి తుమ్మ బాల పార్థివ దేహంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఓరుగల్లు మేత్రాసనం పీఠాధిపతి రెవరెండ్ డాక్టర్ ఉడుముల బాల, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హనుమకొండ జెడ్పీ చైర్మన్ డాక్టర్ ఎం.సుధీర్‌కుమార్ తుమ్మ బాల పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. తుమ్మ బాల మరణం పట్ల కార్డినల్, ఆర్చి బిషప్ పూల ఆంథోని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం క్యాథలిక్ సమాజానికి తీరని లోటని అన్నారు.

ప్రజల సందర్శన కోసం..

ప్రజల సందర్శనార్థం తుమ్మ బాల పార్థివ దేహాన్ని ఫాతిమా బిషప్ హౌస్‌కు తరలించారు. అనంతరం ఫాతిమా కేథడ్రల్ చర్చిలో బిషప్ ఉడుముల బాల దివ్య బలి పూజ సమర్పించారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ బసిలికాలో భూస్థాపిత పూజ చేయనున్నట్లు ఫాతిమా కేథడ్రల్ చర్చి కమిటీ సభ్యులు తెలిపారు. కాగా, గురువారం రాత్రి తుమ్మ బాల పార్థివ దేహాన్ని సికింద్రాబాద్ ఎస్డీరోడ్డులోని సెయింట్ మేరీస్ బసిలికాకు తీసుకుని వచ్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం శుక్రవారం మధ్యాహ్నం అంత్యక్రియలు పూర్తి చేస్తారు.

తుమ్మ బాల ప్రస్థానం..

ఉమ్మడి వరంగల్ జిల్లా నర్మెట గ్రామంలో 1944లో జోజిరెడ్డి, ఇన్నమ్మ దంపతులకు తుమ్మ బాల జన్మించారు. వరంగల్ మేత్రాసనం పీఠాధిపతిగా (బిషప్) 1987లో బాధ్యతలు స్వీకరించారు. 25 సంవత్సరాల పాటు సేవలందించిన తుమ్మ బాల 2011లో హైదరాబాద్ ఆర్చి బిషప్‌గా వరంగల్ నుంచి బదిలీపై వెళ్లారు.

● హిమాచల్‌ప్రదేశ్‌లో..

బీజేపీకి పరీక్ష!

4 స్థానాలకు రేపు పోలింగ్

అన్నీ బీజేపీ సిట్టింగ్ స్థానాలే ● గట్టి పోటీ ఇస్తున్న కాంగ్రెస్



హిమాచల్‌ప్రదేశ్‌లోని 4 లోక్‌సభ స్థానాలనూ గత రెండు సార్వత్రిక ఎన్నికల్లోనూ బీజేపీ క్లీన్‌స్వీప్ చేసింది. కానీ ఈసారి హ్యాట్రిక్ కొట్టాలన్న కమలనాథుల యత్నాలకు కాంగ్రెస్ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. ఉత్తరాదిన కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం ఇదే. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో కచ్చితంగా ఖాతా తెరవాలని ఆ పార్టీ పట్టుదలతో ఉంది. కాంగ్రా, మండి, సిమ్లా, హమీర్‌పూర్ స్థానాలకు శనివారం తుది విడతలో పోలింగ్ జరగనుంది. ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యే అయినా బీఎస్పీ కూడా అన్నిచోట్లా బరిలో ఉంది. ప్రముఖ అభ్యర్థుల్లో కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్, మాజీ మంత్రి ఆనంద్ శర్మ, బాలీవుడ్ నటి కంగనా రనౌత్ తదితరులున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై వేటు ఫలితంగా 6 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. వాటి ఫలితాలు సుఖ్విందర్ సింగ్ సుఖు సర్కారు భవితవ్యాన్ని నిర్దేశించనున్నాయి...

– సాక్షి, నేషనల్ డెస్క్

కాంగ్రా

ఇక్కడ అభ్యర్థిని మార్చే ఆనవాయితీని బీజేపీ ఈసారి కూడా కొనసాగించింది. సీనియర్ నేత, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు రాజీవ్ భరద్వాజ్‌కు టికెటిచ్చింది. కాంగ్రెస్ నుంచి సీనియర్ నేత ఆనంద్ శర్మ బరిలో ఉన్నారు. ఈ లోక్‌సభ పరిధిలోని 17 అసెంబ్లీ స్థానాల్లో 11 కాంగ్రెస్ చేతిలోనే ఉన్నాయి. తన ఏడాదిన్నర పాలన చూసి శర్మను గెలిపించాలని ఓటర్లను సీఎం సుఖు కోరుతున్నారు. ఇక్కడ 10 మంది పోటీలో ఉన్నారు.

సిమ్లా

2009 నుంచీ బీజేపీయే గెలుస్తోంది. సిట్టింగ్ ఎంపీ సురేశ్ కుమార్ కాశ్యప్‌కే టికెటిచ్చింది. 15 ఏళ్ల క్రితం చేజారిన ఈ స్థానాన్ని సొంతం చేసుకోవాలని కాంగ్రెస్ పట్టుదలతో ఉంది. కసోలి ఎమ్మెల్యే వినోద్ సుల్తాన్‌పురికి టికెటిచ్చింది. ఈ లోక్‌సభ పరిధిలోని 17 అసెంబ్లీ స్థానాల్లో 13 కాంగ్రెస్ చేతిలో ఉన్నాయి. ఇక్కడ యాపిల్ రైతులు కీలకం. హట్టి సామాజిక వర్గానికి కేంద్రం ఎస్టీ హోదా కల్పించడాన్ని బీజేపీ ప్రముఖంగా ప్రచారం చేసుకుంది.

మండి

2021 ఉప ఎన్నికలో నెగ్గిన పీసీసీ చీఫ్ ప్రతిభాసింగ్ ఈసారి పోటీకి అనాసక్తి చూపారు. బాలీవుడ్ నటి కంగనా రనౌత్‌ను బీజేపీ పోటీకి పెట్టింది. దాంతో ప్రతిభాసింగ్ కుమారుడు, మంత్రి విక్రమాదిత్య సింగ్‌కు కాంగ్రెస్ టికెటిచ్చింది. అభ్యర్థులిద్దరూ హోరాహోరీ ప్రచారం చేశారు. మండిలో విజయం బీజేపీ, కాంగ్రెస్ మధ్య చేతులు మారుతూ ఉంటుంది. మొత్తమ్మీద కాంగ్రెస్‌దే పై చేయి.

హమీర్‌పూర్

కేంద్ర మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ మళ్లీ బీజేపీ నుంచి బరిలోకి దిగారు. కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే సత్పాల్ సింగ్ రజ్దా పోటీ చేస్తున్నారు. ఇది బీజేపీ కంచుకోట. ఎనిమిదిసార్లుగా గెలుస్తూ వస్తోంది. ఈసారి బీజేపీ ఫోర్, సిక్స్ కొడుతుందని అనురాగ్ ఠాకూర్ ప్రచారం చేశారు. అంటే మొత్తం 4 లోక్‌సభ, 6 అసెంబ్లీ స్థానాలనూ కైవసం చేసుకుంటుందన్నది ఆయన ధీమా. ఉప ఎన్నికలు జరుగుతున్న 6 అసెంబ్లీ స్థానాల్లో 4 ఈ లోక్‌సభ సీటు పరిధిలోనే ఉన్నాయి.

ప్రధానాంశాలు

- అయోధ్య రామమందిర నిర్మాణాన్ని, జమ్మూ కశ్మీర్లో ఆర్టికల్ 370 రద్దును బీజేపీ ప్రముఖంగా ప్రచారం చేసింది.
- పాత పింఛను విధానం పునరుద్ధరణ, 2023 భారీ వరదల అనంతరం చేపట్టిన సహాయక చర్యలను కాంగ్రెస్ గుర్తు చేసింది.
- బీజేపీ వస్తే రిజర్వేషన్లు రద్దేనంటూ ప్రచారం చేసింది. కేంద్రంలో అధికారంలోకొస్తే అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.
- కాంగ్రా, హమీర్‌పూర్ వాసులు ఆర్మీలో ఎక్కువగా చేరుతుంటారు. అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేస్తామన్న కాంగ్రెస్ హామీ వారిపై ప్రభావం చూపొచ్చు.
- వరదలు ఇక్కడి ప్రజల ప్రధాన సమస్యల్లో ఒకటి.
- రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయడమే గాక అసెంబ్లీలో బడ్జెట్‌పై ఓటింగ్‌కు హాజరు కాకుండా విప్‌ను ధిక్కరించినందుకు ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడింది. ఉప ఎన్నికల్లో ఆ ఆరుగురికి బీజేపీ టికెటిచ్చింది.

ఎమర్జెన్సీలో రాజ్యాంగం గొంతు నొక్కారు



గురువారం కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్‌కు నమస్కరిస్తున్న ప్రధాని మోదీ

- 1984లో సిక్కులను హత్య చేస్తుంటే రాజ్యాంగం గుర్తుకురాలేదు
- కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన మోదీ

హోషియార్‌పూర్: ఎమర్జెన్సీ సమయంలో రాజ్యాంగం గొంతు పిసికిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు రాజ్యాంగ పరిరక్షణ అంటూ గొంతు చించుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. 1984 నాటి అల్లర్లలో సిక్కుల మెడలకు టైర్లు బిగించి, నిప్పంటించి కాల్చి చంపుతుంటే కాంగ్రెస్‌కు రాజ్యాంగం గుర్తుకు రాలేదని ధ్వజమెత్తారు. గురువారం పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌లో ఎన్నికల ప్రచార సభలో మోదీ ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో మోదీకి ఇదే చివరి సభ. రిజర్వేషన్లపై కాంగ్రెస్‌తోపాటు విపక్ష 'ఇండియా' కూటమి ఉద్దేశాలు చాలా ప్రమాదకరంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లలో కోత విధించి, బడుగు బలహీనవర్గాలకు అన్యాయం చేసిన చరిత్ర ప్రతిపక్షాలకు ఉందన్నారు. ముస్లింలకు రిజర్వేషన్లు కట్టబెట్టేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని దుయ్యబట్టారు. రాజ్యాంగ స్ఫూర్తిని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనోభావాలను ప్రతిపక్షాలు కించపరుస్తున్నాయని ఆక్షేపించారు.

అవినీతిలో కాంగ్రెస్ డబుల్ పీహెచ్‌డీ

కాంగ్రెస్ పార్టీ అవినీతికి తల్లిలాంటిదని ప్రధానమంత్రి నిప్పులు చెరిగారు. అవినీతిలో ఆ పార్టీ డబుల్ పీహెచ్‌డీ చేసిందని ఎద్దేవా చేశారు. మరో అవినీతి పార్టీ(ఆమ్ ఆద్మీ పార్టీ) కాంగ్రెస్‌తో చేతులు కలిపిందన్నారు. ఢిల్లీలో కలిసికట్టుగా, పంజాబ్‌లో విడివిడిగా పోటీ చేస్తూ ఆ రెండు పార్టీలు డ్రామాలాడుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ గర్భంలోనే ఆమ్ ఆద్మీ పార్టీ ఊపిరి పోసుకుందని అన్నారు. కాంగ్రెస్ నుంచే అవినీతి పాఠాలు నేర్చుకుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బుజ్జగింపు రాజకీయాల్లో మునిగి తేలుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సైనిక దళాలను బలహీనపర్చిందని ఆరోపించారు. సైన్యంలో సంస్కరణలు చేపట్టడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదన్నారు.

ఓటింగ్‌లో కొత్త రికార్డు సృష్టించాలి

వారణాసి ప్రజలకు ప్రధాని పిలుపు

లక్నో: సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నియోజకవర్గం నుంచి వరుసగా మూడోసారి పోటీ చేస్తున్నారు. వారణాసిలో శనివారం పోలింగ్ జరగనుంది. తన నియోజకవర్గ ప్రజలకు మోదీ గురువారం ఒక వీడియో సందేశం విడుదల చేశారు. భారతదేశ అభివృద్ధి కోసం వారణాసి ఓటింగ్‌లో కొత్త రికార్డు సృష్టించాలని పిలుపునిచ్చారు. కాశీ విశ్వనాథుడితో పాటు అక్కడి ప్రజల ఆశీర్వచనాలతోనే పార్లమెంట్‌లో వారణాసికి ప్రాతినిధ్యం వహించే అవకాశం తనకు దక్కిందని పేర్కొన్నారు. పవిత్ర గంగామాత తనను దత్తత తీసుకుందన్నారు. నవకాశీతోపాటు 'అభివృద్ధి చెందిన భారత్'ను సాకారం చేసుకోవడానికి ఈ ఎన్నికలు చాలా కీలకమని వివరించారు. జూన్ 1న జరిగే ఓటింగ్‌లో వారణాసి ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొనాలని, ఓటింగ్‌లో కొత్త రికార్డు సృష్టించాలని మోదీ విజ్ఞప్తి చేశారు. కాశీని ఎంతో అభివృద్ధి చేశామని, రాబోయే రోజుల్లో ఈ అభివృద్ధిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తామని మోదీ హామీ ఇచ్చారు.

కన్యాకుమారిలో మోదీ ధ్యానముద్ర

సాక్షి, చెన్నై: తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారిలో వివేకానంద రాక్ మెమోరియల్‌లోని ధ్యాన మండపంలో ప్రధాని మోదీ గురువారం సాయంత్రం ధ్యానం ప్రారంభించారు. దాదాపు 45 గంటపాటు ఆయన ధ్యానం కొనసాగించనున్నారు. మోదీ తొలుత కేరళలోని తిరువనంతపురం నుంచి హెలికాప్టర్‌లో కన్యాకుమారికి చేరుకున్నారు. సంప్రదాయ ధోతీ, తెల్ల రంగు కండువా ధరించి భగవతి అమ్మన్ ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం మోదీ సముద్ర తీరం నుంచి పడవలో రాక్ మెమోరియల్‌కు చేరుకున్నారు. ధ్యాన మండపం మెట్లపై కాసేపు కూర్చున్నారు. తర్వాత ధ్యాన మండపంలో సుదీర్ఘ ధ్యానానికి శ్రీకారం చుట్టారు.

ఎలక్షన్ బీట్

ప్రచారం పరిసమాప్తం

జూన్ ఒకటిన తుది దశలో 57 స్థానాలకు పోలింగ్

సాక్షి, న్యూఢిల్లీ: అధికార పీఠాధిరోహణమే పరమావధిగా రాజకీయ పార్టీలు మొదలెట్టిన సార్వత్రిక ఎన్నికల ప్రచారపర్వానికి తెరపడింది. చివరిదైన ఏడో దశ పోలింగ్‌కు సంబంధించిన ప్రచారం గురువారంతో ముగిసింది. జూన్ ఒకటో తేదీన చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతంసహా ఏడు రాష్ట్రాల్లోని 57 స్థానాలకు పోలింగ్ జరగనుంది. పంజాబ్‌లోని మొత్తం అన్ని సీట్లకు ఒకేదఫాలో జూన్ ఒకటో తేదీనే పోలింగ్ జరుగుతోంది. తుది దశ ఎన్నికలు జరుగుతున్న 57 సీట్లలో గత 2019 ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 32, యూపీఏ కూటమి 9 సీట్లు గెలుచుకోగా, మిగతా స్థానాలను ఇతర పార్టీలు గెలుచుకున్నాయి.

రాష్ట్రం	సీట్లు
పంజాబ్	13
ఉత్తరప్రదేశ్	13
బెంగాల్	9
బిహార్	8
ఒడిశా	6
హిమాచల్ ప్రదేశ్	4
జార్ఖండ్	3
చండీగఢ్	1

పోటీలో కీలక నేతలు

ప్రధాని మోదీ పోటీ చేస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ మేనల్లుడు, పార్టీలో నంబర్2 నేత అభిషేక్ బెనర్జీ పోటీ చేస్తున్న డైమండ్ హార్బర్, ఆర్‌జేడీ చీఫ్ లాలూప్రసాద్ యాదవ్ కుమార్తె మీసా భారతి పోటీ చేస్తున్న బిహార్‌లోని పాటలీపుత్ర స్థానాలకూ ఈ చివరి దశలో పోలింగ్ జరగనుంది.

మోదీ @ 200 సభలు, రోడ్‌షోలు

సాక్షి, న్యూఢిల్లీ: ముచ్చటగా మూడోసారి బీజేపీని అధికారంలోకి తీసుకుని రావడమే లక్ష్యంగా ప్రధాని మోదీ ఈ ఎన్నికల ప్రచారంలో సుడిగాలి పర్యటనలు చేశారు. ఒక్కో రోజు మూడు నుంచి ఐదు సభలు, రోడ్‌షోల్లో పాల్గొన్నారు. మార్చి 16న ఈసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాక మొత్తంగా మోదీ 206 సభలు, సమావేశాలు, రోడ్‌షో, ర్యాలీల్లో పాల్గొన్నారు. ఒక్క మేలో 96 ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు.అత్యధిక ఎంపీ స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌లో ప్రధాని ఏకంగా 31 సభల్లో పాల్గొన్నారు. బిహార్‌లో 20, మహారాష్ట్రలో 19, పశ్చిమబెంగాల్‌లో 16 సభలకు హాజరయ్యారు. కేవలం ఈ 4 రాష్ట్రాల్లోనే 86 సభల్లో మోదీ పాల్గొనడం గమనార్హం. దక్షిణాదిన కర్ణాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో గెలుపే లక్ష్యంగా విస్తృత ప్రచారం చేశారు. అత్యధికంగా కర్ణాటక, తెలంగాణల్లో 11, తమిళనాడులో 7 ప్రచార కార్యక్రమాల్లో మోదీ పాల్గొన్నారు. 2019 ఎన్నికల్లో మోదీ 145 సభలు, సమావేశాలు, రోడ్‌షో, ర్యాలీల్లో పాల్గొన్నారు. 2019లో 68 రోజులు ప్రచారంచేయగా ఈసారి 76 రోజులపాటు ప్రచారంచేశారు. ఈసారి ఆయన మొత్తం 80 మీడియా ఇంటర్వ్యూలు ఇచ్చారు. అంటే సగటున రోజుకు ఒకటి కంటే ఎక్కువ.

రాహుల్ 107..ప్రియాంక 108

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయావకాశాలను మెరుగుపరిచేందుకు ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ దేశవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. ర్యాలీలు, రోడ్ షోలు కలిపి మొత్తంగా రాహుల్ గాంధీ 107, ప్రియాంక 108 ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇవేకాకుండా, 16 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పర్యటన సమయంలో టీవీ ఇంటర్వ్యూ ఒకటి, ప్రింట్ మీడియాకు ఐదు ఇంటర్వ్యూలు ఇచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 100పైగా ఎన్నికల ర్యాలీల్లో పాల్గొన్నారు. 20 మీడియా సమావేశాల్లో మాట్లాడారు. 70సార్లు మీడియాకు ఇంటర్వ్యూలిచ్చారు.

ప్రధాని ప్రతిష్టను దిగజార్చారు

మోదీపై మాజీ ప్రధాని మన్మోహన్ మండిపాటు

న్యూఢిల్లీ: ప్రధాని మోదీపై కాంగ్రెస్ నేత, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నిప్పులు చెరిగారు. ఎన్నికల వేళ విద్వేష ప్రసంగాలతో ప్రధాని పదవికున్న ప్రతిష్టను, బహిరంగ సభల గౌరవాన్ని ఆయన దిగజార్చారని మండిపడ్డారు. ఆఖరు విడతలో భాగంగా పంజాబ్‌లో జూన్ ఒకటో తేదీన జరగనున్న పోలింగ్ వేళ గురువారం మన్మోహన్ ప్రజలకు ఒక బహిరంగ లేఖ రాశారు. 'ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ సభల్లో చేసే రాజకీయ ప్రసంగాలను క్షుణ్నంగా పరిశీలిస్తూ వచ్చాను. మోదీ అత్యంత దుర్మార్గమైన విద్వేష పూరిత ప్రసంగాలు చేస్తున్నారు. ప్రజల మధ్య విభజనలను తెచ్చేవిగా ఉన్నాయి. బహిరంగ సభల్లో ప్రసంగాల గౌరవాన్ని, తద్వారా ప్రధాని కుర్చీకున్న ప్రతిష్టను పలుచన చేసిన మొదటి ప్రధాని మోదీ. ప్రధానమంత్రులెవరూ గతంలో ఒక నిర్దిష్ట వర్గాన్ని, ప్రతిపక్షాన్ని లక్ష్యంగా చేసుకుని ఇలాంటి విద్వేషపూరిత, అసభ్యకర, మొరటు మాటలు మాట్లాడలేదు. జీవితంలో ఎన్నడూ ఇలాంటి ప్రసంగాలు నేను చేయలేదు. అలాంటిది, మోదీ నాకు కూడా కొన్నిటిని ఆపాదించారు. ఇలాంటివి బీజేపీ నేతలకు మాత్రమే సాధ్యం'అని మన్మోహన్ వ్యాఖ్యానించారు. దేశ వనరులపై మొదటి హక్కు ముస్లింలకే ఉందంటూ గతంలో మన్మోహన్ అన్నారని మోదీ ఆరోపించడం తెల్సిందే.

అనారోగ్యమైతే ప్రచారం ఎలా చేశారు?

అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిలు ఇవ్వొద్దు : ఈడీ వాదన

సాక్షి, న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ అనారోగ్యంగా ఉంటే ఎన్నికల ప్రచారం ఎలా నిర్వహించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ప్రశ్నించింది. అనారోగ్యం దృష్ట్యా రెగ్యులర్ బెయిల్‌తోపాటు వారం పాటు మధ్యంతర బెయిల్ ఇవ్వాలంటూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్లపై ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ కావేరి బవేజా గురువారం విచారణ చేపట్టారు. ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదనలు వినిపించారు కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వొద్దని కోర్టును కోరారు. ''ప్రస్తుతం కేజ్రీవాల్ కస్టడీలో లేరు. సుప్రీంకోర్టు ఆయన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. గురువారం కూడా పంజాబ్‌లో ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు'' అని ఎస్.వి.రాజు పేర్కొన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. కేజ్రీవాల్ రెగ్యులర్ పిటిషన్‌పై కౌంటరు దాఖలు చేయాలని ఈడీని ఆదేశించారు.

భార్య భోజనం వడ్డించలేదని..

తల నరికి, చర్మం ఒలిచి..!



నిందితుడు

తుంకూర్: భోజనం వడ్డించ లేదని భార్యతో తగవుపెట్టుకున్నాడు. పట్టరాని కోపంతో ఆమె తలను నరికేశాడు. అంతటితో ఆగక చర్మం ఒలి చేయడం మొదలుపెట్టాడు. తెల్లవారేదాకా ఒలుస్తూనే ఉన్నాడు. ఉదయం తాము ఉంటున్న ఇంటి యజమానికి ఈ ఘోరం వివరించాడు. దీంతో దారుణం వెలుగులోకి వచ్చింది. కర్ణాటక రాష్ట్రం తుంకూరు జిల్లా కునిగల్ తాలుకాలోని హాళియూరుదుర్గ పట్టణంలో సోమవారం రాత్రి ఘటన చోటుచేసుకుంది. శివరామ, పుష్పలత(35)లకు పదేళ్ల క్రితం కులాంతర వివాహమైంది. వారికి ఎనిమిదేళ్ల కుమారుడున్నాడు. శివరామ కోత మిల్లులో కార్మికుడు. తరచూ దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి కోతమిల్లు నుంచి ఇంటికి వచ్చిన భర్తకు పుష్పలత భోజనం వడ్డించలేదు. ఇద్దరిమధ్య మొదలైన గొడవ తీవ్రమైంది. శివరామ ఆగ్రహంతో కొడవలితో భార్య తలనరికాడు. తర్వాత ఇతర అవయవాలను వేరు చేశాడు. చర్మం ఒలిచేయడం మొదలుపెట్టాడు. ఇల్లంతా రక్తపు మడుగులా మారింది. పేగులు చెల్లాచెదురుగా పడిపోయాయి. తెల్లవారేదాకా చర్మం ఒలుస్తూనే ఉన్నాడు. కుమారుడు అటు పక్కనే నిద్రిస్తుండగానే ఇదంతా జరిగిపోయింది. ఉదయం తాము ఉంటున్న యజమానికి శివరామ విషయం తెలిపాడు. అతడు పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులొచ్చి ఈ బీభత్సాన్ని స్వయంగా చూసిన తర్వాతే దారుణం బయటకు వచ్చింది. శివరామను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు నేరం అంగీకరించాడని తుంకూర్ ఎస్పీ అశోక్ వెంకట్ గురువారం తెలిపారు.

కశ్మీర్‌లో లోయలో పడిన బస్సు..

22 మంది తీర్థయాత్రికులు మృతి

మరో 57 మందికి గాయాలు..ఆరుగురి పరిస్థితి విషమం


జమ్మూ: తీర్థయాత్రికులతో వెళ్తున్న బస్సు అదుపు తప్పి లోయలో పడిన ఘటనలో తొమ్మిదిమంది మహిళలు, ఇద్దరు చిన్నారులు సహా 22 మంది ప్రాణాలు కోల్పోయారు. 25 మంది మహిళలు, 12 మంది చిన్నారులు సహా మరో 57 మంది గాయాలపాలయ్యారు. జమ్మూ జిల్లా చోరా ప్రాంతంలోని తుంగి-మోర్హ్ వద్ద గురువారం మధ్యాహ్నం 12.35 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్, హరియాణాలకు చెందిన మొత్తం 79 మంది ప్రయాణికులు జమ్మూకశ్మీర్‌లోని రియాసి జిల్లా పౌని ప్రాంతంలో ఉన్న శివ్ ఖోరి ఆలయానికి బస్సులో బయలుదేరారు. ప్రమాదకర మలుపులో ఎదురుగా వేగంగా వస్తున్న కారును తప్పించే క్రమంలో డ్రైవర్ బస్సుపై అదుపు కోల్పోయాడు. దీంతో, బస్సు సుమారు 150 అడుగుల లోయలోకి దూసుకెళ్లిందని ఓ ప్రయాణికుడు తెలిపారు. సమాచారం తెల్సుకున్న వెంటనే ఆర్మీ, పోలీసులు, స్థానికులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను బయటకు తీసుకువచ్చారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 53 మంది మృతి

గాజా: ఇజ్రాయెల్ ఆర్మీ యథేచ్ఛగా కొనసాగిస్తున్న దాడులతో 24 గంటల వ్యవధిలో గాజాలో 53 మంది మృతి చెందగా మరో 357 మంది గాయపడ్డారని స్థానిక ఆరోగ్య శాఖ తెలిపింది. వీరిలో ఇద్దరు పాలస్తీనా రెడ్ క్రీసెంట్ సొసైటీకి చెందిన పారా మెడికల్ సిబ్బంది కూడా ఉన్నారని వివరించింది. టాల్ అస్-సుల్తాన్ ప్రాంతంలో జరిగిన బాంబుదాడిలో బాధితులకు సాయం అందించేందుకు వెళ్లగా వీరు గాయపడినట్లు వెల్లడించింది. తాజా మరణాలతో గతేడాది అక్టోబర్ 7వ తేదీ నుంచి ఇప్పటి వరకు కనీసం 36,224 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోగా మరో 81,777 మంది క్షతగాత్రులైనట్లు అంచనా. ఇలా ఉండగా, ఈజిప్టుతో సరిహద్దులు పంచుకుంటున్న గాజా ప్రాంతం మొత్తాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకున్నట్లు ఇజ్రాయెల్ ఆర్మీ గురువారం తెలిపింది.

జవాన్లను కార్మికులుగా మార్చేశారు

మేమొస్తే అగ్నివీర్‌ను రద్దుచేస్తాం: రాహుల్



బాలాసోర్(ఒడిశా): అగ్నివీర్ పథకం ద్వారా ప్రధాని మోదీ జవాన్లను కార్మికులుగా మార్చేశారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒడిశాలోని భద్రక్ లోక్‌సభ నియోజకవర్గంలోని సిమూలియా పట్టణంలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారర్యాలీలో రాహుల్ ప్రసంగించారు. '' విపక్షాల ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రైతు రుణాలను మాఫీచేస్తాం . అగ్నివీర్ పథకం తెచ్చి ప్రధాని మోదీ జవాన్లను కార్మికులుగా మార్చేశారు. మేం అగ్నివీర్‌ను రద్దు చేసి ఆ కార్మికులను మళ్లీ జవాన్లుగా మారుస్తాం. వారికి పెన్షన్, క్యాంటీన్ సౌకర్యాలు కల్పిస్తాం. విధి నిర్వహణలో మరణిస్తే గౌరవప్రద 'అమరుడు' హోదా దక్కేలా చేస్తాం . పంటకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తాం' అని అన్నారు.

నవీన్ బాబుపై కేసులేవి?: ''ఒడిశాలో బీజేడీ పార్టీ బీజేపీ కోసం పనిచేస్తోంది. నాపై మోపిన 24 పరువునష్టం, క్రిమినల్ కేసులను న్యాయంగా ఎదుర్కొంటున్నా. ఈడీ నన్ను 50 గంటలు విచారించింది. బీజేపీ నా లోక్‌సభ సభ్యత్వాన్ని, నాకు కేటాయించిన అధికారిక ఎంపీ బంగ్లానూ లాగేసుకుంది. నవీన్ బాబు(పట్నాయక్) నిజంగా బీజేపీకి వ్యతిరేకంగా పోరాడితే ఆయన మీద కూడా ఇలాగే కేసులు ఉండాలికదా. మరి లేవెందుకు?' అని అన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ వాళ్లకు అంతకుమించి తెలీదు

హాలీవుడ్ 'గాంధీ' సినిమా తర్వాతే గాంధీజీ విశేషాలు ప్రపంచానికి తెలిశాయంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై రాహుల్ స్పందించారు. '' ఆర్‌ఎస్‌ఎస్ వాళ్లకు గాంధీజీ గురించి అంతకుమించి ఏం తెలీదు. ఎందుకంటే ఆర్‌ఎస్‌ఎస్ 'శాఖ'లో శిక్షణపొందిన వాళ్లు గాడ్సేను ఆరాధిస్తారు. గాంధీజీ గురించి వాళ్లకు తెలిసింది శూన్యం. హిందుస్తాన్, సత్యం, అహింసా మార్గం వంటి చరిత్ర వాళ్లకు బొత్తిగా తెలీదు. మోదీ అలా మాట్లాడతారని ఊహించిందే' అని అన్నారు.

దూసుకెళ్లిన 'అగ్నిబాణ్'

బుల్లి రాకెట్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించిన ప్రైవేట్ సంస్థ అగ్నికుల్

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): నాలుగు వరుస వాయిదాల అనంతరం ప్రైవేట్ అంతరిక్ష స్టార్టప్ కంపెనీ అగ్నికుల్ కాస్మోస్‌కు చెందిన చిన్న తరహా రాకెట్ 'అగ్నిబాణ్' సబ్ ఆర్బిటల్ ప్రయోగం (ఎస్‌ఓటీడీ) ఎట్టకేలకు విజయవంతమైంది. సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రంలోని ధనుష్ రాకెట్ కాంప్లెక్స్ నుంచి గురువారం ఉదయం 7.45 గంటలకు రాకెట్ విజయవంతంగా రోదసిలోకి దూసుకెళ్లింది. సింగిల్ స్టేజ్‌లో రెండు నిమిషాల్లో ప్రయోగం జరిగింది. రాకెట్ సామర్థ్యాన్ని, ప్రపంచంలోనే తొలిసారిగా అగ్నికుల్ సంస్థ తయారు చేసుకున్న పూర్తి దేశీయ సింగిల్ పీస్ త్రీడీ ప్రింటెడ్ సెమీ క్రయోజనిక్ ఇంజన్తో పాటు ఇస్రో అందించిన సెమీ క్రయోజనిక్ ఇంజన్ల సామర్థ్యాన్ని నిర్ధారించుకునేందుకు ప్రయోగాత్మకంగా ఈ పరీక్ష నిర్వహించారు. 100 కిలోలు బరువున్న ఎక్స్‌పరమెంటల్ పేలోడ్‌ను భూమికి 700 కిలోమీటర్ల ఎత్తులోని లియో అర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టి రాకెట్ సామర్థ్యాన్ని నిర్ధారించుకున్నారు. అనంతరం రాకెట్ సురక్షితంగా సముద్రంలో కూలిపోయింది. ఇది మన దేశంలో ప్రైవేట్ లాంచ్‌ప్యాడ్ మీద చేసిన తొలి ప్రయోగం కావడం విశేషం. అలాగే సెమీ క్రయోజనిక్ ఇంజన్ అభివృద్ధి తర్వాత ఇస్రోకు కూడా ఇది తొలి ప్రయోగమే. 300 కిలోల లోపు బుల్లి ఉపగ్రహాల ప్రయోగాలకు అగ్నికుల్ రాకెట్ అత్యంత అనుకూలం. దేశంలో ఇది రెండో ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగం.

అగ్నిబాణ్ విశేషాలు
రాకెట్ ఎత్తు 18 మీటర్లు
వెడల్పు 1.3 మీటర్లు
బరువు 14,000 కిలోలు
రాకెట్ దశలు 2
700 కిలోమీటర్లు
ఎత్తులోని లియో ఆర్బిట్

ఒకరోజు ముందే..

కేరళను తాకిన నైరుతి

సాక్షి, న్యూఢిల్లీ: వరుణదేవుడు ఒక రోజు ముందుగానే కర్షకులను కరుణించాడు. అంచనాల కంటే ఒక రోజు ముందుగానే నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించినట్లు గురువారం భారత వాతావరణ శాఖ 'ఎక్స్' ద్వారా ప్రకటించింది. సాధారణంగా కేరళలోకి నైరుతి రుతుపవనాలు ఏటా జూన్ ఒకటిన ప్రవేశిస్తాయి. కేరళలో ఇప్పటికే కురుస్తున్న వర్షాలకు తోడు రుతుపవనాల రాకతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడనున్నాయి. ఈశాన్య ప్రాంతాల్లోనూ రుతుపవనాలు ప్రవేశించాయి. ఈ రెండు ప్రాంతాలు ఒకేసారి తాకడం అరుదైన విషయమని వాతావరణ శాఖ తెలిపింది. గతంలో 2017, 1997, 1995, 1991లో ఒకేసారి తాకాయని పేర్కొంది.

లాక్కొచ్చిన రేమాల్!

అంచనాలకంటే ముందుగా రుతుపవనాల రాకకు రేమాల్ తుపాను కూడా కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గత ఆదివారం పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌లలో భీకర వర్షాలతో బీభత్సం సృష్టించిన రేమాల్ తుపానుతో బంగళాఖాత జలాల ఉపరితల వాతావరణంలో మార్పులు సంభవించాయి. ఈ మార్పులు నైరుతి రుతుపవనాలను ఈ దిశగా త్వరగా లాగాయి. దీంతో ముందుగానే రుతుపవనాల ఆగమనం సాధ్యమైందని శాస్త్రవేత్తలు విశ్లేషించారు. రాబోయే మూడు, నాలుగు రోజుల్లో రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉందని తెలుస్తోంది.

వడదెబ్బ... 108 డిగ్రీల జ్వరం

ఢిల్లీలో మధ్యవయస్కుడి హఠాన్మరణం

న్యూఢిల్లీ: ఢిల్లీని చుట్టుముట్టిన వడగాలులు ఒక మధ్యవయస్కుడి ప్రాణం తీశాయి. వడదెబ్బతో ఆస్పత్రిలో చేరిన అతడి శరీర ఉష్ణోగ్రత చూసి వైద్యులు హతాశులయ్యారు. అతని శరీర ఉష్ణోగ్రత సాధారణం కంటే 10 డిగ్రీలు ఎక్కువ ఉండటం గమనార్హం. సోమవారం రాత్రి జరిగిన ఘటన వివరాలను రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రి డాక్టర్ రాజేశ్ శుక్లా వెల్లడించారు. '' బిహార్‌లోని దర్భాంగా పట్టణానికి చెందిన 40 ఏళ్ల వ్యక్తి సోమవారం ఢిల్లీలో వడదెబ్బకు గురయ్యారు. వెంటనే ఆర్‌ఎంఎల్ ఆస్పత్రిలో చేరారు. ఆయన శరీర ఉష్ణోగ్రత 108 డిగ్రీ ఫారన్‌హీట్‌కు చేరుకోవడం చూసి ఆందోళనకు గురయ్యాం. ఆయనను ఎలాగైనా కాపాడాలని శతథా ప్రయత్నించాం. కానీ శరీరంలో అతివేడి కారణంగా ఆయన మూత్రపిండాలు, కాలేయం విఫలమయ్యాయి. ఇలా వెంటవెంటనే పలు అవయవాలు వైఫల్యం చెందడంతో ఆయన కన్నుమూశారు' అని డాక్టర్ వివరించారు.

ఒకే ఆస్పత్రిలో 2 గంటల్లో 16 మరణాలు

పట్నా: ఉగ్ర ఉష్ణోగ్రత బిహార్‌లోని ఒకే ఆస్పత్రిలో 16 మంది ప్రాణాలను బలితీసుకుంది. గురువారం ఔరంగాబాద్‌లోని జిల్లా ఆస్పత్రిలో ఈ విషాద ఘటన జరిగింది. గురువారం అక్కడ 44, బుధవారం 48.2 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇంతటి వేడికి తాళలేక జనం పిట్టల్లా రాలిపోయారు. చాలా మంది అక్కడి జిల్లా ఆస్పత్రిలో చేరగా గురువారం రెండు గంటల వ్యవధిలో 16 మంది చనిపోయారు.

సాక్షి కరీంనగర్

శుక్రవారం | 31 | మే | 2024



క్వింటాల్ పత్తి రూ.7,400

జమ్మికుంట: స్థానిక పత్తి మార్కెట్‌లో క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,400 పలికింది. మార్కెట్‌కు 28 వాహనాల్లో 448 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు.



రాజన్న సన్నిధిలో రద్దీ

వేములవాడ: రాజన్నను గురువారం 10 వేల మంది దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.15 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
44.2/31.0

వాతావరణం

నేడు జిల్లాలో తీవ్రమైన ఎండ ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.



బ్యాటింగ్ చేస్తున్న సీపీ అభిషేక్ మహంతి

పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. సీపీ అభిషేక్ మహంతి జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు పోటీలు కొనసాగుతాయన్నారు. డివిజన్లవారీగా హెడ్ క్వార్టర్స్, స్పెషల్ వింగ్స్ మొత్తం ఐదు టీంలు పాల్గొంటున్నాయని తెలిపారు. అథ్లెటిక్స్, వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, హ్యాండ్ బాల్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. – కరీంనగర్‌క్రైం

న్యూస్‌రీల్

నేడు 'కొండూరి' రాజీనామా!



రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): రాష్ట్ర సహకార బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్ పదవికి గంభీరావుపేట సింగిల్ విండో చైర్మన్, కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ శుక్రవారం రాజీనామా చేయనున్నారు. టెస్కాబ్ చైర్మన్‌గా దాదాపు 9 ఏళ్లు పనిచేసిన రవీందర్‌రావుపై కొద్ది రోజుల క్రితం టెస్కాబ్ డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం ప్రకటించారు. ఈ నేపథ్యంలో అవిశ్వాసానికి ముందే తన పదవికి రాజీనామా చేసే యోచనలో రవీందర్‌రావు ఉన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అత్యంత సన్నిహితునిగా ఉండి జిల్లాలో అత్యంత కీలకంగా పనిచేస్తున్న రవీందర్‌రావుపై పార్టీ మారాలనే ఒత్తిళ్లు వచ్చాయని, కానీ, పార్టీ మారేది లేదని బీఆర్‌ఎస్ వెంటే పనిచేస్తానని నిర్ణయం తీసుకొని చైర్మన్ పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

బాలసదన్ సందర్శన



బాలసదన్‌లో శిక్షణ న్యాయమూర్తులు

కరీంనగర్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ ఆధ్వర్యంలో తొమ్మిది మంది శిక్షణ న్యాయమూర్తులు నగరంలోని ప్రభుత్వ బాలసదన్‌ను సందర్శించారు. సదన్‌లోని బాలికలతో ముచ్చటించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. శిశుగృహను సందర్శించి పిల్లలకు అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్‌టౌన్: ఆశా కార్యకర్తలకు పరీక్ష నిర్వహించి, సర్టిఫికెట్లు ఇస్తామనే ఆలోచనను విరమించుకోవాలని డిప్యూటీ రెవెన్యూ అధికారి పవన్ కుమార్‌కు, డీఎంహెచ్‌వో సుజాతకు గురువారం ఆశా కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ప్రభుత్వం చేపట్టిన ప్రతీ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని అన్నారు. వీరికి కొత్తగా పరీక్ష పెట్టి గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.18,000గా నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు రంగవేణి శారద, జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత, జిల్లా ఉపాధ్యక్షురాలు కొంకట వెంకటలక్ష్మి, మహేశ్వరి, శోభ, కమల, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఒక్కోదానికి ఒక్కో రేట్!



- రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అడ్డగోలుగా అవినీతి!
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌లు
- 3 కార్యాలయాల్లో రెగ్యులర్, 11 చోట్ల ఇన్‌చార్జీలు
- డాక్యుమెంట్‌కో రేట్ అంటూ వసూలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతికి అడ్డాగా మారుతున్నాయన్న ఆరోపణలున్నాయి. అందులోనూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇన్‌చార్జీల పాలనలో నడుస్తున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలపైనే ఎక్కువగా వినిపిస్తున్నాయి. అధికశాతం కార్యాలయాలు ఇన్‌చార్జీలతోనే నడుస్తున్నాయి.

సెలవులో రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్లు..

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు ముగ్గురు సెలవులో వెళ్లారు. జూన్ మొదటివారంలో విధుల్లో చేరతారని తెలిసింది. దీంతో సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లతో నెట్టుకొస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో కిందిస్థాయి ఉద్యోగులకు ఇన్‌చార్జి బాధ్యతలు కేటాయించడంతో అవినీతికి తెరలేపుతున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలన్నట్లు కుర్చీలో ఉన్నంతకాలం అడ్డగోలుగా డబ్బులు దండుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఒక్కో డాక్యుమెంట్‌కు ఒక్కో రేట్ ఫిక్స్ చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అన్నీ సరిగా ఉంటేనే ఒక రేటు ఉండగా.. ఏదైనా లోపం ఉంటే చాలు.. వారు అడిగినంత ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారని సమాచారం.

కరీంనగర్ రూరల్, సుల్తానాబాద్, మల్యాలలోనే రెగ్యులర్..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కరీంనగర్, కరీంనగర్ రూరల్, గంగాధర, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, సిరిసిల్ల, పెద్దపల్లి, సుల్తానాబాద్, రామగుండం, హుజూరాబాద్, మంథని, మల్యాల, వేములవాడ మొత్తం 14 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటిలో కరీంనగర్ రూరల్, సుల్తానాబాద్, మల్యాలల్లోనే రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు ఉన్నారు. మిగతాచోట్ల ఆయా కార్యాలయాల్లో పనిచేస్తున్న సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించారు.

లోపాలుంటే రూ.లక్షల్లో డిమాండ్

ఇన్‌చార్జీలున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అన్నీ సరిగా ఉన్న డాక్యుమెంట్లకు రూ.300 నుంచి రూ.1,000 వరకు వసూలు చేస్తున్నారు. లోపాలుంటే మాత్రం రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నారు. నాన్ లేఅవుట్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తూ గజానికి రూ.100 నుంచి రూ.300 వరకు వసూలు చేస్తున్నారు. ఒక డాక్యుమెంట్‌లో ఉన్న ఏరియాను విభజిస్తే ఒక్కో విభాగానికి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు తీసుకుంటున్నారు. గతంలో పెద్దపల్లి, గంగాధర సబ్ రిజిస్ట్రార్లు అవినీతికి తెరలేపి, ఏసీబీకి చిక్కిన విషయం విదితమే. ప్రభుత్వానికి ఆదాయం సంపాదించిపెట్టే ముఖ్యమైన శాఖల్లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల శాఖ ఒకటి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈఏడాది జనవరి నుంచి మే వరకు 36,709 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా, రూ.111.19 కోట్ల ఆదాయం సమకూరింది. ఇలాంటి కీలకమైన శాఖలో పెద్ద ఎత్తున జరుగుతున్న అవినీతికి అడ్డుకట్ట వేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఈ ఏడాది జనవరి నుంచి జరిగిన రిజిస్ట్రేషన్లు, ఆదాయ వివరాలు

	డాక్యుమెంట్స్	మొత్తం (రూ.లక్షల్లో)
గంగాధర	3,260	950.81
హుజూరాబాద్	2,121	631.01
జగిత్యాల	3,766	1,208.52
మల్యాల	1,411	282.37
మంథని	1,186	207.07
మెట్‌పల్లి	2,091	446.84
పెద్దపల్లి	2,249	769.87
సిరిసిల్ల	4,278	721.13
సుల్తానాబాద్	1,044	283.66
వేములవాడ	3,951	831.16
కరీంనగర్	5,148	2,740.96
కరీంనగర్‌రూరల్	2,114	505.91
కోరుట్ల	2,082	572.04
రామగుండం	2,008	967.83

పకడ్బందీగా గ్రూప్–1



అల్గునూరు పాఠశాలలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- కరీంనగర్‌లో 36కేంద్రాలు, 18,663 అభ్యర్థులు
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో జూన్ 9న జరగనున్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో గ్రూప్–1 ప్రిలిమ్స్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. కరీంనగర్‌లో 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో 34 ప్రైవేట్ విద్యాసంస్థలు, రెండు ప్రభుత్వ విద్యాసంస్థలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో 18,663 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్తు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బయోమెట్రిక్ హాజరు విధానం ఉంటుందని, అభ్యర్థులు ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఏదైనా గుర్తింపు కార్డును తీసుకురావాలని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌వో పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్, అడిషనల్ డీసీపీ కుమార్, కొండగట్టు జేఎన్టీయూ కళాశాల ప్రొఫెసర్ సతీశ్‌కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కాళిచరణ్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లపై గురువారం సమీక్షించారు. 2న ఉదయం తొమ్మిది గంటలకు కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరణ, అనంతరం ప్రసంగం ఉంటుందన్నారు. వేడుకలకు హాజరయ్యేలా ప్రజాప్రతినిధులు, అధికారులకు సమాచారం అందించాలన్నారు. అమరవీరుల కుటుంబాలకు ఘన సన్మానం ఉంటుందని, సదరు కుటుంబాలకు సమాచారమివ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని పేర్కొన్నారు. అనంతరం వేడుకల నిర్వహణకు కలెక్టరేట్‌లో అనువైన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు.

ఒకే కంపెనీ పత్తి విత్తనాలు వాడొద్దు

రైతులు ఒకే రకం కంపెనీ పత్తి విత్తనాలను తరచూ వాడకుండా, వివిధ రకాల కంపెనీల విత్తనాలను వాడాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పత్తి విత్తనాలు, పచ్చిరొట్ట ఎరువుల సరఫరాపై వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. 48 వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగుచేసే అవకాశముందని తెలిపారు. ఇందుకు లక్ష ఇరవై వేల పత్తి ప్యాకెట్లు అవసరమవుతాయని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా లక్ష 30 వేల పత్తి విత్తనాల ప్యాకెట్లను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. విత్తనాలు విక్రయించే షాపుల్లో వ్యవసాయ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి బత్తిని శ్రీనివాస్, ఏడీఏలు రణధీర్‌రెడ్డి, రామారావు, సునీత పాల్గొన్నారు.

గడువులోపు పనులు పూర్తి చేయాలి

తిమ్మాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు గడువులోగా నాణ్యతతో పూర్తిచేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కాకతీయ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. పాఠశాలల్లో పాత ఫర్నిచర్, పాత పుస్తకాల లిస్టు తయారు చేయాలని డీఈవోకు సూచించారు. పనులన్నీ జూన్ 4వ తేదీలోగా పూర్తి కావాలన్నారు. డీఈవో జనార్దన్‌రావు, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, తహసీల్దార్ కనకయ్య పాల్గొన్నారు.

కులగణన చేపట్టాకే ఎన్నికలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

కరీంనగర్: కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్యగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... జూన్ 4న ఎన్నికల కోడ్ ముగియగానే కులగణన ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సమగ్ర కులగణన చేపడతామని ఏకగ్రీవ తీర్మానం చేశారని, అందుకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 26ను తీసుకువచ్చి రూ.150కోట్ల బడ్జెట్ కేటాయించిందని గుర్తుచేశారు. కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ విషయమై త్వరలోనే 136 కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలవనున్నట్లు ప్రకటించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్ మాట్లాడుతూ శాస్త్రీయమైన కులగణన ద్వారానే భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన వివాదాలు రాకుండా బీసీ రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. బిహార్ తరహాలో తెలంగాణలోనూ కులగణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈడిగా శ్రీనివాస్, విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్‌చారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి జీఎస్.ఆనంద్, రాష్ట్ర కార్యదర్శి రంగు సంపత్ పాల్గొన్నారు.

పదోన్నతుల పండుగ

- సర్వీసు రెండేళ్లకు కుదింపుతో పెరగనున్న సంఖ్య
- అటెండర్ నుంచి జిల్లాస్థాయి అధికారి వరకు ప్రమోషన్
- శాఖలవారీగా ఖాళీలపై మొదలైన ప్రక్రియ
- మంజూరు, వర్కింగ్, ఖాళీ పోస్టుల సేకరణలో యంత్రాంగం



కరీంనగర్ అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలతో పాటు పదోన్నతుల ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. పలుశాఖల్లో 10ఏళ్లకు పైగా విధులు నిర్వహించినా.. పదోన్నతులు లేని పరిస్థితి. జిల్లాల పునర్విభజన జరిగి ఏళ్లు గడవగా ప్రతీశాఖలో పదోన్నతులు వరించనున్నాయి. గతంలోనే పదోన్నతికి ఉన్న అర్హతను మూడేళ్ల సర్వీసు నుంచి రెండేళ్లకు కుదించి, డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ(డీపీసీ) ఏర్పాటు చేసిన విషయం విదితమే. వీలైనంత త్వరగా పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఉద్యోగుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. తొలుత శాఖలవారీగా ఖాళీలను గుర్తించగా ఉన్నతాధికారులకు నివేదించారు.

సర్వీస్.. అర్హతే కొలమానం

జిల్లాల పునర్విభజన తర్వాత శాఖల స్వరూపాలు మారడం.. ఆయాశాఖల్లో ఖాళీలు పాలనపై ప్రభావం పడుతోంది. జిల్లాలో ప్రస్తుతం 50కి పైగాశాఖలు ఉన్నట్లుగా అధికారిక వర్గాల సమాచారం. ఆయాశాఖల పరిధిలో 12,435 మంది ఉద్యోగులు 010 హెడ్ కింద వేతనం పొందుతున్నట్లు ట్రెజరీ కార్యాలయం వద్ద ఉన్న సమాచారం బట్టి స్పష్టమవుతోంది. వీరందరికి ఆయాశాఖల్లో ఖాళీలు, అర్హతలు బట్టి పదోన్నతులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తున్నా.. రాష్ట్ర ఏర్పాటు తర్వాత రెండోసారి పదోన్నతుల ప్రక్రియ సాగుతోంది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే శాఖాపర పరీక్షల్లోనూ అర్హత సాధించడం తప్పనిసరి. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నా పదోన్నతి పొందే ఉద్యోగానికి సరిపడా అర్హతలు లేకపోతే ప్రయోజనం ఉండదు. పదోన్నతుల్లోనూ 70శాతం మేర ఖాళీలను ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులతో భర్తీ చేయాలనేది నిబంధన. మిగిలిన 30శాతం ఖాళీలు ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. పదోన్నతుల ప్రక్రియ ఉద్యోగులకే కాదు నిరుద్యోగుల్లోనూ ఆశలు పెంచుతోంది.

ప్రత్యేక ఫార్మాట్‌లో వివరాల సేకరణ

జిల్లాలో శాఖలవారీగా తొలుత ఖాళీలు సేకరించాలంటూ రెండు నెలల క్రితం ఆయా శాఖల ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత ప్రొఫార్మాలో ఆ వివరాలు సమర్పించాలని కోరారు. సేకరించిన వివరాలపై కలెక్టర్ శాఖలవారీగా సమీక్షించనున్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో పదోన్నతులు ఇవ్వనున్నారు.

జిల్లా నుంచి రాష్ట్ర కేడర్ వరకు

కరీంనగర్, సిద్దిపేట, సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్ జిల్లాలు కలిపి రాజన్న జోన్‌గా ఉండనుండగా జోనల్ పోస్టులన్నింటిని ఈ పరిధిలో బదిలీలు, పదోన్నతులు చేపట్టనున్నారు. ఇక అన్నిశాఖలకు ఒకే విధానాన్ని కొనసాగించాలని నిర్ణయించినట్లు సమాచారం. అటెండర్, జూనియర్ అసిస్టెంట్, పోస్టులకు జిల్లాస్థాయిలో బదిలీలు, పదోన్నతులు నిర్వహించనుండగా సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్లను జోన్ పరిధిలో, గెజిటెడ్ అధికారులకు డీటీలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎటీవో, ఎస్‌టీవో ఇలా వివిధ రకాల హోదా గల అధికారులకు మల్టీజోన్ వారీగా బదిలీ, పదోన్నతి ఉండనుంది. ఆర్డీవోలు, జిల్లా స్థాయి అధికారులకు రాష్ట్రస్థాయిలో బదిలీలుండనున్నాయి. గెజిటెడ్ అధికారుల బదిలీలకు ఇదే వేదిక కానుండగా రాజన్న, కాళేశ్వరం, బాసర, భద్రాద్రి జోన్లను కలిపి మల్టీజోన్‌గా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

జిల్లాలో ఉద్యోగుల లెక్క

మొత్తం ఉద్యోగులు: 8,607
గెజిటెడ్ అధికారులు: 1,155
నాన్‌గెజిటెడ్: 6,295
క్లాస్–4: 1,157

సిటీ.. పిటీ

'స్మార్ట్'రోడ్లపై చెత్తాచెదారం



అన్నపూర్ణ కాంప్లెక్స్ పార్కింగ్ స్థలంలో..



మదీనా కాంప్లెక్స్ వద్ద..

విద్యానగర్(కరీంనగర్): స్మార్ట్‌సిటీ రోడ్లు కంపు కొడుతున్నాయి. ఏ రోడ్డు చూసినా.. గుట్టలుగా పేరుకుపోయిన చెత్త.. భరించలేదని దుర్వాసన వెదజల్లుతోంది. వాహనదారులు, పాదచారులు ముక్కుమూసుకోక తప్పడం లేదు. స్మార్ట్‌సిటీ నిధులు రూ.కోట్లు వెచ్చించి నగరాన్ని అందంగా తీర్చిదిద్దితే మూణ్నాళ్ల ముచ్చటగానే మారుతోంది. పారిశుధ్య నిర్వహణ ప్రతిష్టాత్మకంగా చేపట్టాల్సిన నగరపాలక సంస్థ అధికారులు పైపై పనులు చేస్తుండడంతో నగరంలో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. డంపర్ బిన్లు నిండిపోయి రోడ్డంతా చెత్తతో నిండిపోతోంది. హోటళ్లు, రెస్టారెంట్లు, వాణిజ్య వ్యాపార కేంద్రాల పరిసరాలు వ్యర్థాలకు నిలయాలుగా మారుతున్నాయి. నగరంలోని డైలీ మార్కెట్, మదీనా కాంప్లెక్, అన్నపూర్ణ కాంప్లెక్స్, యూనియన్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్, చైతన్యపురి సబ్‌స్టేషన్, మంచిర్యాల రోడ్, ప్రభుత్వ ప్రధానాసుపత్రి వెనుక వైపు, వీక్లీ మార్కెట్ తదితర ప్రాంతాల్లో చెత్త పాయింట్లు ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో పేరుకుపోతున్న చెత్తను తొలగించడంలో పారిశుధ్య విభాగం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అన్నపూర్ణ కాంప్లెక్స్, మదీన కాంప్లెక్స్ వద్ద కుళ్లిన పండ్లు, ప్యాకింగ్‌తో వచ్చిన గడ్డి, చిత్తు పేపర్లు, ఫోంషీట్లు, యూనియన్ బ్యాంకు వద్ద పూల వ్యాపారులు వాడిన పూలు, అలంకరణ వస్తువులు, చెడిపోయిన ఇతర వస్తువులు వేస్తుండడంతో దుర్వాసనతో బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. బల్దియా ఉన్నతాధికారులు స్పందించి చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సిటీ ప్రజలు కోరుతున్నారు.



బస్టాండ్ వెనుక రోడ్డులో..



వీక్లీ మార్కెట్ పరిసరాల్లో..

ఆవిర్భావ వేడుకలు వైభవంగా నిర్వహిస్తాం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు



సమావేశమైన బీఆర్‌ఎస్ నాయకులు

కరీంనగర్: పదేళ్ల తెలంగాణ ఆవిర్భావ వేడుకలను మూడు రోజుల పాటు బీఆర్‌ఎల్ పార్టీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు పేర్కొన్నారు. గురువారం భగత్‌నగర్‌లోని బోయినపల్లి వినోద్‌కుమార్ నివాసంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, వినోద్ కుమార్, మేయర్ సునీల్‌రావు, ఒడితెల సతీశ్‌కుమార్, సుంకె రవిశంకర్, రవీందర్‌సింగ్, జెడ్పీ చైర్‌పర్సన్ విజయతో కలిసి సమావేశమయ్యారు. జిల్లా నుంచి వెయ్యి మంది బీఆర్‌ఎస్ ముఖ్యనాయకులతో హైదరాబాద్‌కు జూన్ 1న సాయంత్రం 5:30గంటలకు వెళ్లి, సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న అమరవీరులస్తూపం వరకు ర్యాలీగా వెళ్లనున్నట్లు తెలిపారు. 2న తెలంగాణభవన్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు. 3న తీగలగుట్టపల్లిలోని కేసీఆర్‌భవన్‌లో జాతీయజెండా, బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేయడం, వివిధ సేవా కార్యక్రమాలలో పాల్గొనడం జరుగుతుందని అన్నారు. రాజన్న సిరిసిల్ల జెడ్పీవైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్, బండ శ్రీనివాస్, వీర్ల వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో కండక్టర్ మృతి


శంకర్ (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్)/కాల్వశ్రీరాంపూర్: మండలంలోని కన్నాపూర్‌కు చెందిన కా రంపూరి శంకర్ కరీంనగర్–2డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా బుధవా రం కాల్వశ్రీరాంపూర్‌కు నైట్‌హాల్ట్‌కు వెళ్లా డు. ఈక్రమంలో శంకర్‌కు బస్సులోనే గుండెపోటు రాగా స్థానికంగా ఉన్న హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. చికిత్స అందేలోపే మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

మామిడిపల్లిలో యువకుడు..

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన బదుగు కిరణ్(36) గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. కిరణ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. గురువారం గుండెలో నొప్పి అంటూ కుప్పకూలాడు. కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, కుమారుడు ఉన్నారు.

రైలు పట్టాల పక్కన వ్యక్తి..


సద్దాం పాషా మృతదేహం

రామగుండం: రామగుండం రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద రైలు పట్టాల పక్కన సయ్యద్ సద్దాం పాషా (37) అనే వ్యక్తి పడుకొని మృతి చెందినట్లు జీఆర్పీ ఇన్‌చార్జి గంగారపు తిరుపతి తెలిపారు. సద్దాం పాషా మద్యానికి బానిసై నిత్యం కాలనీల్లో సంచరించే వాడన్నారు. మృతుడి సోదరుడు సాబీర్ పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య


రాజయ్య మృతదేహం

ముస్తాబాద్(సిరిసిల్ల): భార్య అనారోగ్యానికి గురైందని మనస్తాపం చెందిన ఓ వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన బెదుర రాజయ్య (75) భార్య ఇటీవల కిందపడడంతో నడుం విరిగింది. భార్య ఆరోగ్యం బాగు కావడం లేదని మనస్తాపం చెందాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోనరావుపేటలో యువకుడు..


నవీన్ (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు.. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన బోయిని కాశయ్య–సరళ దంపతుల కుమారుడు బోయిని నవీన్ (21) గ్రామంలోని నానమ్మ, తాత ఎల్లవ్వ, ముత్తయ్య వద్ద ఉంటున్నాడు. తల్లి సరళకు కళ్లు కనబడకపోగా అనారోగ్యంతో బాధపడుతోంది. తండ్రి రెండో వివాహం చేసుకుని వేరే ఉంటున్నాడు. డిగ్రీ మొదటి సంవత్సరం కరీంనగర్‌లో చేరిన నవీన్ మధ్యలోనే మానేశాడు. తల్లి, నానమ్మ, తాతయ్య ఆరోగ్యం బాగా లేకపోవడంతో మనస్తాపానికి గురైన నవీన్ గురువారం వేకువజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రఘుపతిరెడ్డి తెలిపారు.

యువతి అనుమానాస్పద మృతి

- ప్రియుడే చంపాడని ఆరోపిస్తున్న కుటుంబ సభ్యులు
- రాజన్న సిరిసిల్ల జిల్లా బాబాయ్ తండాలో గిరిజనుల ఆందోళన
- గ్రామంలో ఉద్రిక్త వాతావరణం
- మోహరించిన పోలీసులు


యువకుడి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న యువతి కుటుంబసభ్యులు


మమత (ఫైల్)

వీర్నపల్లి(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. కాగా ప్రేమించిన యువకుడే చంపాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. యువతి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. వీర్నపల్లి మండలం బాబాయ్ చెరువుతండా గ్రామానికి చెందిన బానోతు మమత (21) కుటుంబ సభ్యులు గురువారం అదే మండలంలోని బావుసింగ్ తండా గ్రామంలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. ఇంటి వద్ద మమత ఒక్కతే ఉంది. ఇంతలోనే మమత మృతిచెందిన సమాచారం వచ్చిందని ఆమె కుటుంబ సభ్యులు రోదిస్తూ తెలిపారు.

ఏడాదిగా ప్రేమ వ్యవహారం

వీర్నపల్లి మండలం బావుసింగ్ తండా పరిధి గోల్యానాయక్ తండాకు చెందిన ఓ యువకుడు, మమత ఏడాదిగా ప్రేమించుకుంటున్నారని తెలిసి ఇటీవల ఇరువురు పెద్దల సమక్షంలో మాట్లాడుకున్నారు. పెద్ద మనుషుల మాటముచ్చట నచ్చకపోవడంతో సదరు యువకుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇద్దరూ దూరంగా ఉంటున్నారు. కాగా గురువారం మమత ఇంటి వద్ద ఒక్కతే ఉందని తెలుసుకున్న సదరు యువకుడు ఆమెపై దాడి చేసి, ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. సదరు యువకుడి ఇంటి వద్దకు వెళ్లి ఇంట్లోని వస్తువులు ధ్వంసం చేయగా, సీఐ శ్రీనివాస్, ఎస్సైలు రమేశ్, రమాకాంత్ సిబ్బందితో వారిని నిలువరించారు. తమకు న్యాయం జరిగేవరకు ఇక్కడి నుంచి కదలమని యువకుడి ఇంటి ఎదుట యువతి బంధువులు బైఠాయించారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆందోళన చేస్తున్నవారితో మాట్లాడినా ఫలితం లేకుండాపోయింది. మమతకు తల్లిదండ్రులు సరోజ, రామ్‌దాస్, సోదరుడు గణేశ్ ఉన్నారు. ఇంకా ఆందోళన కొనసాగుతుంది.

యథేచ్ఛగా చెరువుమట్టి తరలింపు


రగుడు బైపాస్ మీదుగా చెరువు మట్టిని తరలిస్తున్న టిప్పర్

సిరిసిల్లక్రైం: పొలాల్లో చెరువు మట్టి పోస్తే ఆ భూమి సారవంతం అవుతుందని అందరికీ తెలిసిందే. దీనిలో భాగంగా చెరువు మట్టి పొలాల్లో పోస్తామని సంబంధిత అధికారుల నుంచి నామమాత్రం అనుమతులు తీసుకుని, తీరా ఇటుక బట్టీలకు తరలిస్తుండడం జిల్లాలో జోరుగా సాగుతోంది. వేములవాడ, కొడిముంజ చెరువుల నుంచి పలువురు అనధికారికంగా మట్టిని తరలిస్తున్నారు. దీనిపై కొందరు ఫిర్యాదు చేస్తే అధికారులు కంటితుడుపు చర్యగా పలు టిప్పర్లు, జేసీబీలపై కేసులు నమోదు చేస్తున్నారు. కాగా, పర్యవరణాన్ని రక్షించే పనిలో ఇటు మైనింగ్, నీటి నిల్వలను కాపాడే విధి నిర్వహణలో ఉన్న ఇరిగేషన్ అధికారులు తనిఖీలు చేపట్టిన దాఖలాలు లేవనే విమర్శలున్నాయి. మామూళ్ల మత్తులో అధికారులు మునిగి తేలుతున్నారని, అందుకే ఇష్టారాజ్యంగా చెరువు మట్టిని ఇటుక వ్యాపారులు, దళారులు యథేచ్ఛగా దోచుకెళ్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.


హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది, భ్రమరాంబిక సేవా సమితి సభ్యులు

రాజన్న ఆదాయం రూ.1.53 కోట్లు

వేములవాడ: వేములవాడ రాజన్నకు 28 రోజుల్లో హుండీల ద్వారా రూ.1.53 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో రామకృష్ణ తెలిపారు. స్వామివారి ఓపెన్‌స్లాబ్‌లో గురువారం కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య ఆదాయం లెక్కించారు. రూ.1,53,48,267 నగదు, 157గ్రాముల బంగారం, వెండి 12.500 కిలోల వెండి సమకూరింది. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులతోపాటు భ్రమరాంబిక సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌డీ యంత్రం అదుపుతప్పి..

- సింగరేణి కార్మికుడి మృతి


ప్రతాప్ (ఫైల్)

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధి జీడీకే–11గనిలో గురువారం వేకువజామున జరిగిన ప్రమాదంలో ఇజ్జగిరి ప్రతాప్(57) అనే ఎల్‌హెచ్‌డీ ఆపరేటర్ మృతిచెందాడు. గనిలోని 1డీప్ 40వ లెవల్ నాల్గో సీమ్ నుంచి మూడో సీమ్‌కు దారి కోసం కనెక్టింగ్ పనులు నిర్వహిస్తున్నారు. ఆపరేటర్ లోపల ఉన్న మల్‌(బొగ్గు బురద)ను ఎల్‌హెచ్‌డీ యంత్రం బకెట్‌లో లోడ్ చేసుకుని పైకి తీసుకవస్తున్నాడు. కొద్ది దూరం వచ్చిన తర్వాత ఆప్రాంతంలో వెంటిలేషన్ కోసం ఉపయోగించే ఎయిర్‌డక్స్ యంత్రానికి తగిలాయి. దీంతో ఆపరేటర్ ప్రతాప్ వీటిని తాకకుండా చూడాలని కోరారు. అక్కడికి కార్మికులు చేరుకుని ఆ పనిలో నిమగ్నమయ్యారు. పనికి ఇబ్బందిగా ఉండకూడదని యంత్రాన్ని వెనక్కి పోనిచ్చాడు. అక్కడ యంత్రం ఆగకుండా సుమారు 12మీటర్ల వరకు వేగంగా కింది వైపునకు వేగంగా వెళ్లినట్లు చెబుతున్నారు. ఈక్రమంలో భారీ కుదుపులకు లోనై అందులోంచి బయటపడి మరణించాడా? లేదా దూకే ప్రయత్నంలో కిందపడి మృతిచెందాడా అనే విషయం తెలియాల్సి ఉంది. యంత్రం బ్రేకుల వ్యవస్థ ఫెయిల్ కావడం వల్లే ప్రమాదం జరిగిందని, కాలం చెల్లిన యంత్రాలు ఏర్పాటు చేసి కార్మికుల ప్రాణాలు తీస్తున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరి కొద్ది రోజుల్లో కారుణ్య నియామకం ద్వారా దిగిపోవాలని నిర్ణయించుకున్న క్రమంలో ఈప్రమాదం జరిగి ప్రతాప్ మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.


ప్రతాప్ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న సీఎండీ బలరాం

కుటుంబాన్ని ఓదార్చిన సీఎండీ

సింగరేణి సీఎండీ ఎన్.బలరాం గురువారం సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ప్రతాప్ మృతదేహానికి నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామని పేర్కొన్నారు. ఘటనకు గల కారణాలపై పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


రాజోజి రాజేశ్ (ఫైల్)

కోరుట్ల: కోరుట్లకు చెందిన రాజోజి రాజేశ్ (30) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాజోజి భూమయ్య చిన్న కుమారుడు రాజేశ్‌ను డీ–40 కెనాల్ సమీపంలో జగిత్యాల వైపు వెళ్తున్న బులేరో వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజేశ్‌ను స్థానికులు జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని ఆదిలాబాద్‌వాసి..

వెల్గటూర్: ట్రాక్టర్ ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేట స్టేజీ వద్ద బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ఈశ్వర్‌నగర్‌కు చెందిన బావునే దత్త(25) తన యజమాని కొడుకు కుమ్రా కోటేశ్‌ను రాత్రి 8 గంటల సమయంలో ఊటూర్‌లో బస్సు ఎక్కించాడు. కాసేపటికి యజమాని బింబి దత్తకు ఫోన్ చేసి తన కొడుకును ఇంటికి తీసుకురమ్మని చెప్పాడు. దీంతో తన బైక్‌పై బస్సును ఫాలో అవుతూ వస్తున్నాడు. కిషన్‌రావుపేట స్టేజీ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ దత్తు వాహనాన్ని ఢీకొట్టింది. ఘటనలో దత్తు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బావ శృతికార్ అశోక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యాన్‌ను ఢీకొట్టిన లారీ

- వ్యాన్ డ్రైవర్ మృతి


బాపురెడ్డి (ఫైల్)

వేములవాడఅర్బన్: వ్యాన్‌ను లారీ ఢీకొన్న ఘటనలో వ్యాన్ డ్రైవర్ మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం .. వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి శివారు సిరిసిల్ల – కరీంనగర్ ప్రధాన రహదారిలో నాంపల్లిగుట్ట మూలమలుపు వద్ద కరీంనగర్ నుంచి సిరిసిల్లకు వస్తున్న వ్యాన్‌ను, సిరిసిల్ల నుంచి కరీంనగర్ వెళ్తున్న లారీ ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొట్టింది. ఈప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ తాటిపెల్లి బాపురెడ్డి (63) తీవ్ర గాయాలతో క్యాబిన్‌లో ఇరుక్కుపోగా స్థానికులు బయటకు తీసి 108లో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరిన 10 నిమిషాలకు అతడు మృతిచెందాడు. బాపురెడ్డి సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లో నివాసం ఉంటుండగా, భార్య యశోద, కుమారుడు మనీశ్‌రెడ్డి ఉన్నారు. ఆసుపత్రిలో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ప్రమాద స్థలాన్ని వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ఆసుపత్రిలో రోదిస్తున్న కుటుంబసభ్యులు

వడదెబ్బతో వ్యక్తి మృతి

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో గురువారం వడదెబ్బతో మంతపురి ఎల్లయ్య(70)అనే వ్యక్తి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రెండు రోజులుగా ఎండ వేడిమికి తాళలేక పోయాడని గురువారం అస్వస్థతకు గురై మృతిచెందాదని వివరించారు.

హెచ్‌ఎంపై విచారణ

జగిత్యాల: కోరుట్ల బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గడ్డీల భూపతిపై అదే పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు మహిళా కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసినట్లు ఎంఈవో నరేశ్ తెలిపారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న తనను విధులకు హాజరుకావాలని హెచ్‌ఎం మానసికంగా వేధింపులకు గురిచేశారని మహిళా కమిషన్‌తోపాటు వరంగల్ ఆర్‌జేడీకి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. బుధవారం విచారణ చేపట్టగా.. ఫిర్యాదుదారు రాలేదన్నారు. దీనిపై ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ.. పాఠశాలకు సెలవులు ఉన్న సమయంలో విచారణ ఎలా చేస్తారని, విచారణాధికారి, హెచ్‌ఎం సన్నిహితులని తెలిపారు. మహిళా విచారణాధికారిని నియమించాలని ఆర్‌జేడీకి విన్నవించినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మెట్‌పల్లి: మల్లాపూర్ మండలం నుంచి అక్రమంగా మెట్‌పల్లి పట్టణానికి గురువారం ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను వేంపేట గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. అనంతరం వాటిని స్టేషన్‌కు తరలించి వాహనాల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జిల్లెల్లలో 'బలగం' దర్శకుడి సందడి


గ్రామస్తులతో దర్శకుడు వేణు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బంధాలు, బంధుత్వాల విలువ తెలిపేల సినిమా తీసి బాక్స్ ఆఫీస్‌ను షేక్‌చేసిన బలగం మూవీ డైరెక్టర్ వేణు గురువారం మండలంలోని జిల్లెల్లలో సందడి చేశారు. హనుమాన్ దీక్షలో ఉన్న ఆయన గ్రామంలోని గరిపెల్లి ఆంజనేయస్వామికి అభిషేకం చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బలగం సినిమా క్లాప్ ఈ ఆలయంలోనే కొట్టినట్లు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ఉడుతల తిరుపతి, బొడ్డు శ్రీధర్, రాజుగౌడ్, పృథ్వీ, పరశురామ్ పాల్గొన్నారు.

కోరుట్ల ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ రిమూవ్

జగిత్యాల: కోరుట్ల ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ పూల్‌సింగ్‌పై రెండేళ్ల క్రితం వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయనను రిమూవల్ చేస్తూ ఆర్‌ఎం సుచరిత మూడురోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఈ విషయమై కోరుట్ల డీఎం విజయమాధురిని సంప్రదించగా.. అసిస్టెంట్ మేనేజర్‌ను రిమూవ్ చేసిన విషయం వాస్తవమేనన్నారు.

రాజన్న సేవలో భద్రాచలం ఈవో


కోడె మొక్కు చెల్లించుకుంటున్న భద్రాచలం ఈవో రమాదేవి

వేములవాడ: వేములవాడ రాజన్నను గురువారం భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ ఈవో రమాదేవి దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు ఆమెకు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం రాజన్న ఆలయ ఈవో రామకృష్ణకు భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి ప్రసాదం అందజేశారు. ఆమె వెంట ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఆలయ పర్యవేక్షకులు అల్లె శంకర్, వరి నర్సయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ నంకెపెల్లి పవన్, ఈవో సీసీ ఎడ్ల శివసాయి ఉన్నారు.

పథకాల్లో పత్రికల ఏజెంట్లకు ప్రాధాన్యమివ్వండి


మాట్లాడుతున్న సత్యనారాయణ

పెద్దపల్లిరూరల్: ఇంటింటికీ దినపత్రికలను చేరవేస్తున్న పత్రికల ఏజెంట్లకు సంక్షేమ పథకాల అమలులో ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వనమాల సత్యనారాయణ అన్నారు. పెద్దపల్లిలో గురువారం రాష్ట్రస్థాయి సమావేశంలో గాయత్రీ విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాంప్రసాద్, జిల్లా అధ్యక్షుడు దిడ్డి రాజయ్య, రాష్ట్ర నాయకుడు కల్వల రాజేశంతో కలిసి ఆయన మాట్లాడారు. రాయితీపై ఎలక్ట్రిక్ స్కూటీలు అందించాలని కోరారు. ప్రమాద బీమాతో పాటు ఆరోగ్యబీమా సౌకర్యం, నిరుపేదలైన పత్రికల ఏజెంట్లకు డబుల్‌బెడ్ రూం ఇళ్ల కేటాయించాలని కోరారు. మర్క రాజు, ముస్తఫా, సాబీర్ పాల్గొన్నారు.

పొగాకుతో ఆరోగ్య సమస్యలు



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్‌టౌన్: పొగాకు వాడకం వల్ల ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు వాటిల్లే ప్రమాదం ఉందని కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో శానిటేషన్ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఏ అలవాటైనా వాటిని ఉపయోగించే వారికి మాత్రమే నష్టం చేస్తుందని, ఒక్క పొగత్రాగడం మాత్రం పక్కవారికి కూడా హాని చేస్తుందని తెలిపారు. యువతలో స్మోకింగ్ అనేది స్టైల్‌గా మారిందని, ఇంట్లో ఎవరు పొగతాగినా కట్టడి చేయాలని పిలుపునిచ్చారు. సైకియాట్రిస్టు డాక్టర్ వర్షి మాట్లాడుతూ పొగాకు అతిగా వాడకం వల్ల మతిస్థిమితం కూడా కోల్పో యే ప్రమాదం ఉందన్నారు. పొగాకు మాన్పించడం కోసం మెడికవర్‌లో వైద్యం అందుబాటులో ఉందన్నారు. న్యూరో సర్జన్ డాక్టర్ వెంకటేశ్ మాట్లాడుతూ... పొగాకు వాడకంతో హార్ట్ ఎటాక్‌తో పాటు బ్రెయిన్‌స్ట్రోక్ వస్తుందన్నారు. దీంతో కాళ్లు, చేతులు పడిపోవడం, మతిమరుపు రావడం జరుగుతుందన్నారు. ఫిజీ షియన్ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ... యువత పొగతాగడానికి బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మెడికవర్ సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ రాజమనోహర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిమల్లారెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

8న మహాధర్నా, 15న సెక్రటేరియట్ ముట్టడి

- బీసీలకు 42శాతం రిజర్వేషన్ పెంచాకే ఎన్నికలు నిర్వహించాలి
- కులగణనకు బిహార్ రాష్ట్రాన్ని మోడల్‌గా తీసుకోవాలి
- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఓయూ జేఏసీ నేత రాజారాం యాదవ్


మాట్లాడుతున్న రాజారాంయాదవ్

కరీంనగర్: బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే అడ్డుకుంటామని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్ని కల సందర్భంగా కామారెడ్డి విజయభేరి సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉండాలని అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయిస్తే దాదాపు 23వేల పైచిలుకు ప్రజాప్రతినిధులు అయ్యే అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. లోక్‌సభ ఫలితాల తర్వాత స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా కులగణన బిల్లుకు చ ట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కులగణన నిర్వహించి, దేశానికి ఆదర్శంగా నిలిచిన బిహార్ రాష్ట్రాన్ని మోడల్‌గా తీసుకోవాలని సూచించారు. జూన్ 8న బీసీ జనసభ తలపెట్టిన మహా ధర్నా, 15న సెక్రటేరియట్ ముట్టడికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని హరిప్రసాద్ ప్రకటించారు. జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు సత్యం యాదవ్, గౌడ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నం అనిల్‌గౌడ్, రాష్ట్ర గౌడసంఘం మహిళా కన్వీనర్ పూదరి రాజేశ్వరిగౌడ్, పద్మశాలీ నాయకుడు కట్ట ఆ నందం, మున్నూరుకాపు నాయకులు వరాల శ్రీని వాస్, రజక సంఘం నాయకులు జక్కనపెల్లి శంకర్ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ

- రెండుగా విడిపోయిన వైనం


చొప్పదండి: డివైడర్‌ను ఢీకొని క్యాబిన్ విడిపోయిన లారీ

చొప్పదండి: అసంపూర్తి రోడ్డు పనులతో ఓ లారీ డివైడర్‌ను ఢీకొని రెండుగా విడిపోయిన ఘటన పట్టణంలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ తలకు గాయాలు కాగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. వివరాలు...పట్టణంలోని వివేకానంద చౌరస్తా నుంచి ధర్మారం వైపు వెళ్లే దారిలో డివైడర్ చివరి పాయింట్ వద్ద కాంట్రాక్టర్, మున్సిపల్ అధికారులు, పోలీసులు సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఛత్తీస్‌గఢ్ నుంచి కరీంనగర్ వైపు ఇనుప తీగల లోడుతో వస్తున్న లారీ అదుపు తప్పి వరలక్ష్మి ఫంక్షన్ హాలు సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో లారీ క్యాబిన్, ట్రాలీ రెండుగా విడిపోయాయి. రోడ్డుపై ఇనుప తీగలు పడటంతో ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసు సిబ్బంది చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మున్సిపాలిటీ నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు

అసంపూర్తిగా రోడ్డు పనులపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతోనే తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ సింగిరెడ్డి కృష్ణారెడ్డి విమర్శించారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. డివైడర్ ప్రారంభం, చివరలో సూచికలు ఏర్పాటు చే యక పోవడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న మట్టిని తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న మన్సి పల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చే శారు. విధుల పట్ల బాధ్యతా రహితంగా వ్యవహరి స్తున్న వారిపై విచారణ జరపాలన్నారు. ఇంకా ఎన్ని ప్రమాదాలు జరిగితే స్పందిస్తార, రోడ్డు ప్రమాదా లు జరుగుతున్నా అలసత్వం ఎందుకని ప్రశ్నించారు.

కత్తితో బెదిరించి సొమ్ము ఎత్తుకెళ్లిన ముగ్గురి అరెస్టు


స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు, బ్లాంక్ చెక్కు

గోదావరిఖని: కత్తితో బెదిరించి సొమ్ము ఎత్తుకెళ్లిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి వెల్లడించారు. ఈమేరకు గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. గోదావరిఖనికి చెందిన ఓ వ్యక్తికి నాలుగేళ్ల క్రితం శ్రీరాంపూర్‌లో పనిచేస్తున్న క్రమంలో రాయల భవానీరెడ్డితో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి తరచూ ఆ వ్యక్తి వద్దకు వెళ్తూ ఉండేది. ఆర్థిక ఇబ్బంది దృష్ట్యా అప్పుడప్పుడూ మానవతావాదంతో స్పందించి సాయం కూడా అందించే వారు. ఈ క్రమంలో ఇంట్లో డబ్బులు, బంగారు నగలు గమనించి ఎలాగైనా దోపిడీ చేయాలని పథకం పన్నిన భవానీ, ఆమె తల్లి, తండ్రి కలిసి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ముందుగా అనుకున్న పథకం ప్రకారం అమ్మాయితో చెడుగా ప్రవర్తిస్తున్నావా? అంటూ ఆ వ్యక్తి గొంతుపై కత్తి పెట్టి బెదిరించి నాలుగు సెల్ ఫోన్లు, 9 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.90 లక్షలు ఫోన్‌పే పంపించుకోవడమే కాకుండా రూ.20లక్షల చెక్కు రాయించుకుని పారిపోయారు. బంగారం, సెల్‌ఫోన్‌లు విక్రయించే క్రమంలో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నేరస్తులను అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి సొమ్మును రికవరీ చేసి జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు. నేరస్తులు మంచిర్యాలకు చెందిన రాయల భవానీరెడ్డి అలియాస్ భవాని, ఆమె తండ్రి ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలంకు చెందిన వెంకటేశ్వర్లు, అతని భార్య శ్రీలత(40)లను అరెస్ట్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. నిందితులు వెంకటేశ్వర్లు, శ్రీలతపై ఖమ్మం జిల్లా హవేలీలో బొమ్మ తుపాకీ పెట్టి బెదిరించి డబ్బులు వసూలు చేసిన కేసు, భూవివాదాల్లో తలదూర్చిన కేసులు ఉన్నట్లు తెలిపారు. ఈకేసును సవాల్‌గా తీసుకుని నిందితులను త్వరగా పట్టుకున్న వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, రెండో సీఐ రవీందర్, ఎస్‌ఐ సుగుణాకర్, సాంకేతిక బృందాన్ని డీసీపీ అభినందించారు.

క్లుప్తంగా

మడేలేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న శ్రీనివాస్

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ పంచాయతీ పరిధి మధురానగర్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో శ్రీ మడేలేశ్వరస్వామి ఆలయం నిర్మించనున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, కాంగ్రెస్ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ గురువారం భూమిపూజ చేసి, పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు నందకుమార్, రజక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్ల పరిశీలన

కరీంనగర్‌కార్పొరేషన్‌: నగరంలో ముఖ్యమంత్రి హామీ పథకం కింద నిర్మించిన రోడ్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి గురువారం పరిశీలించారు. భగత్‌నగర్ శివాలయం, హరిహరనగర్‌లో సీఎంఏ కింద నిర్మించిన రోడ్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్, ఎస్ఈ మహేందర్, డీఈలు ఓంప్రకాశ్, లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

బీసీ కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

కరీంనగర్ కల్చరల్‌: బీసీ కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గొర్ల ఐలేశ్‌యాదవ్ కోరారు. ఈ మేరకు గురువారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉండాలని, త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డిని కలిసి, వినతిపత్రం ఇస్తామని తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారోజు రత్నయ్యచారి, నాయకులు హరికృష్ణ, పద్మ, పర్శరాం, మర్రి శ్రీనివాస్‌యాదవ్, రాధారపు తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శాతవాహన వర్సిటీలో పారదర్శకంగా పరిపాలన

కరీంనగర్‌సిటీ: శాతవాహన యూనివర్సిటీపై కొందరు చేస్తున్న ఆరోపణలు అవాస్తవాలని ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, వర్సిటీ మాజీ వీసీ మల్లేశం పలు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. శాతవాహన యూనివర్సిటీపై కొంతమంది బురద జల్లుతున్నారని తెలిపారు. వర్సిటీలో ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా పారదర్శకంగా పరిపాలన కొనసాగుతోందన్నారు.

బడిబాట షెడ్యూల్ మార్చాలి

కరీంనగర్‌: ఎండలు మండుతున్నాయని, వేసవి సెలవులు ముగియకముందే ప్రభుత్వం జూన్ 3 నుంచి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలనుకోవడం సరికాదని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ.ఖాద్రీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే బడిబాట షెడ్యూల్ మార్చాలని కోరారు. జూన్ 12 నుంచి ఈ కార్యక్రమం చేపడితే ఉపాధ్యాయులందరూ విజయవంతం చేస్తారని, సర్కారు పునరాలోచించాలన్నారు. ఈసారి భానుడి ప్రతాపానికి జనం ఇళ్ల నుంచి బయటకు వెళ్లడం లేదని, ఈ విషయం వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా తెలుస్తున్నందున టీచర్లు మానసిక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా ఉపాధ్యాయులు వెనకడుగు వేసే ప్రసక్తే ఉండదని, అయితే ఎండల వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశాలున్నందున జూన్ 12 నుంచి బడిబాట నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

చిరంజీవి అభిమాని కుటుంబానికి ఆర్థికసాయం



చెక్కు అందిస్తున్న వెంకటేశ్

కరీంనగర్‌టౌన్‌: మెగాస్టార్ చిరంజీవి అభిమాని కుటుంబానికి బీఎస్ఎస్ఎఫ్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ రూ.20 వేల ఆర్థికసాయం పంపించగా సంబంధిత చెక్కును చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల వెంకటేశ్ గురువారం కరీంనగర్‌లో అందజేశారు. ఉమ్మడి జిల్లాలోని కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన కిరణ్‌కుమార్ చిరంజీవికి అభిమాని. గతేడాది అనారోగ్యంతో మృతిచెందాడు. అతనికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో వారు పదోతరగతి పూర్తి చేసేవరకు అయ్యే ఖర్చులను చిరంజీవి స్ఫూర్తితో అందించేందుకు శ్రీనివాస్ ముందుకువచ్చారు. గతేడాది ఆర్థికసాయం చేశారు. ఈ సంవత్సరం కూడా పంపించారు. ఈ సందర్భంగా శ్రీని వా స్‌కు కిరణ్‌కుమార్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. చిరంజీవి యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపెల్లి రమేశ్, గట్టు నారాయణగౌడ్, బండవరపు సుమన్, కోట సిరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు విజయవంతం



నగునూరులో ధాన్యం బస్తాల లోడింగ్ (ఫైల్)

- కరీంనగర్ రూరల్ మండలంలో 2.16 లక్షల క్వింటాళ్లు సేకరణ
- కొనుగోలు కేంద్రాల మూసివేత

కరీంనగర్‌రూరల్‌: యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. అకాల వర్షాలతో కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయి, ఇబ్బందులు ఎదురైనప్పటికీ చివరి గింజ వరకు కొనుగోలు చేశారు. కరీంనగర్ మండలంలో 13,122 ఎకరాల్లో వరి సాగు చేయగా మొత్తం 28 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే, నాటేసిన ఆరంభంలోనే తెగుళ్ల దాడితోపాటు చివరి వరకు సాగునీరందక పలు గ్రామాల్లోని వరి పంట ఎండిపోయి అనుకున్నంత దిగుబడి రాలేదు.

ఏప్రిల్ 1న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజాప్రతినిధుల ప్రాతినిధ్యం లేకుండా అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ 1న ప్రారంభించారు. అయితే, నిర్వాహకులు ధాన్యం కొనుగోళ్లను మాత్రం 10వ తేదీ నుంచి చేపట్టారు. కరీంనగర్, దుర్శేడ్, ఐకేపీ ఆధ్వర్యంలో మొత్తం 20 కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు 45 రోజుల్లో కొనుగోలు పూర్తి చేశారు. రైతుల బ్యాంకు ఖాతాల్లో వారం, పది రోజుల వ్యవధిలోనే డబ్బులు జమయ్యాయి. అన్నదాతలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోళ్లను విజయవంతంగా పూర్తి చేసినట్లు కరీంనగర్ సహకార సంఘం సీఈవో రమేశ్, దుర్శేడ్ సంఘం సీఈవో వేణుమాధవ్, ఐకేపీ ఏపీఎం భార్గవ తెలిపారు. మొత్తం 2,16,934 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. కొనుగోళ్లు ముగియడంతో ఇటీవల కేంద్రాలను మూసివేశామన్నారు.

కరీంనగర్ మండలంలో ధాన్యం సేకరణ వివరాలు

కరీంనగర్ సహకార సంఘం

కేంద్రం	క్వింటాళ్లు
ఏఎంసీ, కరీంనగర్	13,555
బొమ్మకల్	13,926
చెర్లభూత్కూర్	14,560
తాహెర్‌కొండాపూర్	4,560
దుబ్బపల్లి	4,860
జూబ్లీనగర్	12,640
నగునూరు	32,540
తీగలగుట్టపల్లి	3,933
కమాన్‌పూర్	9,892
ఎలగందల్	17,590
నాగులమల్యాల	12,829

దుర్శేడ్ సహకార సంఘం

కేంద్రం	క్వింటాళ్లు
దుర్శేడ్	7,303
గోపాల్‌పూర్	7,735
మొగ్దుంపూర్	12,542
ఇరుకుల్ల	8,038
చేగుర్తి	8,546
నల్లగుంటపల్లి	2,578

ఐకేపీ ఆధ్వర్యంలో..

కేంద్రం	క్వింటాళ్లు
బహదూర్‌ఖాన్‌పేట	6,178
చామనపల్లి	12,856
ఎలబోతారం	10,270

మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్, నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్‌: రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు గురువారం ఘనంగా నిర్వహించాయి. నగరవ్యాప్తంగా కేక్ కటింగ్‌లు, అల్పాహారం, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఇందిరాచౌక్ వద్ద కాంగ్రెస్ నగరశాఖ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. భారీ కేక్‌ను మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఆకారపు భాస్కర్‌రెడ్డి తదితరులు కట్ చేశారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో రోగుల సహాయకులకు అల్పాహారం అందించారు. కార్ఖానాగడ్డలోని ప్రభుత్వ వృద్ధాశ్రమంలో బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. కరీముల్లా షా దర్గాలో చాదర్ సమర్పించి, ప్రార్థనలు నిర్వహించారు. టవర్ సర్కిల్ వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. శాతవాహన యూనివర్సిటీ, నాఖాచౌరస్తా వద్ద కేక్ కట్ చేశారు. వాసవి వృద్ధాశ్రమంలో అన్నదానం చేపట్టారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మంత్రి శ్రీధర్‌బాబు మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని, ప్రజా సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్, నాయకులు ఎండీ.తాజ్, కీర్తి కుమార్,



వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కొట్టె ప్రభాకర్, అబ్దుల్ రెహమాన్, మహమ్మద్ అమీర్, ఖాద్రీ, మతీన్, ఖమ్రొద్దీన్, బషీర్, సురేందర్, శ్రవణ్‌నాయక్, ఎండీ.చాంద్, సమద్‌నవాబ్, శ్రీనివాస్, రమేశ్, చంద్రయ్య, కవిత, జ్యోతి, తిరుమల, హసీనా తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్ మండలంలోని ఇరుకుల్ల పద్మనాయక వృద్ధాశ్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ జువ్వాడి మారుతీరావు ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. అనంతరం వృద్ధులకు పండ్లు, బ్రెడ్, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు కాశిపాక రాకేశ్, నాయకులు కాశిపాక రమేశ్, లింగంపల్లి ప్రవీణ్, రమేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ చరిత్రను చెరిపేస్తే ఊరుకోం

- రాష్ట్ర గీతాన్ని తెలంగాణ గాయకులతోనే పాడించాలి
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్‌: తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, తెలంగాణ చరిత్రను చెరిపేస్తే ఊరుకునేది లేదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర చిహ్నానికి తుదిరూపు ఇచ్చే ప్రక్రియలో కాకతీయ తోరణం, చార్మినార్ లేకుండానే డిజైన్లు రూపొందించి, చరిత్రను వక్రీకరించొద్దని పేర్కొన్నారు. రాష్ట్ర గీతాన్ని తెలంగాణలోని గాయకులతోనే పాడించాలని డిమాండ్ చేశారు. కీరవాణి సంగీత దర్శకత్వంలో ఇతరులు పాడటం తెలంగాణ కవులను, కళాకారులను అవమానించినట్లేనని తెలిపారు. మన రాష్ట్రంలో ఎంతో మంది కవులు ఉన్నారని, వందేమాతరం శ్రీనివాస్‌కు 9 అవార్డులు వచ్చాయని, చంద్రబోస్ లాంటి సంగీత దర్శకులు ఉన్నారన్నారు. వీరందరినీ కాదని సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం, కీరవాణికి బాధ్యతలు అప్పగించడం బాధాకరమని పేర్కొన్నారు. ఏనాడూ జై తెలంగాణ అనని సీఎం తెలంగాణలో మెజార్టీ ప్రజల మనోభావాలను దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగించిన కాకతీయులకు గుర్తింపు కళాతోరణమని, అధికారిక చిహ్నం నుంచి దాన్ని తీసివేయాలనే నిర్ణయం చారిత్రక తప్పిదమన్నారు. చార్మినార్‌నూ తొలగించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలోని అరుదైన వారసత్వ కట్టడాల్లో ప్రత్యేక స్థానం సాధించుకున్న చార్మినార్‌కు ఎంతో ఘనచరిత్ర ఉందని గుర్తు చేశారు. నాలుగు శతాబ్దాలుగా మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన చారిత్రక కట్టడాన్ని రాచరికపు ఆనవాళ్లుగా ప్రభుత్వం చూపించడం గర్హనీయమని పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అనిల్‌కుమార్, నాయకులు అనిల్, ప్రభాకర్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

విత్తనాల కొరత పేరిట రాజకీయాలా?

కరీంనగర్‌రూరల్‌: జీలుగ విత్తనాల కొరత పేరిట ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ కరీంనగర్ రూరల్ మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి అన్నారు. గురువారం దుర్శేడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు జీలుగ, పత్తి విత్తనాల కొరత ఉందంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. మండలానికి గతేడాది 342 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు రాగా ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి 342 క్వింటాళ్లకు ఇండెంట్ పంపిస్తే 120 క్వింటాళ్లు వచ్చాయన్నారు. మరో 150 క్వింటాళ్లు రెండు రోజుల్లో వస్తాయని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని కోరారు. విత్తన దుకాణాల్లో పత్తి విత్తనాలను అధికారులు అందుబాటులో ఉంచారని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాల నాయకులు అనవసర ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, మండల ఉపాధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్, కార్యదర్శి సాయిని శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మీసాల సాయిలు, నాయకులు శ్రీధర్‌రెడ్డి, బుర్ర హరీశ్, తిరుపతి, రాకేశ్, రాజిరెడ్డి, అంజయ్య, ప్రశాంత్‌రెడ్డి, మారుతీరావు, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అంగన్వాడీ కేంద్రాల్లో సౌకర్యాలపై సర్వే

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్ మండలంలోని దుర్శేడ్ సెక్టార్ పరిధి అంగన్వాడీ కేంద్రాలను గురువారం సీడీపీవో పి.లక్ష్మీనారాయణ తనిఖీ చేశారు. కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు పరిధి అంగన్వాడీ కేంద్రాల్లోని సౌకర్యాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీడీపీవో సర్వే నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితరాలను పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా అంగన్వాడీ సెంటర్లలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ సర్వే నిర్వహించినట్లు సీడీపీవో తెలిపారు. కల్పించాల్సిన సౌకర్యాలపై శుక్రవారం ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు పేర్కొన్నారు.



బొమ్మకల్‌లో సర్వే చేస్తున్న సీడీపీవో లక్ష్మీనారాయణ

డీఈపై విచారణ జరిపించండి

- ప్రిన్సిపల్ సెక్రెటరీకి కార్పొరేటర్ ఫిర్యాదు

కరీంనగర్ కార్పొరేషన్‌: నగరపాలక సంస్థలో గతంలో డీఈగా పనిచేస్తూ అక్రమాలకు పాల్పడిన మసూద్‌పై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్‌కు చెందిన 41వ డివిజన్ కార్పొరేటర్ బండారి వేణు గురువారం మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కయిన సదరు డీఈ అంచనాలు భారీగా పెంచారని ఆరోపించారు. కిసాన్‌నగర్‌లోని ఏఎంసీలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్, యజ్ఞవరాహస్వామి దేవాలయం నుంచి రాజీవ్ రహదారి వరకు స్మార్ట్ సిటీ నిధులతో గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించిన రోడ్డు తదితరాల్లో అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

కార్మికులకు అండ.. సీఐటీయూ జెండా

- సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుడికందుల సత్యం

కరీంనగర్‌: కార్మికులకు, కష్టజీవులకు అండ.. సీఐటీయూ జెండా అని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుడికందుల సత్యం అన్నారు. గురువారం సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్‌లోని టవర్ సర్కిల్ లేబర్ అడ్డా వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్మిక హక్కులను కాలరాస్తూ, కొత్తగా నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. ఆ పార్టీ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం కుదించి, రోజుకు రూ.137తో బతకవచ్చని బీజేపీ మంత్రులు అనడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఇతర నిత్యావసరాల ధరలతో కష్టజీవులు బతుకు వెళ్లదీయలేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలను నియంత్రించాల్సిన కేంద్రం కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇస్తూ కార్మికులను విస్మరిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా వారికి కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దయ్యేవరకు సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎనుమల మల్లారెడ్డి, కోశాధికారి వట్టి జగదీశ్, నాయకులు పాతూరి లింగారెడ్డి, శ్రీనివాస్, రాజు, శ్రీకాంత్‌కుమార్, లింగయ్య, ఐలయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరించిన సీఐటీయూ నాయకులు

ముకుందలాల్ మిశ్రాభవన్‌లో వేడుకలు..

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం జిల్లా కేంద్రంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ జెండా ఆవిష్కరించారు. కార్మికవర్గ హక్కులకై రాజీలేని పోరాటాలు నిర్వహించడానికి 1970లో సీఐటీయూ ఆవిర్భవించిందని తెలిపారు. పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను యజమానులకు అనుకూలంగా సవరణ చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను మోదీ సర్కార్ తీసుకొచ్చిందన్నారు. వాటికి వ్యతిరేకంగా సీఐటీయూ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు గత ప్రభుత్వాలకు భిన్నంగా ఏమీ లేవని ఆరోపించారు. 15 ఏళ్లగా సవరణకు నోచుకోని 73 షెడ్యూల్ పరిశ్రమల వేతనాల సవరణకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. కానీ, వేతనం ఏమాత్రం పెంచకుండా బేసిక్, డీఏ కలిపి ఎంతవుతుందో అంతే ఇచ్చి, కార్మిక వర్గానికి తీవ్రమైన అన్యాయం చేస్తోందని తెలిపారు. రాబోయే కాలంలోనూ కార్మికుల సమస్యలపై కులమతాలు, ప్రాంతాలకతీతంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యు.శ్రీనివాస్, గుడికందుల సత్యం, జనగాం రాజమల్లు, సహాయ కార్యదర్శులు పున్నమి రవి, మారెళ్ల శ్రీలత, కోశాధికారి జి.రాజేశం, నగర కన్వీనర్ పుల్లెల మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

‘పారమిత’లో టీచర్లకు శిక్షణ తరగతులు



విద్యావేత్తలను సన్మానిస్తున్న పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు, డైరెక్టర్లు

కొత్తపల్లి: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో విద్యావేత్తలచే ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా 2024–25 విద్యాసంవత్సరానికి గానూ ఐఐటీ ఢిల్లీ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ప్రొఫెసర్ హరీశ్‌చౌదరి, శిక్షకుడు, విద్యారంగ నిపుణుడు ప్రొఫెసర్ రాజారాంలు విద్యాబోధనలో సూచనలు చేసినట్లు విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు తెలిపారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం ఎలా పెంపొందించాలో వివరించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యావేత్తలను పారమిత యాజమాన్యం సన్మానించింది. విద్యాసంస్థల డైరెక్టర్లు, హెచ్‌ఎంలు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

సప్తగిరికాలనీ: రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్‌లో ఫెడరేషన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులకు నివేశన స్థలాలు ఇవ్వాలని, రైల్వే పాసులను పునరుద్ధరించాలని కోరారు. జర్నలిస్టులకు రక్షణ, గుర్తింపు లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో నూతన ప్రెస్‌క్లబ్‌ను జూన్ మొదటి వారంలో ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు చేపడుతామన్నారు. నల్లగొండ సత్తయ్య, సతీశ్, సాగర్, కనకయ్య, ఎస్.సతీశ్, రమేశ్, శంకర్, శేఖర్ తదితరులున్నారు.

కొండగట్టుకు బీజేపీ నాయకుల పాదయాత్ర

కరీంనగర్‌టౌన్‌: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ ఎంపీగా మళ్లీ భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ కరీంనగర్‌కు చెందిన ఆ పార్టీ నాయకులు తోట అనిల్, శ్రీరాముల శ్రీకాంత్ ఆధ్వర్యంలో 25 మంది కార్యకర్తలు గురువారం సాయంత్రం కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. నగరంలోని మారుతీనగర్ చౌరస్తా వద్ద వారు మాట్లాడారు. దేశానికి మోదీ, కరీంనగర్‌కు బండి సంజయ్ సేవలు ఎంతో అవసరమన్నారు. ఎంపీగా సంజయ్ రూ.12 వేల కోట్లు తీసుకువచ్చి, అభివృద్ధి పనులు చేపట్టారని పేర్కొన్నారు. తిరిగి రెండోసారి ఆయన గెలవాలని ఆకాంక్షించారు. పాదయాత్రగా కొండగట్టుకు చేరుకొని, అంజన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



పాదయాత్రగా వెళ్తున్న నాయకులు

పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై చర్చకు సిద్ధమా?

మానకొండూర్‌: బీఆర్ఎస్ పదేళ్లపాలలో చేసిన అభివృద్ధిపై పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు చర్చకు సిద్ధమా అంటూ డీసీసీ జిల్లా కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్ సవాల్ విసిరారు. మానకొండూర్‌లో గురువారం మాట్లాడారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు రాజకీయ బ్యాక్‌గ్రౌండ్ లేదనడంపై మండిపడ్డారు. మేనమామ లేకపోతే జీవీ రామకృష్ణారావు గుండు సున్నా అని, సుడా చైర్మన్‌గా మానకొండూర్‌కు నిధులు తీసుకురాలేని అసమర్థుడని విమర్శించారు. ధాన్యం కొనుగోలు చేసిన రెండు, మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో పెద్ద నాయకులు అరెస్టు అయితే రాజకీయ సన్యాసం తీసుకుంటారా అంటూ ప్రశ్నించారు. మూడు నెలల్లో ఐదు గ్యారంటీలు అమలు చేశామని, ఆగస్టు 15లోపు రుణమాఫీ చేయబోతున్నామని తెలిపారు. చీకటి బాగోతాలు, వసూళ్లకు పాల్పడిన చిట్టా మా దగ్గర ఉందని హెచ్చరించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, నాయకులున్నారు.

‘ప్రజాసమస్యలను గాలికొదిలేసిన కాంగ్రెస్’

జమ్మికుంట(హుజూరాబాద్‌): గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర అధికార ముద్రను ఏర్పాటు చేసి పదేళ్లవుతోందని, ఎవరూ అభ్యంతరం తెలపకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు గాలికొదిలి, కాలయాపన కోసం రాజముద్రలో మార్పులు చేయడం సిగ్గుమాలిన చర్య అని జమ్మికుంట జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్ మండిపడ్డారు. గురువారం జమ్మికుంట పట్టణంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మేలు చేస్తుందని భావించిన ప్రజలకు రేవంత్ రెడ్డి మొండిచేయి చూపిస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, మేనిఫెస్టోలోని అంశాలు కార్యరూపం దాల్చలేదని, టీఎస్‌ను టీజీగా మార్చినట్లు చెప్పుకునే పరిస్థితి ఉందన్నారు. ఎన్నికల కోడ్ అనంతరం ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని, రైతులకు వర్షాకాలంలో విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలన తుగ్లక్ పాలనను తలపిస్తోందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఖాతా తెరిస్తే రూ.లక్ష!

- బెంగళూరు జనరల్ పోస్టాఫీస్‌కు పోటెత్తుతున్న మహిళలు
- కాంగ్రెస్ 'మహాలక్ష్మి' హామీయే కారణం

అది బెంగళూరులోని జనరల్ పోస్టాఫీస్. సాధారణంగా ఓ మోస్తరు రద్దీయే ఉంటుంది. కానీ కొన్ని రోజులుగా జనం ఇసుకేస్తే రాలనంతగా వస్తున్నారు! ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతా తెరిచేందుకు చాంతాడంత క్యూలు కడుతున్నారు. ఆశ్చర్యపోయిన సిబ్బంది సంగతేమిటని ఆరా తీస్తే, కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకొస్తే మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి పేద మహిళకు ఏడాదికి రూ.లక్ష అందిస్తామన్న హామీ ప్రభావమని తెలిసి ఆశ్చర్యపోయారు. ప్రతి మహిళ ఖాతాలో నెలకు రూ.8,500 జమ చేస్తామని ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్ గాంధీ హామీ ఇవ్వడం తెలిసిందే. దాంతో కేంద్రంలో ఇండియా కూటమి వస్తే తమకు ప్రయోజనం దక్కుతుందని భావించిన స్థానికులు బెంగళూరు జనరల్ పోస్టాఫీస్ వద్ద బారులు తీరుతున్నారు. తాను పొద్దున ఎప్పుడో వచ్చానని క్యూలో నిల్చున్న ఓ మహిళ చెప్పడం గమనార్హం. ఖాతా తెరిచిన తొలి రోజు నుంచే డబ్బులు జమవుతాయని పొరుగింటావిడ చెప్పడంతో వచ్చానని మరో మహిళ వెల్లడించింది. శివాజీనగర్, చామరాజపేట చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఎక్కువ మంది ఇలా వస్తున్నారు!

నిజం కాదు...

తపాలా శాఖ ఒక్కో ఖాతాలో రూ.2,000 నుంచి రూ.8,500 వరకు జమ చేస్తుందన్న నమ్మకంతో ఎక్కువ మంది ఖాతా తెరిచేందుకు వస్తున్నట్టు బెంగళూరు జీపీవో చీఫ్ పోస్ట్‌మాస్టర్ హెచ్ఎం మంజేశ్ చెప్పారు. ''నిజానికి ఇదో వదంతి. తపాలా శాఖ ఎలాంటి చెల్లింపులు చేయడం లేదు. కాకపోతే ఆన్‌లైన్ నగదు బదిలీ ప్రయోజనానికి ఈ ఖాతా ఉపకరిస్తుంది'' అని వెల్లడించారు. పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతా తెరిచేందుకు రద్దీ విపరీతంగా పెరిగిపోవడంతో, అందులో వెంటనే డబ్బులు జమవడం మొదలవుతుందన్న వార్తలు వదంతులేనంటూ కార్యాలయం ఆవరణలో పోస్టర్లు కూడా అంటించారు. అయినా రద్దీ మాత్రం తగ్గడం లేదు. దీంతో చేసేది లేక అదనపు కౌంటర్లు తెరిచారు. గతంలో రోజుకు కనాకష్టంగా 50 నుంచి 60 కొత్త ఖాతాలే తెరిచేవారు. ఇప్పుడు రోజుకు కనీసం 1,000 ఖాతాలకు పైగా తెరుస్తున్నట్టు మంజేశ్ తెలిపారు. ఇండియా కూటమి అధికారంలోకొస్తే ప్రతి నెలా రూ.8,500 ఖాతాలో జమ చేస్తామని స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే చెప్పడమే ఈ రద్దీకి కారణమని అక్కడి సిబ్బంది అంటున్నారు!

– సాక్షి, నేషనల్ డెస్క్

ఏడో విడతలో టఫ్ ఫైట్

లోక్‌సభ ఎన్నికల పోరు చివరి అంకానికి చేరుతోంది. ఇప్పటిదాకా ఆరు విడతల్లో 486 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ పూర్తయింది. మిగతా 57 సీట్లకు ఆఖరిదైన ఏడో విడతలో శనివారం పోలింగ్ జరగనుంది. ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతం చండీగఢ్ పరిధిలో 904 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు తేల్చనున్నారు. పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్‌లో మొత్తం సీట్లకూ ఈ విడతలోనే పోలింగ్ జరుగుతోంది. బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లోని మిగిలిన సీట్లలో ఎన్నికల క్రతువు ముగియనుంది. చివరి విడత నియోజకవర్గాలను విశ్లేషిస్తే గత ఫలితాలకు సంబంధించి ఆసక్తికరమైన అంశాలు తెరపైకొచ్చాయి...

– సాక్షి, నేషనల్ డెస్క్


- 57 సీట్లకు జూన్ 1న పోలింగ్
- సగం బీజేపీ సిట్టింగ్ స్థానాలే

చివరి విడతలో పోలింగ్ జరగనున్న 57 స్థానాల్లో గత రెండు లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీయే చక్రం తిప్పింది. ఈ 57 స్థానాల్లో రెండుసార్లూ 25 సీట్ల చొప్పున కొల్లగొట్టింది. కాంగ్రెస్ 2014లో కేవలం 3, 2019లో 8 స్థానాలతో సరిపెట్టుకుంది. ఓట్లపరంగానూ బీజేపీదే పైచేయి. బీజేపీకి 28 సీట్లలో 40 శాతం ఓట్లు రాగా 12 సీట్లలో 30 నుంచి 40 శాతం దక్కాయి. కాంగ్రెస్‌కు 18 సీట్లలో 10 శాతం ఓట్లు కూడా రాలేదు. మొత్తమ్మీద ఈ 57 సీట్లలో 24 చోట్ల పలు పార్టీలు పటిష్టంగా ఉన్నాయి. తృణమూల్, బీజేపీలకు చెరో 8 సీట్లు కంచుకోటలు. మూడింట బిజూ జనతాదళ్, రెండేసి చోట్ల కాంగ్రెస్, అకాలీదళ్, ఒక చోట జేడీ(యూ) పటిష్టంగా ఉన్నాయి. ఈ స్థానాల్లో గత మూడు ఎన్నికల్లోనూ ఆ పార్టీలే గెలిచాయి. మరో 14 సీట్లలో ప్రత్యర్థులకు బీజేపీ గట్టి సవాలు విసురుతోంది. వాటిలో 2009 నుంచి కనీసం రెండుసార్లు బీజేపీ గెలిచింది. ఆ లెక్కన 22 చోట్ల బీజేపీదే జోరు. కాంగ్రెస్ బలంగా ఉన్న సీట్లు 6 మాత్రమే.

క్లీన్‌స్వీప్‌లన్నీ కమలానివే...

ఏడో విడత పోలింగ్ జరిగే స్థానాల్లో గత ఎన్నికల్లో ఐదు చోట్ల క్లీన్‌స్వీప్‌లు నమోదయ్యాయి. అంటే గెలిచిన, ఓడిన పార్టీ మధ్య ఓట్ల తేడా 35 శాతం పైగా నమోదైంది. వీటిలో హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి, హమీర్‌పూర్, సిమ్లా, కాంగ్రా, ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి ఉన్నాయి. ఇవన్నీ బీజేపీ ఖాతాలోనే పడటం విశేషం. ప్రధాని మోదీ గత ఎన్నికల్లో వారణాసిలో 45.2 శాతం ఓట్ల మెజారిటీ సాధించారు!

ఏడో విడత స్థానాల్లో కాంగ్రెస్, బీజేపీ పరిస్థితి



ఆ స్థానాల్లో హోరాహోరీ...

ఏడో విడత స్థానాల్లో గత ఎన్నికల్లో పలు స్థానాల్లో నువ్వానేనా అనేలా టఫ్ ఫైట్ జరిగింది. అవి జలంధర్ (పంజాబ్), బలియా, చందౌలీ (యూపీ), బాలాసోర్ (ఒడిశా), జహానాబాద్ (బిహార్). ఈ స్థానాల్లో గెలుపు మార్జిన్ 2 శాతం లోపే! వీటితో పాటు ఏ పార్టీకీ స్పష్టమైన మొగ్గు లేని స్వింగ్ సీట్లు 11 ఉన్నాయి. గడచిన మూడు ఎన్నికల్లో వీటిలో ఏ పార్టీ కూడా రెండోసారి గెలవకపోవడం విశేషం. గాజీపూర్, ఘోసి, రాబర్ట్స్‌గంజ్, మీర్జాపూర్ (యూపీ), ఆనంద్‌పూర్ సాహిబ్, ఫరీద్‌కోట్, ఫతేగఢ్ సాహిబ్, పటియాలా (పంజాబ్), బాలాసోర్ (ఒడిశా), జహానాబాద్, కరాకట్ (బిహార్) ఈ స్వింగ్ సీట్ల జాబితాలో ఉన్నాయి.

గోరఖ్‌పూర్‌లో స్టార్ వార్!



ఉత్తరప్రదేశ్‌లో శనివారం పోలింగ్ జరగనున్న స్థానాల్లో గోరఖ్‌పూర్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ రవికిషన్ శుక్లా, ఇండియా కూటమి తరఫున బరిలో ఉన్న ఎస్పీ అభ్యర్థి కాజల్ నిషాద్ ఇద్దరూ భోజ్‌పురి స్టార్లే కావడం అందుకు కారణం...

రవికిషన్‌కు పీఠం మద్దతు...

భోజ్‌పురి సినిమాల్లో సూపర్ స్టార్‌గా వెలుగొందుతున్న రవి కిషన్ అసలు పేరు రవీంద్ర శుక్లా. కాంగ్రెస్ సభ్యునిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో జౌన్‌పూర్ నుంచి పోటీ చేసి ఓడారు. 2017లో బీజేపీలో చేరారు. 2019లో 3 లక్షల పైచిలుకు మెజారిటీతో గెలిచారు. కానీ ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో కనిపించనే లేదనే విమర్శలున్నాయి. ప్రతిపక్షాలు ఆయనను 'బయటి వ్యక్తి'గా అభివర్ణిస్తున్నాయి. దాంతో పీఎం మోదీ, సీఎం యోగి చరిష్మానే నమ్ముకున్నారు. గోరఖ్‌పూర్‌లో తనకు ఇల్లుందని, ఇక్కడే ఉంటున్నానని చెప్పుకొస్తున్నారు. యువకులతో కుస్తీ పడుతూ, స్థానికులతో సెల్ఫీలు దిగుతూ ప్రచారం జోరుగా చేశారు. రవి కిషన్‌కు గోరక్షనాథ్ పీఠం మద్దతు కూడా ఉంది.

నిషాద్ ఓట్లను నమ్ముకున్న కాజల్

భోజ్‌పురి నటి, ఎస్పీ అభ్యర్థి కాజల్ నిషాద్‌కు ఇది నాలుగో ఎన్నిక. రెండుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో గోరఖ్‌పూర్ రూరల్ నుంచి కాంగ్రెస్ టికెట్‌పై, కాంపియర్‌గంజ్ నుంచి ఎస్పీ తరఫున పోటీ చేసి ఓడారు. మేయర్ ఎన్నికల్లోనూ ఓటమి చవిచూశారు. రాజకీయాల్లో చురుకుగా ఉండే ఆమెకు ఈసారి గెలుపు ప్రతిష్టాత్మకంగా మారింది. తన సామాజికవర్గమైన నిషాద్ ఓట్లనే నమ్ముకున్నారు. అయితే 2019 మాదిరిగా ఈసారి కూడా ఎస్పీ ఓట్లను బీఎస్పీ గట్టిగానే చీల్చేలా కన్పిస్తోంది.

కీలకం

కుల సమీకరణాలదే కీలకపాత్ర..

గోరఖ్‌పూర్‌లో అగ్రవర్ణ ఓట్లు 6 లక్షలున్నాయి. 9 లక్షల ఓబీసీ, 4 లక్షల నిషాద్, 2 లక్షలకు పైగా యాదవ ఓట్లున్నాయి. 2.5 లక్షల దళిత ఓట్లు, 2 లక్షల ముస్లిం ఓట్లూ తనకేనని కాజల్ చెబుతున్నారు. నిషాద్‌లూ తన వెంటే ఉన్నారంటున్నారు. బీజేపీ కూడా నిషాద్‌ల ఓట్ల కోసం ముమ్మర ప్రయత్నాలు చేసింది.

1990ల నుంచి బీజేపీ హవా..

గోరఖ్‌పూర్ స్థానంలో 1984 దాకా కాంగ్రెస్‌దే హవా. రామమందిర ఉద్యమ నేపథ్యంలో 1989 నుంచీ గోరక్షనాథ్ పీఠం ఆధిపత్యం మొదలైంది. అప్పటినుంచి 1996 దాకా వరుసగా మూడుసార్లు గోరక్షనాథ్ పీఠాధిపతి మహంత్ అవైద్యనాథ్ ఇక్కడినుంచి గెలిచారు. 1998 నుంచి 2014 దాకా ఐదుసార్లు ప్రస్తుత పీఠాధిపతి యోగి గెలిచారు. సీఎం అయ్యాక ఆయన రాజీనామాతో 2018లో జరిగిన ఉప ఎన్నికలో విపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా ఎస్పీ నేత ప్రవీణ్ నిషాద్ బీజేపీ అభ్యర్థి ఉపేంద్ర శుక్లాను ఓడించారు. కానీ ఈ ఆధిపత్యాన్ని ఎస్పీ నిలబెట్టుకోలేకపోయింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

కటాకట్ ఫటాఫట్

ప్రచారంలో నేతల ఛలోక్తులు

నేతల నినాదాలు ఓట్ల వర్షం కురిపించిన సందర్భాలు దేశ ఎన్నికల చరిత్రలో ఎన్నో! గరీబీ హటావో అంటూ దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ఇచ్చిన నినాదం అప్పట్లో దుమ్ము రేపింది. ఈసారి మాత్రం నినాదాల కంటే కూడా ముఖ్య నేతల నోటి నుంచి వెలువడ్డ వింత పదబంధాలు అందరినీ ఆకర్షించాయి. వాటి అర్థం ఏమై ఉంటుందా అని ఓటర్లలో ఆసక్తి రేపాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సోదరి ప్రియాంక తమ ప్రసంగాల్లో 'కటాకట్' అని విరివిగా వాడారు. అదే పదాన్ని ప్రధాని మోదీ తిరిగి కాంగ్రెస్‌పైకి సంధించారు. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కూడా వెరైటీ హిందీ పదాలను ప్రయోగించారు.

రాహుల్ ఆద్యుడు

కటాకట్ అనే హిందీ పదాన్ని తొలుత ప్రయోగించింది రాహులే. మిగతా వారు దాన్ని అందిపుచ్చుకున్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ప్రతి పేద మహిళకు ఏటా రూ.లక్ష ఇస్తామని, ధనవంతుల సంపదను పేదలకు పంచుతామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొనడం తెలిసిందే. రాహుల్ తన ప్రచారంలో ఈ హామీలను తరచూ ప్రస్తావించారు. పేదల బ్యాంకు ఖాతాలకు డబ్బులు 'కటాకట్ కటాకట్' బదిలీ చేస్తామని ప్రకటించారు. చకచకా అనే అర్థంలో కటాకట్ పదాన్ని ప్రయోగించారు. దీనిపై ప్రజల్లో బాగా స్పందన రావడంతో ప్రియాంక కూడా అందిపుచ్చుకున్నారు. దాంతో కటాకట్ అంటే ఏమై ఉంటుందా అని గూగుల్‌లో శోధన కూడా పెరిగింది. మోదీ కూడా అదే పదాన్ని తనదైన శైలిలో కాంగ్రెస్‌పైకి తిరిగి ప్రయోగించారు. ''ఈ యువరాజులు ప్యాలెసుల్లో పుట్టారు. కష్టపడిందీ లేదు, ఫలితాలు సాధించిందీ లేదు. అందుకే దేశం తనంతట తానే అభివృద్ధి చెందుతుందని వారు అలవోకగా చెబుతుంటారు. ఎలా? 'కటాకట్, కటాకట్'' అని చెప్పుకొచ్చారు. రాయ్‌బరేలీ లోక్‌సభ నియోజకవర్గ ప్రజలు వారిని 'కటాకట్, కటాకట్' ఇంటిదారి పట్టిస్తారంటూ రాహుల్‌పై చెణుకులు విసిరారు.

తేజస్వీ 'ఫటాఫట్'

తేజస్వీ యాదవ్ కూడా రాహుల్‌తో కలిసి ఓ సభలో మాట్లాడుతూ నిరుద్యోగులను ఉద్దేశించి.. ''మీకు ఉద్యోగాలు ఫటాఫట్ వచ్చేస్తాయి. ఫటాఫట్. బీజేపీ సఫాచట్, సఫాచట్ (తుడిచి పెట్టుకుపోతుంది). కాంగ్రెస్, లాంతర్‌కు ఓట్లు తకాతక్ పడిపోతాయి'' అని చెప్పుకొచ్చారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా గమ్మత్తైన పదాలను ప్రయోగించారు. ''తాము అవినీతి చేసేది లేదు, ఎవరినీ చేయనిచ్చేది లేదని గొప్పలు చెప్పేవారు టీకాల తయారీదారుల నుంచి విరాళాలు, ఎన్నికల బాండ్ల రూపంలో భారీ మొత్తాలు అందుకుంటారు. అలాంటి వారు గటాగట్, గటాగట్, అని చెబుతుంటారు. కానీ ప్రజలు ఓటు ద్వారా వారిని ఫటాఫట్ ఫటాపట్ ఇంటికి పంపించేస్తారు'' అని బీజేపీపై వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఆంధ్రప్రదేశ్

మళ్లీ జయం మనదే

'ఎక్స్'లో సీఎం వైఎస్ జగన్ ట్వీట్



సాక్షి, అమరావతి: దేవుడి దయ, ప్రజలిచ్చిన చరిత్రాత్మక తీర్పుతో సరిగ్గా ఐదేళ్ల క్రితం ఇదే రోజున మన పార్టీ అధికారంలోకి వచ్చిందని.. ప్రజలందరి దీవెనలతో మరోసారి రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుచేయబోతున్నామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. కులం, మతం, ప్రాంతం, రాజకీయాలు చూడకుండా ప్రతీ కుటుంబానికీ ఈ ఐదేళ్లూ మంచి చేశామని.. ఇదే మంచిని మళ్లీ కొనసాగిస్తామని.. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి మరిన్ని అడుగులేస్తామని ఆయన అని గురువారం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

తిరుమలకు చేరుకున్న అమిత్ షా

తిరుమల: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా శుక్రవారం వేకువజామున తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఈ మేరకు ఆయన గురువారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. అమిత్ షాకు వకుళమాత అతిథిగృహం వద్ద టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఘన స్వాగతం పలికారు. అమిత్‌షా రాకతో తిరుమలలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటుచేశారు.

పోస్టల్ బ్యాలెట్‌పై వైఎస్సార్‌సీపీ న్యాయ పోరాటం

- కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా సీఈవో మెమోలపై పిటిషన్
- అత్యవసరంగా విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం
- ఓ మెమోలో కొంత భాగం.. మరో మెమో పూర్తిగా ఉపసంహరణ

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కుట్రపూరితం!

పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటుపై ఈసీ కొత్త నిబంధనలు ఎందుకు?

టీడీపీ ఇలా అడగ్గానే అలా ఆగమేఘాలపై ఎలా నిబంధనలు మారుస్తారు?

- అటెస్టేషన్ అధికారి సీల్ వేయకపోయినా, హోదా వివరాలు రాయకపోయినా చెల్లుబాటట!
- ఈ సవరణ ఎవరి కోసం.. ఎందుకోసం? దొంగ ఓట్లకు అవకాశం ఇచ్చినట్లు కాదా?
- సంతకం ఉంటే చాలట.. ఓట్ల లెక్కింపు సమయంలో సందేహాలు రావా?
- అలాంటప్పుడు వందలాదిగా ఉండే స్పెసిమెన్ సంతకాలతో సరిపోల్చడం కుదిరే పనా?
- ఎన్నికల సంఘం వ్యవహార శైలిపై ప్రజాస్వామ్యవాదుల ఆందోళన



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పోస్టల్ బ్యాలెట్ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరుపై ప్రజాస్వామ్యవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో వేటిని ఆమోదించాలి, వేటిని తిరస్కరించాలని స్పష్టమైన నిబంధనలు కేంద్ర ఎన్నికల సంఘం తన నిబంధనల పుస్తకంలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ వాటిని సవరిస్తూ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టుగా మారనున్నాయంటున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తాజా సవరణల వల్ల దొంగ ఓట్లకు ఆస్కారం కల్పించడమే కాకుండా నిజమైన ఓట్లు చెల్లకుండా పోయే అవకాశం ఉందంటున్నారు. కేంద్ర ఎన్నికల సంఘ నిబంధనల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటున్న ఓటరు తన వివరాలు, బ్యాలెట్ నంబర్‌తో డిక్లరేషన్ ఫాం 13ఏ సమర్పించాలని, ఈ ఓటరు తనకు తెలుసని ఒక గెజిటెడ్ అధికారి ధృవీకరించి సంతకం చేస్తూ.. పొడి అక్షరాలతో ఆ అధికారి పేరు, హోదా వివరాలు, చిరునామాతో పాటు సీల్ వేయాలని స్పష్టంగా ఉంది. మన రాష్ట్రం విషయానికి వస్తే గెజిటెడ్ అధికారి సంతకం ఉండి, అధికారి హోదా వివరాలు లేదా సీల్.. ఏదో ఒకటి ఉన్నా.. ఆ ఓట్లను పరిగణనలోకి తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా టీడీపీ అడిగిన వెంటనే మోమో జారీ చేయడం తెలిసిందే. దాన్ని ఎండార్స్ చేయడంతో పాటు మరికొంత సడలింపు ఇస్తూ గెజిటెడ్ అధికారి హోదా వివరాలు, సీల్ లేకపోయినా.. కేవలం సంతకం ఉంటే చాలు ఓట్లను పరిగణనలోకి తీసుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఏపీ సీఈవోకు లేఖ రాయడం వెంట వెంటనే జరిగిపోవడం గమనార్హం. పోస్టల్ బ్యాలెట్ల చెల్లుబాటు విషయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి జారీ చేసిన ఆదేశాలను ఉన్నత న్యాయస్థానంలో ఉపసంహరించుకోవడం అంటే.. ఆ ఉత్తర్వులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లుగా అంగీకరించినట్లే. ఈ కేసులో టీడీపీ ఇంప్లీడ్ పిటీషన్ వేయడం ద్వారా పోస్టల్ బ్యాలెట్ల వ్యవహారాన్ని మరింత గందరగోళ పరచాలనే ఉద్దేశం ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

సంతకంలో వ్యత్యాసాలుంటే..

టీడీపీ వినతికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం, ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేసి దొంగ ఓట్ల బెడదను సృష్టించిన సీఈవో ఆదేశాలకు అనుగుణంగా కేంద్ర ఎన్నికల సంఘం తందానా అనడం అనుమానాలకు తావిస్తోందని ప్రజాస్వామ్యవాదుల్లో ఆందోళన నెలకొంది. ఈ వ్యవహారం లెక్కింపు సమయంలో తీవ్ర గందరగోళ పరిస్థితులకు దారితీస్తుందని మాజీ ఎన్నికల అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, కేవలం సంతకంతో అతను అటెస్టేషన్ అధికారే అని నిర్ధారించడం ఎలా సాధ్యమవుతుందని వీరు ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్ణయం దొంగ ఓట్లను ప్రోత్సహించే విధంగా ఉందని కేంద్ర ఎన్నికల సంఘానికి సలహాదారునిగా వ్యవహరించిన అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. వివరాలు లేకుండా కేవలం సంతకంతో రిటర్నింగ్ ఆఫీసర్ ఎలా ఆమోదం తెలుపుతారని, అధికారుల సంతకాల్లో వ్యత్యాసాలు ఉండటం అత్యంత సహజమని వివరించారు. ఈ నేపథ్యంలో స్పెసిమెన్ సంతకంతో సరిపోల్చి చూడటం ఎలా సాధ్యమని రిటైర్డ్ ఆర్డీవో ఒకరు ప్రశ్నిస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లో ఏర్పాటు చేసిన గెజిటెడ్ అధికారుల సంతకాలు అన్నీ కౌంటింగ్ సెంటర్లలోని ఆర్వోలకు పంపిస్తామని, సంతకంపై అభ్యంతరం వ్యక్తం చేస్తే వాటితో సరిపోల్చి చూసుకొని నిర్ణయం తీసుకోవాలనడం విడ్డూరంగా ఉందంటున్నారు. ఇన్ని స్పెసిమెన్ అధికారుల సంతకాలతో వాటిని ఆ సమయంలో సరిపోల్చి చూడటం సాధ్యమయ్యే పనేనా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎవరి లబ్ధి కోసం ఆగమేఘాల మీద ఇటువంటి నిర్ణయాలు తీసకుంటున్నారని ప్రశ్నిస్తున్నారు.

ఈసీ నిష్పాక్షికతపై అనుమానాలకు మరింత బలం

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన అటెస్టింగ్ ఆఫీసర్లు కొంత మంది సీల్ వేయకుండా కేవలం సంతకాలు మాత్రమే చేశారని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని తమ ఓట్లను తిరస్కరించకుండా ఆమోదించేలా చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ నుంచి ఇలా విజ్ఞాపనలు రాగానే ఎన్నికల సంఘం వెంటనే పలు నిర్ణయాలు తీసుకుంటూ మొత్తం పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియనే పూర్తి గందరగోళంగా మార్చింది. టీడీపీ ఫిర్యాదు చేయగానే ముఖేష్ కుమార్ మీనా ఈ నెల 25న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం డిక్లరేషన్ ఫారం మీద అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం, పేరు, హోదా (డిజిగ్నేషన్) పూర్తి వివరాలు తప్పనిసరిగా ఉండాలని.. ఇవి ఉండి స్టాంప్ లేకపోయినా వాటిని పరిగణనలోకి తీసుకోవచ్చని ఉంది. ఒకవేళ ఏమైనా అనుమానం వస్తే దాన్ని రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా ఎన్నికల అధికారి వద్ద ఉన్న సంబంధిత అటెస్టింగ్ ఆఫీసర్ సంతకంతో సరిపోల్చుకుని పోస్టల్ బ్యాలెట్‌ను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. తాజాగా గురువారం కేంద్ర ఎన్నికల సంఘం మీనాకు రాసిన లేఖలో మరో ముందడుగు వేసి అటెస్టింగ్ ఆఫీసర్ సీల్ వేయకపోయినా, అతని హోదా వివరాలు లేకపోయినా సంతకం ఉంటే చాలు అని పేర్కొంది. ఎవరి ప్రయోజనాల కోసం ఎన్నికల సంఘం ఇలాంటి గందరగోళ నిర్ణయాలు తీసుకుంటోందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎప్పటి నుంచో అనుసరిస్తున్న నిబంధనలను ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే సడలింపునిస్తూ సీఈవో ఆదేశాలు జారీ చేయడమే విడ్డూరమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసీ మరో అడుగు ముందుకేసి వివరాలు రాయకపోయినా, సీల్ వేయకపోయినా పోస్టల్ బ్యాలెట్‌ను పరిగణనలోకి తీసుకోవాలనడం తొలి నుంచి ఈసీ నిష్పాక్షికతపై వ్యక్తమవుతున్న అనుమానాలకు మరింత బలం చేకూర్చినట్లయిందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రేమోన్మాది చేతిలో యువతి దారుణ హత్య

- కత్తితో మెడ, గొంతు నరికి హత్య చేసిన యువకుడు
- అక్కడికక్కడే మృతిచెందిన యువతి
- ఆపై నిందితుడి ఆత్మహత్యాయత్నం.. పరిస్థితి విషమం
- ఏలూరులో ఘటన


హత్యకు గురైన యువతి రత్నగ్రేస్ (ఫైల్)


నిందితుడు ఏసురత్నం (ఫైల్)

ఏలూరు టౌన్: ప్రేమోన్మాది చేతిలో యువతి దారుణ హత్యకు గురైంది. యువతికి నిశ్చితార్థం అవడంతో ఆమెను ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడు ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఆమె ఇంటి సమీపంలోనే అత్యంత దారుణంగా కత్తితో నరికి హతమార్చాడు. ఆపై తనూ గొంతు కోసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్థానికుల సమాచారంతో ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసరావు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. యువకుడిని ఏలూరు సర్వజనాస్పత్రికి తరలించారు.. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తీసుకెళ్లారు. ఈ ఘటనను ఏలూరు జిల్లా ఎస్పీ మేరీప్రశాంతి సీరియస్‌గా తీసుకున్నారు. ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు నగరంలోని ఎంఆర్‌సీ కాలనీకి చెందిన జక్కుల రత్నగ్రేస్(22) నగరంలోని ఒక ప్రైవేటు విద్యా సంస్థలో టీచర్‌గా పనిచేస్తూ స్థానికంగా తల్లిదండ్రులతో కలిసి ఉంటోంది. ముసునూరుకు చెందిన తొట్టిబోయిన ఏసురత్నం(23) అనే యువకుడు గత కొంతకాలంగా ఆమెను ప్రేమిస్తున్నానంటూ వెంటబడుతున్నట్టు సమాచారం. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో యువతి తన ఇంటి సమీపంలో ఉండగా అతను తన వెంట తెచ్చుకున్న కత్తితో పలుమార్లు ఆమె మెడ, గొంతుపై విచక్షణరహితంగా దాడి చేశాడు. ఈ ఘటనలో యువతి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెను హత్య చేసిన అనంతరం ఏసురత్నం కూడా అదే కత్తితో పీక కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. యువతికి ఈ నెల 26న వివాహ నిశ్చితార్థం జరిగినట్టు తెలుస్తోంది. ఆమె పని చేస్తున్న విద్యాసంస్థలో తనతో పాటు ఫ్యాకల్టీగా పనిచేసే వ్యక్తితో వివాహం నిర్ణయించారని సమాచారం.

ఎన్నిసార్లు వారించినా..

నిందితుడు ఏసురత్నం గతంలో తన కుమార్తెను ప్రేమ పేరుతో వేధించేవాడని మృతురాలి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. యువకుడితో పాటు మృతురాలు పదో తరగతి వరకు ఏలూరులో కలిసి చదివిందని, ఆమెతో సన్నిహితంగా మెలుగుతూ ఉండేవాడని స్థానికులు చెబుతున్నారు. అయితే ఇటీవల ఆమెకు నిశ్చితార్థం అవడంతో ఈ ఘాతుకానికి ఒడిగట్టాడని యువతి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు ఘటనకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నట్టు కేసు దర్యాప్తు చేస్తున్న ఏలూరు త్రీటౌన్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసరావు చెప్పారు.

నల్లమడవాగులో గల్లంతైన నలుగురు మృతి


- మృతదేహాలకు పోస్టుమార్టం
- కుటుంబ సభ్యులకు అప్పగింత


కిరణ్‌గౌడ్ (ఫైల్)


బండా నందు (ఫైల్)


సునీల్‌కుమార్, అతని కొడుకు అనురాజ్ (ఫైల్)

బాపట్లటౌన్: విహారయాత్రలో భాగంగా హైదరాబాద్ నుంచి బాపట్ల ప్రాంతానికి వచ్చిన 12 మందిలో బుధవారం నల్లమడవాగులో నలుగురు గల్లంతైన విషయం తెలిసిందే. వీరిలో సునీల్‌కుమార్ (36), అతని కొడుకు అనురాజ్ (13) మృతదేహాలు బుధవారం రాత్రి ఏరియా వైద్యశాలకు తరలించారు. మరో ఇద్దరు ఆచూకీ లభించకపోవడంతో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు రంగంలోకి ఎన్‌డీఆర్‌ఎఫ్, సూర్యలంక తీరంలోని గజ ఈతగాళ్లు, అగ్నిమాపక అధికారులు టీమ్‌లుగా ఏర్పడి నల్లమడ వాగులో సుమారు 3 కిలోమీటర్ల మేర గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపులో భాగంగా వడ్లకొండ కిరణ్‌గౌడ్ (35) మృతదేహాన్ని గురువారం ఉదయం 6.30 గంటల సమయంలో గుర్తించి వెలికి తీశారు. అదే సమయంలో బండా నందు (35) మృతదేహం మూలపాలెం గ్రామశివారులోని తుమ్మచెట్ల మధ్యలో ఉన్నట్లు గుర్తించి వెలికి తీశారు. నలుగురు మృతదేహాలకు గురువారం బాపట్ల ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుల కుటుంబ సభ్యులు మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. రూరల్ సీఐ శ్రీహరి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


శ్రుతికుమార్

హార్వర్డ్ వేదికపై శ్రుతికుమార్

తెలియనితనంలో ఉండే బలం
ప్రతిఘటనే!

నోరు మూయించి పెత్తనం చేసే పాలకులు
నోరు మూసుకుని బతికే పౌరులు
చరిత్ర నిండా ఉంటారు.
కాని నోరు మూసుకొని ఉండటం చేతగాక
అన్యాయాన్ని చూస్తూ ఉండలేక
గొంతెత్తి గర్జించేవాళ్లు చరిత్రలో నిలబడిపోతారు.
మన దేశ మూలాలున్న
హార్వర్డ్ యూనివర్సిటీ విద్యార్థిని
శ్రుతి కుమార్- ఆ ప్రతిష్ఠాత్మక ప్రాంగణంలో
గాజా మీద ఇజ్రాయిల్ చేస్తున్న పాశవిక దాడులకు
వ్యతిరేకంగా నోరు విప్పింది.
ప్రపంచవ్యాప్త ప్రశంసలు పొందింది.
వెనుకంజ వేయని మానవత్వం చాటిన
శ్రుతి కుమార్ పరిచయం, నేపథ్యం.

హార్వర్డ్ యూనివర్సిటీ తన విద్యార్థుల గురించి సరిగ్గా అధ్యయనం చేసినట్టు లేదు. చేసి ఉంటే బహుశా శ్రుతి కుమార్‌కు ఆ యూనివర్సిటీ గ్రాడ్యుయేషన్ వేదిక మీద మాట్లాడే అవకాశం ఇచ్చి ఉండేది కాదు. ప్రస్తుతం అమెరికా వ్యాప్తంగా యూనివర్సిటీల్లో గ్రాడ్యుయేషన్ సెరెమొనీలు జరుగుతున్నాయి. తల్లిదండ్రులు, బంధుమిత్రులు విశేషంగా హాజరయ్యి వేదిక మీద పట్టా అందుకుంటున్న తమ పిల్లలను హర్షధ్వానాలతో ఉత్సాహపరుస్తారు. హార్వర్డ్ యూనివర్శిటీలో ప్రతి ఏటా ఈ సెర్మనీలో పట్టా పొందుతున్న ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి వారికి ప్రసంగించే అవకాశం ఇస్తారు. ఈసారి ప్రసంగం చేసే అవకాశం శ్రుతి కుమార్‌కు వచ్చింది. అక్కడే ఆమెకు గొంతెత్తే అవకాశం లభించింది.

నిరసనల నేపథ్యం

అక్టోబర్ 7, 2023న హమాస్ సంస్థ ఇజ్రాయిల్ మీద దాడి చేసి 1400 ఇజ్రాయిలీల మరణానికి కారణం కావడంతో బదులు తీర్చుకోవడానికి రంగంలో దిగిన ఇజ్రాయిల్ నేటికీ ఆగని బాంబుల వర్షం కురిపిస్తూ ఉంది. ఇప్పటికి 35,000 మంది పాలస్తీనియన్లు మృతి చెందగా వీరిలో కనీసం ఇరవై వేల మంది స్త్రీలు, పసి పిల్లలు. ఈ దాడులు మొదలైనప్పటి నుంచి అమెరికా యూనివర్సిటీల్లో నిరసనలు మొదలైనా ఇజ్రాయిల్ మరింత దుర్మార్గంగా గాజాలోని ఆస్పత్రుల పై, స్కూళ్లపై దాడులు చేస్తుండటంతో ఇక విద్యార్థులు ఆగలేకపోయారు. ఏప్రిల్ నుంచి అమెరికా విశ్వవిద్యాలయాలు 'యాంటీ ఇజ్రాయిల్' నిరసనలతో హోరెత్తాయి. యూనివర్సిటీలు దిక్కుతోచక పోలీసులను ఆశ్రయిస్తే ఇప్పటికి 900 మంది విద్యార్థులు అరెస్ట్ అయ్యారు. వారిలో ఒక భారతీయ విద్యార్థిని కూడా ఉంది. అమెరికా యూనివర్సిటీలు తమ దగ్గర పోగయ్యే ఫండ్స్‌ను ఇజ్రాయిల్‌కు వంత పాడే బహుళ జాతి వ్యాపార సంస్థల్లో పెట్టుబడులు పెట్టడం మానేయాలని, ఆ డబ్బును వెనక్కు తీసుకోవాలనేది విద్యార్థుల ప్రధాన డిమాండ్. అంతే కాదు టెల్ అవివ్ (ఇజ్రాయిల్) యూనివర్సిటీతో కోర్సుల ఆదాన ప్రదానాలు చేసుకోవడం బంద్ చేయాలని కూడా డిమాండ్. ఏప్రిల్ 18న ఇదే విషయంలో హార్వర్డ్ యూనివర్సిటీలో భారీ నిరసన జరిగింది. విద్యార్థులు ఏకంగా మూడు చోట్ల పాలస్తీనా జెండాను ఎగురవేశారు. దాంతో యూనివర్సిటీ కన్నెర్ర చేసి 'వయొలేషన్ ఆఫ్ యూనివర్సిటీ పాలసీ' కింద 13 మంది విద్యార్థులను గ్రాడ్యుయేట్లు కాకుండా శిక్షించింది. అదే యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన శ్రుతి కుమార్ ఈ అంశం మీద నిరసన వ్యక్తం చేసేందుకు గ్రాడ్యుయేషన్ సెర్మనీని ఎంచుకుంది.

ఆమె ఒక టోర్నడో

బీభత్సమైన పిడుగుపాట్లకూ, టోర్నడోలకు పేరు పెట్టిన నెబ్రాస్కా (అమెరికా) రాష్ట్రంలో పుట్టిన కన్నడ మూలాలున్న అమ్మాయి శృతి కుమార్. అక్కడ విస్తారంగా సాగు చేసే జొన్న రైతుకు పెద్ద కూతురు ఆమె. చదువుతో పాటు ఆట, పాట, మాటలో కూడా ఆసక్తి చూపింది. మంచి వక్త. 'నేషనల్ స్పీచ్ అండ్ డిబేట్ -2019'లో పాల్గొని ఐదవ ర్యాంకులో నిలిచింది. 2020లో 'వాయిస్ ఆఫ్ డెమొక్రసీ' పోటీలో మొదటి విజేతగా నిలిచి 30 వేల డాలర్లు గెలుచుకుంది. అంతేకాదు తన చదువుకు స్పాన్సర్‌ని కూడా. యోగాలో దిట్ట. ముందు నుంచి అన్యాయాల, అపసవ్యతల మీద వ్యతిరేకత తెలిపే అలవాటున్న శ్రుతి కుమార్‌కు హార్వర్డ్ అవకాశం ఇవ్వడంతో ఆ యూనివర్సిటీనే హెచ్చరించి ఖంగు తినిపించింది.

తెలియనితనపు బలం

హార్వర్డ్ గ్రాడ్యుయేషన్ సెర్మనీలో శ్రుతి కుమార్ తన ప్రసంగానికి పెట్టుకున్న పేరు 'తెలియనితనంలో ఉండే బలం'. ఆమె తన ప్రసంగం చేస్తూ 'ప్రపంచంలో ఆర్గనైజ్డ్‌గా జరుగుతున్న అన్యాయాల గురించి అన్నీ తెలిసి నోరు మెదపని వారి కంటే ఏమీ తెలియకనే అది అన్యాయమనే కేవలం గ్రహింపుతో బరిలోకి దిగి ఎదిరించే నాలాంటి విద్యార్థులకు ఉండే బలం పెద్దది' అని అంది. 'పసిపిల్లల వంటి అమాయకత్వంతో కొత్త జన్మెత్తి అన్యాయాలను ప్రతిఘటించడానికి ముందుకు రావాలనే' అర్థంలో శ్రుతి కుమార్ మాట్లాడి హర్షధ్వానాలు అందుకుంది. 'మన విశ్వవిద్యాలయ ప్రాంగణంలో భావ ప్రకటనా స్వేచ్ఛపట్ల వ్యక్తమైన అసహనాన్ని చూసి నేను చాలా నిరాశకు గురవుతున్నాను. 13 మంది విద్యార్థులను గ్రాడ్యుయేట్లు కాకుండా ఆపారు. దీనిని వ్యతిరేకిస్తూ పదిహేను వందల మంది విద్యార్థులం, ఐదు వందల మంది అధ్యాపకులం ఖండించాం. విశ్వవిద్యాలయ యాజమాన్యానికి అభ్యర్థనలు పంపాం. అయినా సరే వినలేదు. హార్వర్డ్, మా మాటలు నీకు వినబడుతున్నాయా? హార్వర్డ్, మా మాటలు వింటున్నావా?' అని శ్రుతి గర్జించింది. 'ఇప్పుడు గాజాలో జరుగుతున్న ఘటనల మీద క్యాంపస్ మొత్తంగా దుఃఖం, అనిశ్చితి, అశాంతి చూస్తున్నాను. సరిగ్గా ఇప్పుడే ఇటువంటి క్షణంలోనే తెలియనితనపు శక్తి కీలకమైనదవుతుంది' అందామె.

పర్యవసానాలను గురించి వెరవక శ్రుతి ఈ ప్రసంగం చేసింది. యూనివర్సిటీకి తాను ఇచ్చిన ప్రసంగం పేజీలలో లేనిదాన్ని మధ్యలో ఇమిడ్చి ధైర్యంగా మాట్లాడింది. నిజం చెప్పాలంటే శ్రుతి అన్ని దేశాల విద్యార్థులకు, ప్రజలకు పిలుపునిస్తోంది. అన్నీ తెలిసి ఊరికే ఉండటం కన్నా, ఏమీ తెలియకనే 'అన్యాయం' అనిపించినప్పుడు వెంటనే గొంతెత్తాలని సందేశం ఇస్తోంది.

ఆమె ప్రసంగంలో కొంత

'నేడు ఈ ఉత్సవం మనకు తెలిసినదాని కోసం చేస్తున్నారు. మనకు ఏం తెలుసో దానిని ప్రశంసిస్తున్నారు. కాని తెలియనితనపు బలం ఒకటుంటుంది. నేనిక్కడికి (హార్వర్డ్) వచ్చేవరకూ 'విజ్ఞానశాస్త్ర చరిత్ర' అనే పాఠ్యాంశం ఉన్నదనేదే నాకు తెలియదు. ఇదిగో ఇప్పుడు ఇక్కడ ఆ శాఖ నుంచి నేను గ్రాడ్యుయేట్‌నయ్యాను. చరిత్రంటే మనకు తెలిసిన కథల గురించి ఎంత చదవాలో... తెలియని కథల గురించి కూడా అంత చదవాలని ఇక్కడే తెలుసుకున్నాను'

(మరికొంతసేపు మాట్లాడి తన దుస్తులలో నుంచి చిన్న కాగితం తీసి ప్రధాన ప్రసంగానికి విరామం ఇచ్చి, ఇలా మాట్లాడింది)

'నా నాల్గవ సంవత్సరం చదువులో యూనివర్సిటీలో మా భావ ప్రకటనా స్వేచ్ఛ, మా నిరసన ప్రదర్శనా స్వేచ్ఛ నేరాలుగా మారిపోయాయి. నేనిక్కడ ఇవాళ మీ ముందు నిలబడి నా సహ విద్యార్థులైన పదమూడు మంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులను గుర్తు చేసుకోవాలి. ఆ పదమూడు మంది అండర్ గ్రాడ్యుయేట్లు ఇవాళ పట్టభద్రులు కాలేకపోతున్నారు. మన విశ్వవిద్యాలయంలో భావ ప్రకటనా స్వేచ్ఛ పట్ల వ్యక్తమైన అసహనం ఫలితం ఇది. దీనికి నేను చాలా నిరాశ చెందుతున్నాను. పదిహేను వందల మంది విద్యార్థులం, ఐదువందల మంది అధ్యాపకులం ఈ అసహనాన్ని ఖండించాం. యాజమాన్యానికి అభ్యర్థనలు పంపాం. విద్యార్థులు మాట్లాడినా అధ్యాపకులు మాట్లాడినా అదంతా ఈ క్యాంపస్‌లో స్వేచ్ఛ గురించే. పౌరహక్కుల గురించే. హార్వర్డ్... మా మాటలు నీకు వినబడుతున్నాయా? హార్వర్డ్... మా మాటలు వింటున్నావా?'

(అని మళ్లీ ప్రధాన ఉపన్యాసంలోకి వచ్చింది)

'ఒక జాతి అయిన కారణాన తనను లక్ష్యంగా చేసి దాడులకు గురి చేయడం అంటే ఏమిటో బహుశా మనకు తెలియదు. హింసా, మృత్యువూ మన కళ్లలోకి కళ్లు పెట్టి చూడడం అంటే ఏమిటో బహుశా మనకు తెలియదు. మనకు తెలియవలసిన అవసరం కూడా లేదు. మనం కూడగట్టి మాట్లాడటం అనేది మనకు తెలిసి ఉన్న విషయాల గురించే కానక్కరలేదు. మనకు తెలియనిదాని గుండా కూడా ప్రయాణించాలి' అందామె.

ప్రసంగం చివర ఎమిలీ డికిన్సన్ కవితా వాక్యాన్ని కోట్ చేసింది.

'ప్రభాతం ఎప్పుడొస్తుందో తెలియదు. అందుకే ప్రతి తలుపూ తెరిచి పెడతాను'.

చూపులను కట్టడి చేసేలా!

ఫ్యాషన్

హ్యాండ్ పెయింట్స్‌లో మనదైన ఆత్మ కనిపిస్తుంటుంది. ఫ్యాబ్రిక్‌నే కాన్వాస్‌గా మలిచి, రంగుల కలయికతో కూర్చి తీర్చిదిద్దిన డిజైన్స్ ఎప్పుడూ ట్రెండ్‌లో ఉంటాయి. ఏ డిజైన్‌కి అదే ప్రత్యేకత. ఇక అవి గతం నుంచి ప్రేరణ పొందినవైతే అలనాటి హుందాతనాన్నీ, గాంభీర్యాన్నీ ఆహ్లాదాన్ని మనకూ పంచుతాయి.

సాగరిక ఘాట్గే భారతీయ నటి, మోడల్ కూడా. ఆమె తన తల్లి ఊర్మిళ ఘాట్గేతో కలిసి ఫ్యాబ్రిక్‌పై చేసిన హ్యాండ్ పెయింట్ అందాన్ని కిందటేడాది డిసెంబర్ నుంచి 'అకూటీ' ద్వారా మన కళ్లకు కడుతున్నారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఉండే ఊర్మిళ ఘాట్గే, సాగరిక ఘాట్గే. తమ సొంత లేబుల్‌తో హ్యాండ్‌పెయింట్ చీరలు, బ్లేజర్లు, దుపట్టాలు, సల్వార్‌సెట్‌లు డిజైన్ చేస్తున్నారు. ప్రకృతి సంబంధించిన మోటిఫ్‌లతో మన కళ్లకు కడుతున్నారు ఈ తల్లీకూతుళ్లు.

తల్లి పెయింటింగ్స్ నుంచి ప్రేరణ పొంది అందరి ముందుకు వాటిని తీసుకు రావడంలో చేసిన ప్రయత్నాన్ని ఎంతో ఆనందంగా మనకు పరిచయం చేస్తారు సాగరిక.


ఊర్మిళ ఘాట్గే, సాగరిక ఘాట్గే



'నా చిన్నతనంలో మా కుటుంబంలో స్త్రీలు షిఫాన్లు, టిష్యూలు, బ్రోకేడ్‌లను ధరించే విధానం, వారి ఆభరణాలు.. ఎంతో అందంగా కనిపించేవి. మా అమ్మ మహారాష్ట్రలోని రాచకుటుంబానికి చెందిన వ్యక్తి. కొల్హాపూర్‌లో తన గార్డెన్‌లో ఆమె పెంచిన పూల తోటలో ఎన్నో పూలు ఆమె అభిరుచికి అద్దం పట్టేలా ఉండేవి. నా చిన్నతనంలో మా అమ్మ వేసే పెయింటింగ్స్, బట్టల ముక్కలను కళాత్మక కళాఖండాలుగా మార్చే విధానం ఆశ్చర్యాన్ని కలిగించేది. ప్రకృతిని ఇష్టపడి ఆమె చేతితో చేసిన పెయింట్ పూల నమూనాలు ఆమె ధరించిన వస్త్రాలపైకి వచ్చేవి. కొన్నాళ్లకు అవి ఆమె బ్రాండ్‌గా పేరొందాయి. దానికి జీవం పోయడానికి కొంతమంది కళాకారులకు శిక్షణ ఇచ్చింది. ఈ రోజు 'అకూటి' పేరుతో రిచ్ టెక్స్‌టైల్స్, హ్యాండ్‌పెయింటెడ్ గార్మెంట్స్‌తో కొలువుదీరింది. నా కుటుంబంలోని ప్రసిద్ధ మహిళల చుట్టూ రూపొందించబడిన ఈ బ్రాండ్ మా మూలాలకు కట్టుబడి ఉంటుంది. నిజమైన అందం, గాంభీర్యం ఈ డిజైన్లలో ప్రతిఫలిస్తుంటుంది. ఆకూటీలో చీరలు, కో-ఆర్డ్ సెట్‌లు, బ్లేజర్లు, దుపట్టాలు, సల్వార్ సెట్స్ ఉన్నాయి. అన్నీ ప్రకృతికి సంబంధించిన మోటిఫ్‌లతో చేతితో 'పెయింట్ చేయబడ్డాయి' అంటూ తమ ఫ్యాబ్రిక్ కళను పరిచయం చేస్తున్నారు.



టేస్టీ స్నాక్స్

వంటిల్లు

క్యాలెండర్ పేజీ తిప్పమంటోంది. జూన్‌కి స్వాగతం పలకాల్సిందే. కొత్త టైమ్‌టేబుల్‌నీ స్వాగతించాల్సిందే. లంచ్ బాక్సు... స్కూల్‌కి రెడీ అయిపోతుంది. పిల్లలు సాయంత్రం వచ్చేటప్పటికి ఏం చేయాలి? ఇవిగో వీటిని మన వంటింట్లో ట్రై చేయండి.

బ్రెడ్ పొటాటో రోల్



కావలసినవి: బంగాళదుంపలు- 3 (మీడియం సైజువి); క్యారట్ తురుము లేదా పచ్చి బఠాణీలు - అర కప్పు ; మిరప్పొడి- అర టీ స్పూన్; గరం మసాలా పొడి- అర టీ స్పూన్; పసుపు - చిటికెడు; నిమ్మరసం - పావు టీ స్పూన్; కొత్తిమీర తరుగు - 2 టేబుల్ స్పూన్‌లు; ఉప్పు - అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; బ్రెడ్ స్లయిస్‌లు - 10; వెన్న - టేబుల్ స్పూన్ - 2 టేబుల్ స్పూన్‌లు; పాలు- అర కప్పు; మొక్కజొన్న పిండి లేదా మైదా లేదా శనగపిండి- 2 టేబుల్ స్పూన్‌లు (బ్రెడ్ స్లయిస్‌లను రోల్ చేసి అతికించడానికి).

తయారీ: ● బంగాళదుంపలను శుభ్రంగా కడిగి ఉడికించాలి. వేడి తగ్గిన తరవాత తొక్క తీసి చిదిమి ఒక పాత్రలో వేసుకోవాలి ● క్యారట్ లేదా బఠాణీలను ఉడికించి పక్కన పెట్టాలి ● ఇప్పుడు చిదిమిన బంగాళదుంప గుజ్జులో మిరప్పొడి, గరం మసాలా, ఉప్పు, పసుపు, కొత్తిమీర, నిమ్మరసం, ఉడికించిన క్యారట్ లేదా బఠాణీలను వేసి సమంగా కలిసే వరకు వేళ్లతో చిదమాలి. ఉప్పు, కారం సరి చూసుకుని అవసరమైతే మరికొంత చేర్చుకోవచ్చు ● ఈ మిశ్రమాన్ని పది సమభాగాలుగా చేయాలి. ఒక్కో భాగాన్ని ఓవల్ షేప్ (దొండకాయ ఆకారం)లో చేయాలి ● బ్రెడ్ అంచులు కట్ చేసి తీసేసిన తర్వాత బ్రెడ్ స్లయిస్‌ని పూరీల పీట మీద పెట్టి రోలర్‌తో వత్తాలి. ఇలా చేయడం వల్ల గుల్లబారి ఉన్న బ్రెడ్ చపాతీలాగ పలుచగా వస్తుంది. పాలలో బ్రష్ ముంచి ఈ స్లయిస్‌ల మీద చల్లాలి లేదా పాలలో వేళ్లు ముంచి బ్రెడ్ స్లయిస్ మీద చల్లి తడిపొడిగా ఉండేటట్లు మునివేళ్లతో అద్దాలి ● బ్రెడ్ చివర్లు అతికించడం కోసం తీసుకున్న పిండిలో నీరు పోసి గరిట జారుడుగా కలుపుకోవాలి ● ఇప్పుడు బ్రెడ్ స్లయిస్ మీద బంగాళదుంప మిశ్రమాన్ని ఉంచి అంచులకు పిండి ద్రవాన్ని అద్దుతూ అతికిస్తే బ్రెడ్‌రోల్ రెడీ. వీటిని ఒక గిన్నెలో పెట్టి మూత పెట్టాలి. బయటే ఉంచినప్పుడు ఒకవేళ కాల్చడం ఆలస్యం అయితే బ్రెడ్ అంచులు ఎండిపోయి రోల్ ఊడిపోతుంది ● పెనం వేడి చేసి వెన్న రాసి బ్రెడ్ రోల్స్‌ను ఒకదాని పక్కన ఒకటిగా అమర్చాలి. దోరగా కాలేకొద్దీ మరొక వైపుకు తిప్పుతూ అన్ని వైపులా కాలేటట్లు చూడాలి. పెనం మీద కాల్చినప్పుడు నూనెలో రోస్ట్ చేసినట్లు రోల్ అంతా సమంగా ఒకే రంగులో ఉండదు. కానీ లోపల మిశ్రమం ఉడికిపోతుంది. రోల్ పై భాగం కరకరలాడుతూ రుచిగా ఉంటుంది. మొత్తంగా ఒకేరంగులో ఉండాలంటే బాణలిలో నాలుగు టేబుల్ స్పూన్‌ల నూనె లేదా నెయ్యి మరిగించి అందులో నాలుగు రోల్స్ వేసి అవి కాలిన తర్వాత మరికొన్ని వేస్తూ కాల్చుకోవచ్చు. ఇలా చేసినప్పుడు నూనెలో నుంచి తీసిన వెంటనే టిష్యూ పేపర్ మీద వేస్తే అదనంగా ఉన్న నూనెను పేపర్ పీల్చుకుంటుంది ● ఒవెన్‌లో అయితే... 200 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో వేడి చేసి బేకింగ్ ట్రేలో రోల్స్‌ను అమర్చి పది నుంచి పన్నెండు నిమిషాల సేపు బేక్ చేయాలి.

చీజ్ బాల్స్



కావలసినవి: బంగాళదుంపలు - పావు కేజీ; వెల్లుల్లి పేస్ట్ - టీ స్పూన్; ఉప్పు - పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి; రెడ్ చిల్లీ ఫ్లేక్స్ లేదా పచ్చిమిర్చి తరుగు లేదా మిరప్పొడి - అర టీ స్పూన్; మిరియాల పొడి - పావు టీ స్పూన్; కొత్తిమీర తరుగు - టీ స్పూన్; బ్రెడ్ క్రంబ్స్ - 6 టేబుల్ స్పూన్‌లు; నూనె - వేయించడానికి తగినంత.

స్టఫింగ్ కోసం: చీజ్ - 100 గ్రాములు; ఎండిన పుదీన - అర టీ స్పూన్ (ఆకులను అరచేతిలో వేసి వేళ్లతో నలిపి పొడి చేయాలి); రెడ్ చిల్లీ ఫ్లేక్స్ లేదా పచ్చిమిర్చి తరుగు లేదా మిరప్పొడి - పావు టీ స్పూన్; మిరియాల పొడి- పావు టీ స్పూన్, గరం మసాలా పొడి- చిటికెడు.

కోటింగ్ కోసం: కార్న్ ఫ్లోర్ - 2 టేబుల్ స్పూన్‌లు ; ఎగ్ - ఒకటి (ఎగ్ వేయనట్లయితే మరో 2 టేబుల్ స్పూన్‌ల కార్న్‌ఫ్లోర్ తీసుకోవాలి); బ్రెడ్ క్రంబ్స్- అర కప్పు.

తయారీ: ● బంగాళదుంపలను శుభ్రంగా కడిగి ఉడికించి, వేడి తగ్గిన తర్వాత తొక్క తీసి చిదమాలి ● అందులో వెల్లుల్లి పేస్ట్, కొత్తిమీర తరుగు, ఉప్పు, చిల్లీ ఫ్లేక్స్, మిరియాల పొడి, బ్రెడ్ క్రంబ్స్ వేసి సమంగా కలిసేటట్లు చిదిమి ఒకసారి రుచి చూసుకుని అవసరమైతే ఉప్పు, కారం కలుపుకుని మిశ్రమం మొత్తాన్ని బాల్స్ చేసి ఆరిపోకుండా ఒక గిన్నెలో వేసి మూత పెట్టుకోవాలి ● స్టఫింగ్ కోసం తీసుకున్న వాటిలో చీజ్ తప్ప మిగిలిన అన్నింటినీ ఒక పాత్రలో వేసి కలపాలి. అందులో చీజ్ ని అర అంగుళం ముక్కలుగా కట్ చేసి వేసి పాత్రను కొద్దిగా కదిలిస్తూ మసాలా పొడులు చీజ్ ముక్కలకు పట్టేలా చేసి వేడి తగలకుండా స్టవ్‌కు దూరంగా ఉంచాలి ● ఇప్పుడు బంగాళదుంప బాల్స్ ఒక్కొక్కటిగా తీసుకుని అరచేతిలో పెట్టి వేళ్లతో చిన్న పూరీలా వత్తి అందులో మసాలా పట్టించిన చీజ్ ఒక ముక్క పెట్టి బంగాళాదుంప మిశ్రమం పూరీ అంచులను మూసేస్తూ బాల్ చేయాలి. ఇలా అన్నింటినీ చేసిన తర్వాత ఒక ప్లేట్‌లో కార్న్‌ఫ్లోర్ వేసి అందులో ఒక్కో బాల్‌ని వేస్తూ మెల్లగా వేళ్లతో కదిలిస్తూ పిండి అన్ని వైపులా సమంగా పట్టేటట్లు చేయాలి ● మరొక ప్లేట్‌లో బ్రెడ్ క్రంబ్స్ వేసుకుని కార్న్‌ఫ్లోర్ పట్టించిన బాల్స్‌ని వేసి అన్ని వైపులా సమంగా పట్టేటట్లు చేయాలి ● కోడిగుడ్డు సొనను ఒక గిన్నెలో వేసి గిలక్కొట్టాలి. ఎగ్ వాడనట్లయితే రెండు టేబుల్ స్పూన్‌ల కార్న్‌ఫ్లోర్‌ను తగినంత నీటితో గరిటజారుడుగా కలుపుకోవాలి. పొడి కార్న్‌ఫ్లోర్ పట్టించిన బంగాళాదుంప- చీజ్ బాల్స్‌ని కార్న్‌ఫ్లోర్ ద్రవం లేదా కోడిగుడ్డు సొనలో ముంచి తీసి పదినిమిషాల సేపు ఆరనివ్వాలి ● ఈ లోపు బాణలిలో నూనె వేడి చేయాలి. ఒక్కో బాల్‌ను జాగ్రత్తగా నూనెలో వేసి మీడియం మంట మీద బాల్ అన్ని వైపులా సమంగా కాలిన ఒక ప్లేట్‌లోకి తీసుకోవాలి. బాల్స్ మీద టిష్యూ పేపర్‌ని కప్పి ఉంచితే అదనపు ఆయిల్ వదులుతుంది. బంగాళాదుంప- చీజ్ బాల్స్‌ని టొమాటో సాస్ లేదా కెచప్‌తో తింటే చాలా రుచిగా ఉంటాయి.

యువర్స్

● మ్యూజిక్ వరల్డ్

వో బేబీ... యూ బ్లేమ్ మీ అండ్ ఐ బ్లేమ్ యూ

'బిల్‌బోర్డ్ హాట్ 100'లో అమెరికన్ ర్యాపర్, సింగర్ పోస్ట్ మెలాన్ పాట 'ఐ హ్యాడ్ సమ్ హెల్ప్' ఫస్ట్ ప్లేస్‌లో నిలిచింది. సంక్లిష్టమైన మానవ సంబంధాలకు అద్దం పట్టే పాట ఇది.



పార్ట్‌నర్ హిపోక్రసి గురించి ప్రస్తావిస్తూ పాట మొదలుపెడతాడు మెలాన్. రిలేషన్‌షిప్ ట్రబుల్స్ చుట్టూ తిరిగే ఈ పాటను ఎలాంటి ట్రబుల్ లేకుండా 'ఇట్ టేక్స్ టు బ్రేక్ ఏ హార్ట్ ఇన్ టూ, వో బేబీ/యూ బ్లేమ్ మీ అండ్, ఐ బ్లేమ్ యూ' అంటూ హాయిగా పాడుకోవచ్చు.

● ఇంగ్లిష్ ఇడియమ్స్

గెట్ వన్స్ ఫీట్ వెట్

కొత్త పనిలోకి అడుగు పెట్టినప్పుడు లేదా రిస్క్ అయినా సరే ఏదైనా కొత్తగా ట్రై చేసే సందర్భంలో వాడే మాట... గెట్ వన్స్ ఫీట్ వెట్.

ఉదా: ది హార్డెస్ట్ పార్ట్ ఆఫ్ ది స్కైడైవింగ్ ఎక్స్‌పీరియెన్స్ వాజ్ గెట్టింగ్ అవర్ ఫీట్ వెట్. ఆఫ్టర్ దట్, ఎవ్రీథింగ్ వాజ్ ఓకే అండ్ ఈజీ.



బారెల్ ఆఫ్ మంకీస్

హాస్యాస్పదమైన పరిస్థితి, అస్తవ్యస్త పరిస్థితి, కంట్రోల్ తప్పి గందరగోళంగా మారడంలాంటి సందర్భాలలో వాడే మాట... బారెల్ ఆఫ్ మంకీస్.

ఉదా: ది ట్రాఫిక్ జామ్ వాజ్ ఏ టోటల్ బ్యారెల్ ఆఫ్ మంకీస్

● సక్సెస్ స్టోరీ

అద్భుతాల ఆర్యన్


ఆర్యన్ చౌహాన్

అద్భుతాలు ఆకాశం నుంచి ఊడిపడవు. ఆలోచనల్లో నుంచి పుడతాయి. ఢిల్లీకి చెందిన ఆర్యన్ చౌహాన్ చిన్న వయసులోనే ఎంటర్‌ప్రెన్యూర్‌గా పెద్ద విజయం సాధించడానికి ఆ ఆలోచనలే కారణం. కొత్తదనాన్ని ఆవిష్కరించే ఆలోచనలు అవి. కొత్త తరం ఆలోచనలు అవి...

ఇరవై రెండు సంవత్సరాల ఆర్యన్ చౌహాన్ ట్రాక్ రికార్డ్ 'ఆహా' అనేలా ఉంటుంది. పద్నాలుగు సంవత్సరాల వయసులోనే స్టార్టప్‌లకు సహాయపడే స్టార్టప్‌ను మొదలుపెట్టాడు. యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలో ప్రసిద్ధ జెరోమ్ ఫిషర్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీకి ఎంపికైన తక్కువ మందిలో ఆర్యన్ ఒకడు.

కోవిడ్ సమయంలో స్వదేశానికి తిరిగి వచ్చాడు ఆర్యన్.

ఆ సమయంలో అతడి మనసు నిండా కొత్త స్టార్టప్ ఆలోచనలు నిండి ఉన్నాయి.

అయితే ఏమీ చేయలేని అనిశ్చితి బయట నెలకొని ఉంది.

ఇండియన్ స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను లోతుగా అర్థం చేసుకోవడానికి ఈ సమయాన్ని ఉపయోగించుకున్నాడు ఆర్యన్.

2021లో 'జీవోవ్'పై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాడు.

తన తల్లితో కలిసి గురుగ్రామ్ కేంద్రంగా 'జీవోవ్' పేరుతో రెండో కంపెనీ స్టార్ట్ చేశాడు. టెక్-ఫస్ట్ అప్రోచ్‌తో డయాబెటిస్ సమస్యను అదుపులో ఉంచే కంపెనీ ఇది. పర్సనలైజ్‌డ్ రెమిషన్ ప్లాన్స్ నుంచి నిరంతర గ్లూకోజ్ మానిటరింగ్ (సీజీఎం) పరికరాల వరకు కంపెనీలో ఎన్నో ఉంటాయి.

ఇంతకీ ఆర్యన్‌కు 'జీవోవ్' ఆలోచన ఎలా వచ్చింది?

'డయాబెటిస్ బాధితులను దగ్గరి నుంచి చూశాను. మా తాతయ్యలు ఇద్దరూ డయాబెటిస్‌తో బాధలు పడ్డారు. ఆ సమయంలోనే ఏదైనా పరిష్కార మార్గం ఆలోచించాలనుకున్నాను' అంటాడు ఆర్యన్.

క్రానిక్ కేర్ బిజినెస్‌గా ప్రారంభమైన 'జీవోవ్' కంపెనీ న్యూట్రిషనిస్ట్, ఫిట్‌నెస్ ట్రైనర్స్, సైకాలజిస్ట్‌లను పేషెంట్లకు అందుబాటులోకి తీసుకువచ్చింది.

తక్కువ సమయంలోనే కంపెనీ 70,000లకు పైగా వినియోగదారులతో విజయపథంలోకి వచ్చింది.

'ప్రాడక్ట్‌ను క్రియేట్ చేయడం నుంచి మార్కెట్‌లో విజయవంతం చేయడం వరకు ఆర్యన్‌లో అద్భుత సామర్థ్యం ఉంది. వేగంగా నేర్చుకునే తత్వం, నిర్మాణాత్మక పనివిధానం అతడి సొంతం. ఏ ప్రాజెక్ట్ చేపట్టినా విజయవంతం చేయాలనే పట్టుదలతో పనిచేస్తాడు. నెవర్-సే-డై స్పిరిట్ ఆర్యన్‌ను క్వాలిటీ ఫౌండర్‌ని చేసింది' అంటాడు 'స్నాప్‌డీల్ అండ్ టైటాన్ క్యాపిటల్' ఫౌండర్ కునాల్ బహల్.

కునాల్ బహల్ జెరోమ్ ఫిషర్ ప్రోగ్రామ్ పూర్వ విద్యార్థి.

'జీవోవ్'కు ముందు కునాల్‌తో కలిసి పని చేశాడు ఆర్యన్.

'స్నాప్‌డీల్ అండ్ టైటాన్ క్యాపిటల్'లో ఫిన్‌టెక్, హెల్త్‌టెక్, డీ2సీ సెగ్మెంట్‌లను లీడ్ చేశాడు.

'ఇది చాలు' అనుకోవడం లేదు ఆర్యన్ చౌహాన్.

'జాయిన్ ది రెవల్యూషన్' నినాదంతో నెక్ట్స్ గ్రోత్ పేస్‌పై దృష్టి పెట్టాడు.

● టెక్.. టాక్

యాపిల్ ఐపాడ్ ప్రో 11



బాడీ: 249.7×177.5×5.3 ఎంఎం;
బరువు: 466 గ్రా.; డిస్‌ప్లే: 11.00
వోఎస్/సాఫ్ట్‌వేర్: ఐపాడ్‌వోఎస్ 17.5; రిజల్యూషన్: 1668×2420;
బ్యాటరీ: 7,606 ఎంఏహెచ్; మెమోరీ: 256జీబి 8జీబి ర్యామ్/ 512జీబి 8జీబి ర్యామ్/ 1టీబి 16జీబి ర్యామ్/ 2టీబి 16జీబి ర్యామ్

పోకో ఎఫ్ 6



సైజ్: 6.67 అంగుళాలు
రిజల్యూషన్: 1220×2712 పిక్సెల్స్
బరువు: 179 గ్రా; బ్యాటరీ: 5000 ఎంఏహెచ్
ఇంటర్నల్: 256జీబి 8జీబి ర్యామ్/ 512జీబి 12జీబి ర్యామ్
కలర్స్: బ్లాక్, గ్రీన్, టైటానియం

గూగుల్ మ్యాజిక్ ఎడిటర్



పాత పిక్సెల్ ఫోన్‌లకు 'మ్యాజిక్ ఎడిటర్'ను తీసుకురానున్నట్లు గూగుల్ ప్రకటించింది. 'మ్యాజిక్ ఎడిటర్'లో రకరకాల ఇమేజ్ ఎడిటింగ్, ఎన్‌హాన్స్‌మెంట్ టూల్స్ ఉంటాయి. ఫొటో రిసైజ్ చేయడానికి, ఎరేజ్ చేయడానికి, యూనిక్ ఫిల్టర్‌లను అప్లై చేయడానికి మ్యాజిక్ ఎడిటర్ ఉపయోగపడుతుంది. కొత్త ఫ్రీ మ్యాజిక్ ఎడిటర్ ఫీచర్‌లు ప్రస్తుతం కొన్ని పిక్సెల్స్ 7, పిక్సెల్స్ 6 సిరీస్ ఫోన్‌లలో అందుబాటులో ఉన్నాయి. 'మ్యాజిక్ ఎడిటర్'తో పాటు ఫొటోఅన్‌బ్లర్, మ్యాజిక్ ఎరేజర్, పోర్ట్రాయిట్ లైట్‌లాంటి ఏఐ-పవర్డ్ ఫొటో-ఎడిటింగ్ ఫీచర్‌లు అన్ని ఆండ్రాయిడ్ డివైజ్‌లకు అందుబాటులోకి రానున్నాయి.

● గేమింగ్

సముద్ర సాహసం



'బారెంట్స్ అండ్ ఫిషింగ్: నార్త్ అట్లాంటిక్ ఫ్రాంఛైజీలకు సీక్వెల్‌గా వచ్చిన గేమ్ షిప్స్ ఎట్ సీ. ఈ బ్రాండ్-న్యూ గేమ్‌ప్లేలో రకరకాల కొత్త ఫీచర్‌లు ఉన్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. చాలాకాలంగా ఎదురు చూస్తున్న మల్టీప్లేయర్ మోడ్‌లో వచ్చిన ఈ గేమ్ ద్వారా మహా సముద్రాలకు సంబంధించి రియలిస్టిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను సొంతం చేసుకోవచ్చు. నెక్ట్స్ జనరేషన్ షిప్ స్టిమ్యులేషన్‌గా వచ్చిన ఈ గేమ్‌లో మొదటిసారిగా సర్వీస్, కార్గో నౌకలను పరిచయం చేశారు. వీటిలో సరికొత్త గేమ్‌ప్లే ఫీచర్‌లో ఉంటాయి.

'స్నేహితులతో కలిసి నార్వేజియన్ సముద్రంలోకి వెళ్లండి. సినిమాటిక్-క్వాలిటీ ఓషన్ స్టిమ్యులేషన్ దీని సొంతం. సముద్ర సాహసాలు చేయాలనే ఉత్సాహం మీలో ఉందా? అయితే షిప్స్ ఎట్ సీలోకి వచ్చేయండి' అంటుంది గేమ్ డెవలపర్ మిస్క్ గేమ్స్.

జానర్స్: ఎర్లీ యాక్సెస్, స్ట్రాటజీ వీడియో గేమ్
ప్లాట్‌ఫామ్: మైక్రోసాఫ్ట్ విండోస్
ఇంజిన్: అన్‌రియల్ ఇంజిన్ 5

ప్లే, సింగ్ ఆర్ హమ్ ఏ సాంగ్



పాట చరణాలు గుర్తు లేవు...కానీ ట్యూన్ హమ్ చేస్తుంటాం. గుర్తుకు రాని ఇష్టమైన పాటను వెదికిపట్టుకోవడానికి పెద్దగా కష్టపడనక్కర్లేదు. హమ్ చేయడం ద్వారా యూట్యూబ్ మ్యూజిక్‌లో ఇష్టమైన పాటను వినవచ్చు. యాపిల్ 'షాజమ్'ను పోలిన ఈ ఫీచర్ పేరు...ప్లే, సింగ్ ఆర్ హమ్ ఏ సాంగ్. 'ప్లే, సింగ్ ఆర్ హమ్'ను ఉపయోగించడానికి.. ● ఆండ్రాయిడ్ ఫోన్‌లో యూట్యూబ్ ఓపెన్ చేయాలి ● టాప్ రైట్‌లోని సెర్చ్ ఐకాన్‌ను క్లిక్ చేయాలి. ● 'మ్యూజిక్ వేవ్'లా కనిపించే ఐకాన్‌ను సెలెక్ట్ చేయాలి ● హమ్మింగ్ స్టార్ట్.

యూట్యూబ్‌లో కామెంట్ ఎడిట్, డిలీట్ చేయడానికి...

మనం చూసిన వీడియోలు, చేసిన కామెంట్స్‌ను యూట్యూబ్ సేవ్ చేస్తుంది. కామెంట్ హిస్టరీని చూడాలనుకుంటున్నారా? ఎడిట్ లేదా డిలీట్ చేయాలనుకుంటున్నారా? అయితే ఇలా చేయండి... ■ యూట్యూబ్ లోగోకు లెఫ్ట్‌లో ఉన్న హంబర్గర్ మెనూ బటన్‌ను క్లిక్ చేయాలి ■ 'యూ' సెక్షన్ కింద ఉన్న 'హిస్టరీ'ని క్లిక్ చేయాలి ■ రైట్‌లో ఉన్న 'మేనేజ్ ఆల్ హిస్టరీ' క్లిక్ చేయాలి ■ కామెంట్స్-ట్యాప్

డిలిట్, ఎడిట్ చేయడానికి...

■ 'ఎక్స్' ఐకాన్‌ను నొక్కితే కామెంట్ ఆటోమేటిక్‌గా డిలీట్ అవుతుంది ■ ఎడిట్ చేయడానికి వీడియో లింక్‌ను నొక్కాలి. లోడ్ అయిన పేజీ మీ కామెంట్‌ను హైలైట్ చేస్తుంది. ఎడిట్ చేయాలనుకుంటున్న కామెంట్ పక్కన ఉన్న త్రీడాట్ మెనూ బటన్‌పై క్లిక్ చేసి 'సేవ్' బటన్ నొక్కాలి; ■ గమనించాల్సిన విషయం ఏమిటంటే మార్పులు చేసిన తరువాత కామెంట్ ఎడిట్ చేసినట్లు యూట్యూబ్ చూపిస్తుంది.

సినిమా

అండమాన్‌లో యాక్షన్


● సూర్య

కొద్ది రోజుల పాటు అండమాన్‌కు మకాం మార్చనున్నారు హీరో సూర్య. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో సూర్య హీరోగా ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా చిత్రీకరణలో భాగంగానే సూర్య అండమాన్ వెళ్లనున్నారు. 2డీ ఎంటర్‌టైన్మెంట్స్, స్టోన్ బెంచ్ ఫిలింస్ నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ అండమాన్‌లో ప్రారంభం కానుంది. నవ్వు, యుద్ధం, ప్రేమ అంశాల నేపథ్యంలో రూపొందనున్న ఈ సినిమాను జూన్‌లో ప్రారంభించనున్నట్లు 'ఎక్స్'లో ఓ వీడియోను షేర్ చేశారు కార్తీక్ సుబ్బరాజ్. అండమాన్‌లో ఆరంభించే ఈ తొలి షెడ్యూల్‌లో ఓ యాక్షన్ ఎపిసోడ్ చిత్రీకరించడానికి ప్లాన్ చేశారు. ఇక ఈ మూవీలో హీరోయిన్‌గా పూజా హెగ్డే పేరు వినిపిస్తోంది.

సినిమా విడుదలకి ముందే యానిమేషన్ రిలీజ్ ప్రయోగమే



''కల్కి 2898 ఏడీ' సినిమా విడుదల కాకముందే యానిమేషన్ సిరీస్‌ను రిలీజ్ చేయడం మా ప్రొడక్షన్ హౌస్ ధైర్యంగా తీసుకున్న నిర్ణయం.. చెప్పాలంటే ఇదొక ప్రయోగమే. నాలుగైదేళ్లుగా దీని కోసం పని చేస్తున్నాం'' అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. **- నాగ్ అశ్విన్**

ప్రభాస్ హీరోగా నటించిన పాన్ ఇండియన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర పాత్రలు పోషించారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ సినిమా జూన్ 27న రిలీజ్ కానుంది. ఈ సినిమాలో భైరవగా ప్రభాస్ కనిపించనున్నారు. ఈ చిత్రంలో ఆయన వాడిన కారు పేరు బుజ్జి. కాగా బుజ్జి-భైరవ 2డీ యానిమేషన్ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో నేటి నుంచి ప్రసారం కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ సిరీస్ ట్రైలర్ లాంచ్ వేడుకలో నాగ్ అశ్విన్ మాట్లాడుతూ – ''కల్కి 2898 ఏడీ' మూవీ రిలీజ్‌కి ముందే ఒక యానిమేషన్ సిరీస్ లాంచ్ చేయాలనే ఐడియా నచ్చింది. ఇందుకోసం 'ఛోటా భీమ్'తో పాటు ఎన్నో యానిమేషన్ సిరీస్‌లను రూపొందించిన గ్రీన్ గోల్డ్ సంస్థతో కలిసి పని చేశాం. ఈ ఐదేళ్లలో వైజయంతీ ఆటోమొబైల్స్, వైజయంతీ యానిమేషన్, వైజయంతీ మూవీస్ అనే మూడు డిఫరెంట్ కంపెనీలను నడిపించాం'' అన్నారు.

ఆధ్యాత్మిక ప్రయాణం


● రజనీకాంత్

ఒక సినిమా షూటింగ్ ఆరంభించే ముందు... లేదా సినిమా పూర్తయ్యాక ఆధ్యాత్మిక యాత్ర చేస్తుంటారు రజనీకాంత్. ఆయన ఎక్కువగా హిమాలయాలకు వెళ్లే విషయం తెలిసిందే. అక్కడి మహావతార్ బాబాజీ గుహలో రజనీ ధ్యానం చేస్తుంటారట. తాజాగా రజనీకాంత్ మరోసారి ఆధ్యాత్మిక యాత్రలో ఉన్నారు. దాదాపు పది రోజులు హిమాలయాల్లో గడిపి, తిరిగి వచ్చేలా ప్లాన్ చేసుకున్నారట. చెన్నై చేరుకున్న వెంటనే తన తాజా చిత్రం 'కూలీ' చిత్రీకరణలో పాల్గొంటారు రజనీకాంత్. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో ఈ సినిమాను సన్ పిక్చర్స్ సంస్థ నిర్మించనుంది. మరోవైపు రజనీకాంత్ నటించిన చిత్రం 'వేట్టయాన్'. టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'వేట్టయాన్'లో రజనీకాంత్ పాత్రకు సంబంధించిన చిత్రీకరణ మొత్తం పూర్తయింది. ఈ ఏడాది అక్టోబరులో ఈ చిత్రం విడుదల కానుంది.

టప్పా టప్పా.. పెళ్లి పాటప్పా


● శర్వానంద్, కృతీ శెట్టి

టప్పా టప్పా.. అంటూ పాట అందుకున్నారు శర్వానంద్, కృతీ శెట్టి. ఈ ఇద్దరూ జంటగా నటించిన 'మనమే' చిత్రంలో పెళ్లి సమయంలో వచ్చే 'టప్పా టప్పా..' అంటూ సాగే పాట విడుదల అయింది. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో విక్రమ్ ఆదిత్య కీలక పాత్ర చేశారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 7న రిలీజ్ కానుంది. కాగా చిత్ర సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి ఇప్పటికే రెండు పాటలు విడుదల చేసిన యూనిట్ గురువారం 'టప్పా టప్పా..' అంటూ సాగే మూడవ పాటని విడుదల చేసింది. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటను రామ్ మిరియాల, హేషమ్ అబ్దుల్ వహాబ్ పాడారు. ''అందరూ ఎంజాయ్ చేసే వెడ్డింగ్ సాంగ్‌ని అందించారు హేషమ్. ఈ పాటలో శర్వానంద్, కృతీ గ్రేస్‌ఫుల్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను అలరిస్తాయి'' అని యూనిట్ పేర్కొంది.

నయనతార ప్లేస్‌లో త్రిష?


● త్రిష

తమిళ ఫ్యాంటసీ కామెడీ డ్రామా 'మూకుత్తి అమ్మన్'కు సీక్వెల్‌గా 'మూకుత్తి అమ్మన్ 2' సెట్స్ పైకి వెళ్లేలా సన్నాహాలు జరుగుతున్నాయనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. 'మూకుత్తి అమ్మన్' చిత్రంలో నయనతార టైటిల్ రోల్ చేయగా, ఆర్‌జే బాలాజీ మరో లీడ్‌లో నటించారు. ఎన్‌జే శరవణన్‌తో కలిసి ఆర్‌జే బాలాజీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2020లో డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదలైంది. వీక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. తాజాగా 'మూకుత్తి అమ్మన్ 2' పనులను మొదలు పెట్టారట ఆర్‌జే బాలాజీ. అయితే సీక్వెల్‌లో నయనతార కాకుండా త్రిష నటించనున్నారనే ప్రచారం జరుగుతోంది. అంతేకాదు.. ఈసారి ఆర్‌జే బాలజీయే పూర్తి స్థాయిలో దర్శకత్వ బాధ్యతలు తీసుకోనున్నారట. మరి.. సీక్వెల్‌లో త్రిష నటిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

బాహుబలిలా వెపన్


● సత్యరాజ్

''ప్రస్తుతం భాష అనేది హద్దుగా లేదు. 'బాహుబలి' సినిమా ఎన్నో భాషల్లో విడుదలైంది. మా 'వెపన్' మూవీ కూడా అలాంటి చిత్రమే. సూపర్ హ్యూమన్ సాగా కాన్సెప్ట్‌తో రానున్న ఈ మూవీ కొత్త ట్రెండ్ కావడంతో పాటు పెద్ద హిట్టవుతుంది'' అని నటుడు సత్యరాజ్ అన్నారు. గుహన్ సెన్నియప్పన్ దర్శకత్వంలో సత్యరాజ్, వసంత్ రవి, తాన్యా హోప్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'వెపన్'. ఎంఎస్ మన్సూర్ సమర్పణలో మిలియన్ స్టూడియో బ్యానర్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో గుహన్ సెన్నియప్పన్ మాట్లాడుతూ– ''ఇదొక సైఫై థ్రిల్లర్, యాక్షన్ మూవీ'' అన్నారు. ''వెపన్' లాంటి మంచి సినిమాలో నటించినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు వసంత్ రవి, తాన్యా హోప్, రాజీవ్ పిళ్లై.

కృష్ణగారు యాక్షన్ సినిమాలు చేయమనేవారు


● మాళవికా శర్మ, సుధీర్‌బాబు

''సూపర్‌స్టార్ కృష్ణగారి జయంతి (మే 31) సందర్భంగా 'హరోం హర' మూవీ ట్రైలర్‌ని లాంచ్ చేయడం హ్యాపీగా ఉంది. యాక్షన్ సినిమాలు చేయమని కృష్ణగారు చెప్పేవారు. 'హరోం హర' విషయంలో ఆయన ఆనందపడతారని నమ్ముతున్నాను. తెలుగు, ఇండియన్ సినిమాలో ఇప్పటివరకూ 'హరోం హర'లాంటి నేపథ్యం ఉన్న సినిమా రాలేదనుకుంటున్నాను'' అన్నారు సుధీర్‌బాబు. **- సుధీర్‌బాబు**

జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుధీర్‌బాబు, మాళవికా శర్మ జంటగా నటించిన చిత్రం 'హరోం హర'. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ జి. నాయుడు నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో మహేశ్‌బాబు గురువారం సోషల్ మీడియాలో రిలీజ్ చేసి, 'ట్రైలర్ ఆసక్తిగా ఉంది. సుధీర్‌బాబు, టీమ్‌కు శుభాకాంక్షలు' అన్నారు. అనంతరం నిర్వహించిన ట్రైలర్ లాంచ్ వేడుకకి దర్శకులు అనిల్ రావిపూడి, సంపత్ నంది అతిథులుగా హాజరయ్యారు. సుధీర్‌బాబు మాట్లాడుతూ–''హరోం హర'లో హీరో పాత్ర గురించి సింగిల్ లైన్‌లో చెప్పాలంటే జేమ్స్ బాండ్ ఇన్ కుప్పం లేదా రాంబో ఇన్ కుప్పం అనొచ్చు'' అన్నారు. ''ఈ సినిమా సుధీర్ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్టవుతుంది'' అన్నారు అనిల్ రావిపూడి. ''ఈ మూవీ ట్రైలర్ టెరిఫిక్‌గా అనిపించింది'' అన్నారు సంపత్ నంది. ''హరోం హర'లో రెండు వేల మందితో షూట్ చేసిన ఓ సీక్వెన్స్ థియేటర్స్‌లో అద్భుతంగా ఉంటుంది'' అన్నారు జ్ఞానసాగర్ ద్వారక. ''నేనిప్పటి వరకూ చేయని పాత్రను ఈ సినిమాలో చేశాను'' అన్నారు మాళవికా శర్మ. ''మా సినిమా అందర్నీ ఎంటర్‌టైన్ చేస్తుంది'' అన్నారు సుమంత్ జి. నాయుడు. నిర్మాతలు సుబ్రహ్మణ్యం, కేఎల్ దామోదర్ ప్రసాద్, బెక్కం వేణుగోపాల్, సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ పాల్గొన్నారు.

నా కెరీర్‌లో ఇదో కొత్త ప్రయత్నం



''సత్యభామ' కంటే ముందు నాకు లేడీ ఓరియంటెడ్ మూవీస్‌కి ఛాన్స్ వచ్చింది. కానీ ఈ తరహా సినిమాలు చేసే ఆత్మవిశ్వాసం నాలో ఉన్నప్పుడే ఒప్పుకోవాలనుకున్నాను. ఇప్పుడు కాన్ఫిడెంట్‌గా 'సత్యభామ' చేశాను. లేడీ ఓరియంటెడ్ మూవీస్ చేస్తున్నప్పుడు నాపై ఒత్తిడి ఉందనుకోను. బాధ్యతగా తీసుకుంటాను. ఫుల్ లెంగ్త్ యాక్షన్ మూవీ చేయాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను. అది 'సత్యభామ'తో నెరవేరింది'' అని కాజల్ అగర్వాల్ అన్నారు. **- కాజల్ అగర్వాల్**

ఆమె టైటిల్ రోల్‌లో నటించిన క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'సత్యభామ'. ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో నవీన్‌చంద్ర నటించారు. 'మేజర్' చిత్రదర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరించి, స్క్రీన్‌ప్లే అందించారు. సుమన్ చిక్కాలను దర్శకుడిగా పరిచయం చేస్తూ బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించిన ఈ చిత్రం జూన్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– ''సత్యభామ' సినిమాతో ఓ కొత్త ప్రయత్నం చేశాను. ఫస్ట్ టైమ్ నా కెరీర్‌లో భారీ స్టంట్స్ చేసిన సినిమా ఇది. వాటి కోసం చాలా కష్టపడ్డాను. క్రిమినల్స్ గేమింగ్, వర్చ్యువల్ రియాలిటీ వంటి టెక్నాలజీ ద్వారా పోలీసులు నేరాలను ఎలా పరిష్కరిస్తారో ఓ పోలీస్ అధికారిని అడిగి తెలుసుకున్నాను. ఆ విషయాలు ఈ సినిమాలో ఉన్నాయి'' అని అన్నారు. ''సత్యభామ' పూర్తిగా హైదరాబాద్ బేస్డ్ కథ. అందుకే ముందుగా తెలుగులో పర్ఫెక్ట్‌గా విడుదల చేసి, ఆ తర్వాత మిగతా భాషల గురించి ఆలోచించాలని అనుకున్నాం'' అన్నారు శశికిరణ్ తిక్క. ''ప్రతి పోలీసాఫీసర్ జర్నీలో ఓ స్పెషల్ కేసు ఉంటుంది. అలా సత్యభామ ఒక కేసును ఎందుకు పర్సనల్‌గా తీసుకుంటుంది అనేది ఈ చిత్రకథ'' అన్నారు సుమన్ చిక్కాల. ''సత్యభామ' అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు నిర్మాత బాబీ. ఈ చిత్ర సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల మాట్లాడారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
31-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▼	నిఫ్టీ ▼
617	216
73,886	22,489

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,862	▼	59
డోజోన్స్	38,183	▼	258
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,231	▲	48
డాక్స్	18,497	▼	23
షాంఘై	3,092	▼	19
నికాయ్	38,054	▼	503

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,115	▼	298
బంగారం (99.5 స్వచ్ఛత)	71,826	▼	297
వెండి (కిలో)	92,673	▼	1,445

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.02	83.87
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.76	107.31
€	యూరో	ఎస్‌బీఐ	89.01	91.37
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.39	53.55
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.23	56.17
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.59	63.56
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.34	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.81	23.58
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.36	12.36

బ్యాంకుల్లో అన్‌క్లైమ్డ్ డిపాజిట్లు రూ.78,213 కోట్లు

- వార్షికంగా 26% అప్ • బ్యాంకింగ్ మోసాల సంఖ్య పెరిగినా..విలువల్లో కట్టడి
- 2024-25లోనూ 7% పైన వృద్ధి! • ఇదే జరిగితే వరుస మూడేళ్లలో పురోగతి
- చెక్కు చెదరని 'వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎకానమీ' ట్యాగ్
- వార్షిక నివేదికలో సెంట్రల్ బ్యాంక్ కీలకాంశాలు...



▶ బ్యాంకుల్లో అన్‌క్లైమ్డ్ డిపాజిట్ల విలువ 2024 మార్చితో గడచిన ఒక్క ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 26 శాతం పెరిగి రూ.78,213 కోట్లకు చేరింది. ఖాతాదారులు లేదా వారసుల కోసం ఒకవైపు ప్రయత్నిస్తూనే... మరోవైపు ఇలా ఎవ్వరూ క్లైమ్ చేయకుండా మిగిలిపోయిన మొత్తాలను డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎవేర్‌నెస్ ఫండ్‌లో (డీఈఏ) బదలాయించడం జరుగుతుంది. ఈ ఫండ్ ఇలాంటి నిధుల మొత్తం 2023 మార్చి నాటికి రూ.62,225 కోట్లు ఉంది. బ్యాంకులు 10 లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలుగా తమ ఖాతాలలో ఉన్న క్లెయిమ్ చేయని డిపాజిట్లను ఆర్‌బీఐ పర్యవేక్షణలోని డీఈఏకు బదలాయిస్తాయి.



▶ భారత్ ఆర్థిక వ్యవస్థ ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరంలోనూ 7 శాతం వృద్ధి నమోదుచేసుకుంటుంది. కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ, వాటిని సమతౌల్యం చేసే సానుకూల పరిస్థితులూ ఉన్నాయి. 2022-23లో ఎకానమీ 7 శాతం పురోగమిస్తే, 2023-24లో వాస్తవిక జీడీపీ వృద్ధి రేటు 7.6 శాతంగా నమోదుకానుంది. 2024-25లో వృద్ధి రేటు 7 శాతంగా నమోదయ్యే వీలుంది. తద్వారా ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎకానమీగా భారత్ తన హోదాను కొనసాగించనుంది.



▶ 2023-24 ఆర్థిక సంవత్సరంలో సావరిన్ గోల్డ్ బాండ్లలో ఇన్వెస్టర్ల పెట్టుబడుల విలువ భారీగా పెరిగి రూ.27,031 కోట్లకు చేరింది. పరిమాణంలో ఈ విలువ 44.34 టన్నులకు ప్రాతినిధ్యం వహిస్తోంది. 2022-23లో ఈ విలువ, పరిమాణం వరుసగా రూ.6,551 కోట్లు, 12.26 టన్నులుగా ఉంది. 2015లో ఈ పథకం ప్రవేశపెట్టిన నాటి నుంచి 67 విడతల్లో విక్రయాలు జరిగాయి. రూ.72,274 కోట్లు సమకూరగా, పరిమాణంలో 146.96 టన్నులకు ఈ విలువ ప్రాతినిధ్యం వహిస్తోంది.



▶ ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీట్ 2024 మార్చి 31 నాటికి 11.08 శాతం వృద్ధితో రూ.70.48 లక్షల కోట్లకు చేరింది (దాదాపు 845 బిలియన్ డాలర్లు). పాకిస్తాన్ జీడీపీ 340 బిలియన్ డాలర్లకంటే ఇది 2.5 రెట్లు అధికం.

▶ అంతర్జాతీయంగా దేశీయ కరెన్సీ రూపీని మరింత చలామణీలోకి తేవడంలో భాగంగా భారత్ వెలుపల నివసిస్తున్న వ్యక్తులు (పీఆర్‌వోఐ) విదేశాల్లోనూ రూపీ అకౌంట్లను తెరిచేందుకు అనుమతి.





▶ బ్యాంకింగ్ రంగంలో మోసాల సంఖ్య మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో భారీగా 13,564 నుంచి 36,075కు ఎగసింది. అయితే మోసాలకు సంబంధించిన విలువ మాత్రం 46.7 శాతం పడిపోయి రూ.13,930కోట్లకి చేరింది.

ఫోన్‌పేలో గృహ, వాహన రుణాలు..



సీఈవో హేమంత్ గాలా

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే తాజాగా తమ ప్లాట్‌ఫాంపై ఆరు రకాల రుణ ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చింది. ఇకపై యూజర్లు మ్యుచువల్ ఫండ్ లోన్స్, బంగారం, బైక్, కార్, హోమ్ లోన్/ప్రాపర్టీపై రుణాలు, విద్యా రుణా లు తమ ప్లాట్‌ఫాంపై పొందవచ్చని సంస్థ తెలిపింది. ఇందుకోసం టాటా క్యాపిటల్, హీరో ఫిన్‌కార్ప్, ముత్తూట్ ఫిన్‌కార్ప్, డీఎంఐ హౌసింగ్ ఫైనాన్స్, హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ వంటి ఆర్థిక సంస్థలతో జట్టు కట్టినట్లు ఫోన్‌పే లెండింగ్ సీఈవో హేమంత్ గాలా తెలిపారు.

క్రీమ్‌లైన్ నుంచి మై ఫార్మ్ ప్రీమియం ఆవు పాలు



భూపేంద్ర సూరి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గోద్రెజ్ ఆగ్రోవెట్‌లో భాగమైన క్రీమ్‌లైన్ డెయిరీ ప్రొడక్ట్స్ తాజాగా మై ఫార్మ్ పేరిట ప్రీమియం ఆవు పాలను ఆవిష్కరించింది. అరలీటరు ప్యాకెట్ ధర రూ. 50గా ఉంటుంది. తమ సొంత ఫార్మ్‌ల నుంచి సేకరించే ఈ పాలు ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లో మాత్రమే అందుబాటులో ఉంటాయని గోద్రెజ్ జెర్సీ సీఈవో భూపేంద్ర సూరి గురువారమిక్కడ తెలిపారు. హైదరాబాద్‌లో 90 పైచిలుకు స్టోర్స్‌లో ఇవి లభిస్తాయని, ఈ ఏడాది ఆఖరు నాటికి ఈ సంఖ్యను 500 పైచిలుకు స్టోర్స్‌కి పెంచుకోనున్నామని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులకి ఇంటి దగ్గరే అందించేందుకు వచ్చే నెలలో యాప్‌ను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. వచ్చే మూడేళ్లలో ప్రీమియం పాల మార్కెట్లో 10-15 % వాటా దక్కించుకోవాలని నిర్దేశించుకున్న ట్లు చెప్పారు. ఈ సందర్భంగా పాల వినియోగ ధోరణులపై మిల్క్ రిపోర్ట్‌ను ఆవిష్కరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

31-5-2024 ఫామ్ ధర...

విశాఖ	500-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485-00
విజయవాడ	490-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.65

46% క్షీణించిన సువెన్ లాభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీలో ఉన్న సువెన్ ఫార్మాస్యూటికల్స్ మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 46 శాతం క్షీణించి రూ.67 కోట్లకు వచ్చి చేరింది. ఎబిటా రూ.191 కోట్ల నుంచి రూ.86 కోట్లుగా ఉంది. టర్నోవర్ రూ.381 కోట్ల నుంచి రూ.270 కోట్లకు పడిపోయింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,113 కోట్ల టర్నోవర్‌పై రూ.313 కోట్ల నికరలాభం ఆర్జించింది. ఫార్మా సీడీఎంవో విభాగంలో ఫేజ్-1 నుంచి ఫేజ్-3 వరకు 100కుపైగా ప్రాజెక్టులు ఉన్నాయని కంపెనీ వెల్లడించింది. ఇందులో ఫేజ్-3లో ఏడు మాలిక్యూల్స్, 13 ఇంటర్మీడియేట్స్ ఉన్నట్టు తెలిపింది. కోహెన్స్ లైఫ్‌సైన్సెస్‌తో సువెన్ ఫార్మా విలీనం సంబంధించి సెబీ నుంచి అనుమతి కోసం వేచిచూస్తున్నట్టు వివరించింది. విలీన ప్రక్రియ ఏడాదిలో పూర్తి అవుతుందని సంస్థ అంచనా వేస్తోంది.

సువెన్ ఫార్మాస్యూటికల్స్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో గురువారం 2.45 శాతం క్షీణించి రూ.631.15 వద్ద స్థిరపడింది.

అపోలో డివిడెండ్ రూ.10



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైద్య సేవల సంస్థ అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైస్ 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.10 తుది డివిడెండ్ చెల్లించాలని నిర్ణయించింది. ఇప్పటికే కంపెనీ రూ.6 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 76 శాతం దూసుకెళ్లి రూ.254 కోట్లు సాధించింది. ఎబిటా 31 శాతం ఎగసి రూ.640 కోట్లు నమోదైంది. టర్నోవర్ 15 శాతం వృద్ధి చెంది రూ.4,944 కోట్లు పొందింది. 2023-24లో రూ.19,059 కోట్ల టర్నోవర్‌పై రూ.899 కోట్ల నికరలాభం అందుకుంది.

అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైస్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో గురువారం 2.47 శాతం క్షీణించి రూ.5,761 వద్ద స్థిరపడింది.

అయిదో రోజూ అమ్మకాలే..



ముంబై: స్టాక్ మార్కెట్లో అయిదో రోజూ అమ్మకాలు కొనసాగాయి. జీడీపీ గణాంకాలు, సార్వత్రిక ఎన్నికలు తుది దశకు చేరుకోవడం, జూన్ 4న ఫలితాల వెల్లడి నేపథ్యంలో ఇన్వెస్టర్ల అప్రమత్తత వహించారు. మే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ కాంట్రాక్టుల గడువు నేపథ్యంలో ట్రేడర్లు తమ పొజిషన్లను కొనసాగించేందుకు ఆసక్తి చూపలేదు. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 617 పాయింట్ల నష్టంతో 73,886 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 216 పాయింట్లు కోల్పోయి 22,489 వద్ద నిలిచింది.

ఎన్‌ఎస్‌ఈ 'నిఫ్టీ ఈవీ-కొత్త తరం ఆటోమోటివ్ ఇండెక్స్'

ఎన్‌ఎస్‌ఈ ఎక్స్ఛేంజీ అనుబంధ సంస్థ ఎన్‌ఎస్‌ఈ ఇండీసెస్ 'నిఫ్టీ ఈవీ-కొత్త తరం ఆటోమోటివ్ ఇండెక్స్' ప్రారంభించింది. ఈ సూచీ విద్యుత్ వాహన పరిశ్రమ కంపెనీల పనితీరును సూచిస్తుంది. అసెట్ మేనేజర్లు, ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్లు, స్ట్రక్చర్డ్ ఉత్పత్తులు వంటి వాటికి ఈ సూచీ ప్రమాణికంగా నిలిచే వీలుంది. సూచీ బేస్ తేదీ 2018 ఏప్రిల్ 2. బేస్ విలువ 1000. ఏడాదిలో రెండు సార్లు మార్పులు చేర్పులు చేస్తారు. త్రైమాసికంగా రీ బ్యాలెన్సింగ్ ఉంటుంది.

జియో ఫైనాన్షియల్ నుంచి యాప్



న్యూఢిల్లీ: జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ తమ 'జియోఫైనాన్స్' యాప్ బీటా వెర్షన్‌ను ఆవిష్కరించింది. ఒకే ప్లాట్‌ఫాంపై యూపీఐ, డిజిటల్ బ్యాంకింగ్, బిల్లుల చెల్లింపులు, అన్ని ఖాతాల కన్సాలిడేషన్ మొదలైన సర్వీసులకు ఇది ఉపయోగపడనుంది. తక్షణం అకౌంటును తెరిచేందుకు ఇందులో జియో పేమెంట్స్ బ్యాంక్ అకౌంటు ఫీచరు ఉంటుంది. రాబోయే రోజుల్లో దీని ద్వారా మ్యూచువల్ ఫండ్స్ లోన్స్‌తో ప్రారంభించి గృహ రుణాల వరకు వివిధ రకాల రుణాలు కూడా అందించే యోచనలో ఉన్నట్లు జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ ఒక ప్రకటనలో తెలిపింది.

నష్టాల్లోకి శ్రీ రేణుకా షుగర్స్

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ కంపెనీ శ్రీ రేణుకా షుగర్స్ చివరి త్రైమాసికంలో లాభాల నుంచి నష్టాలలోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 112 కోట్ల నికర నష్టం ప్రకటించింది. అంతక్రితం ఏడాది(2022-23) ఇదే కాలంలో రూ. 45 కోట్ల నికర లాభం ఆర్జించింది. అధిక వ్యయాలు ప్రభావం చూపాయి. మొత్తం ఆదాయం మాత్రం రూ. 2,370 కోట్ల నుంచి రూ. 3,476 కోట్లకు జంప్‌చేసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 2,320 కోట్ల నుంచి రూ. 3,520 కోట్లకు పెరిగాయి. ఇక పూర్తి ఏడాదికి నికర నష్టం భారీగా పెరిగి రూ. 627 కోట్లకు చేరింది. 2022-23లో కేవలం రూ. 197 కోట్ల నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 9,107 కోట్ల నుంచి రూ. 11,367 కోట్లకు బలపడింది.

శ్రీ రేణుకా షేరు బీఎస్‌ఈలో 2.5 శాతం పతనమై రూ. 40.4 వద్ద ముగిసింది.

టైమ్ జాబితాలో రిలయన్స్, టాటా

100 అత్యంత ప్రభావవంతమైన కంపెనీల లిస్టులో చోటు






న్యూఢిల్లీ: దేశీ దిగ్గజాలు రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా గ్రూప్, సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతిష్టాత్మకమైన టైమ్ మ్యాగజైన్ లిస్టులో చోటు దక్కించుకున్నాయి. 2024కి గాను ప్రపంచంలోనే 100 అత్యంత ప్రభావవంతమైన కంపెనీలతో టైమ్ దీన్ని రూపొందించింది. ఈ లిస్టులో రిలయన్స్ చోటు దక్కించుకోవడం ఇది రెండోసారి. 2021లో కూడా ఈ జాబితాలో రిలయన్స్ ఉంది. కంపెనీలను అయిదు విభాగాలుగా వర్గీకరించగా టైటాన్స్ కేటగిరీలో రిలయన్స్, టాటాలను టైమ్ చేర్చింది. పయొనీర్స్ కేటగిరీలో సీరమ్ ఉంది. 58 ఏళ్ల క్రితం టెక్స్‌టైల్, పాలీయెస్టర్ కంపెనీగా ఏర్పాటైన రిలయన్స్ ఇండస్ట్రీస్ నేడు 200 బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో దేశంలోనే అత్యంత విలువైన కంపెనీగా ఎదిగిందని టైమ్ పేర్కొంది. 1868లో ప్రారంభమైన టాటా గ్రూప్.. సాల్ట్ (ఉప్పు) నుంచి సాఫ్ట్‌వేర్ వరకు వివిధ రంగాల్లో విస్తరించిందని తెలిపింది. 2023లో ఐఫోన్లను అసెంబుల్ చేసే తొలి భారతీయ కంపెనీగా నిల్చిందని వివరించింది. అటు సీరమ్ ఏటా 3.5 బిలియన్ డోసుల టీకాలను ఉత్పత్తి చేస్తూ ప్రపంచంలోనే అతి పెద్ద వేక్సిన్ల తయారీ సంస్థగా ఉందని టైమ్ పేర్కొంది.



షణ్ముగ శ్రీనివాస్‌కు స్వర్ణం... శిరీషకు కాంస్యం

ఇండియన్ గ్రాండ్‌ప్రి-2 అథ్లెటిక్స్ మీట్‌లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు పతకాలతో మెరిశారు. గురువారం చెన్నైలో జరిగిన పురుషుల 200 మీటర్ల విభాగంలో నలబోతు షణ్ముగ శ్రీనివాస్ స్వర్ణ పతకం సాధించగా... మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో ముగద శిరీష కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. 21 ఏళ్ల షణ్ముగ శ్రీనివాస్ అందరికంటే వేగంగా 21.18 సెకన్లలో గమ్యాన్ని చేరి విజేతగా నిలిచాడు. ఇదే నెలలో భువనేశ్వర్‌లో జరిగిన ఫెడరేషన్ కప్ చాంపియన్‌షిప్‌లో షణ్ముగ రజత పతకం సాధించాడు. మూడేళ్ల క్రితం కెన్యాలో జరిగిన అండర్-20 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో శ్రీనివాస్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 400 మీటర్ల హర్డిల్స్ ఫైనల్ రేసును 20 ఏళ్ల శిరీష 1ని:03.06 సెకన్లలో ముగించి మూడో స్థానంలో నిలిచింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన శిరీష ఖేలో ఇండియా గేమ్స్‌లోనూ కాంస్య పతకం సాధించింది.





జొకోవిచ్ అలవోకగా...

- మూడో రౌండ్‌లోకి టాప్ సీడ్
- మెద్వెదెవ్, జ్వెరెవ్ కూడా

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్ వరుసగా 19వ ఏడాది మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో ఈ సెర్బియా దిగ్గజం 6-4, 6-1, 6-2తో రొబెర్టో కార్బెలస్ బేనా (స్పెయిన్)పై విజయం సాధించాడు. 2 గంటల 4 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రపంచ నంబర్‌వన్ జొకోవిచ్ ఐదు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేశాడు. కెరీర్‌లో 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన జొకోవిచ్ 43 విన్నర్స్ కొట్టడంతోపాటు నెట్ వద్ద 20 పాయింట్లు సాధించాడు. మరోవైపు నాలుగో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా), ఎనిమిదో సీడ్ హుర్కాజ్ (పోలాండ్) కూడా మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో జ్వెరెవ్ 7-6 (7/4), 6-2, 6-2తో డేవిడ్ గాఫిన్ (బెల్జియం)పై, హుర్కాజ్ 6-7 (2/7), 6-1, 6-3, 7-6 (7/5)తో నకషిమా (అమెరికా)పై గెలుపొందారు. కెచ్‌మనోవిచ్ (సెర్బియా)తో జరిగిన మ్యాచ్‌లో మెద్వెదెవ్ తొలి సెట్‌ను 6-1తో నెగ్గి, రెండో సెట్‌లో 5-0తో ఆధిక్యంలో ఉన్నపుడు కెచ్‌మనోవిచ్ గాయం కారణంగా వైదొలిగాడు.

సబలెంకా ముందుకు...

మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సబలెంకా (బెలారస్), నాలుగో సీడ్ రిబాకినా (కజకిస్తాన్) మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో సబలెంకా 6-2, 6-2తో ఉచిజిమా (జపాన్)పై, రిబాకినా 6-3, 6-4తో అరంటా రుస్ (నెదర్లాండ్స్)పై గెలిచారు. డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) 7-6 (7/1), 1-6, 7-5తో నయోమి ఒసాకా (జపాన్)పై, మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6-3, 6-4తో తమారా జిదాన్‌సెక్ (స్లొవేనియా)పై నెగ్గారు.

నిఘా నీడలో...

భారత్-పాకిస్తాన్ టి20 ప్రపంచకప్ మ్యాచ్‌కు కట్టుదిట్టమైన భద్రత

తీవ్రవాదుల నుంచి పొంచి ఉన్న ముప్పు • పోలీసుల ఆధీనంలో మైదానం



ముస్తాబైన నాసా కౌంటీ స్టేడియం

న్యూయార్క్: అమెరికా గడ్డపై తొలిసారి జరగనున్న టి20 ప్రపంచకప్‌లో మ్యాచ్‌ల కోసం పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యంగా జూన్ 9న భారత్, పాకిస్తాన్ మధ్య ఇక్కడి 'నాసా కౌంటీ క్రికెట్ స్టేడియం'లో జరిగే మ్యాచ్ భద్రతకు సంబంధించి అదనపు దృష్టి పెట్టారు. ఈ మ్యాచ్‌కు తీవ్రవాద ముప్పు ఉన్నట్లు సమాచారం ఉంది. దాంతో అన్ని వైపుల నుంచి పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 'గతంలో ఎన్నడూ చూడని భద్రతా ఏర్పాట్లు ఇక్కడ కనిపించబోతున్నాయి' అని ఒక పోలీస్ ఉన్నతాధికారి చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో పెద్ద సంఖ్యలో జనాలను లక్ష్యంగా చేస్తూ ఏకవ్యక్తి చేసే 'వుల్ఫ్ అటాక్' తరహా దాడులకు ఆస్కారం ఉందని భావిస్తుండటంతో వాటిని నివారించేందుకు అడుగడుగునా పోలీసులను మోహరిస్తున్నారు. మ్యాచ్ జరిగే రోజు ఐసన్ హోవర్ పార్క్ పరిసరాలన్నీ పోలీసుల ఆధీనంలో ఉంటాయి. ఈ వివరాలను నాసా కౌంటీ ఎగ్జిక్యూటివ్ బ్రూస్ బ్లేక్‌మన్, పోలీస్ కమిషనర్ ప్యాట్రిక్ రైడర్ వెల్లడించారు. తాము ఏ విషయంలో కూడా ఉదాసీనత ప్రదర్శించబోమని వారు స్పష్టం చేశారు. 'ప్రతీ రోజూ నాసా కౌంటీ సహా ఇతర నగరాలకు కూడా బెదిరింపు కాల్స్ వస్తుంటాయి. మేం ఏ ఒక్కదాన్ని తేలిగ్గా తీసుకోం. అన్నింటినీ సీరియస్‌గా పరిశీలిస్తాం. అందుకే భారత్, పాక్ మ్యాచ్ జరిగే రోజు అదనంగా పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా నియమించాం. ఆ రోజు స్టేడియంలో కనీవినీ ఎరుగని భద్రతతో అభిమానులంతా సురక్షితంగా ఉంటారని హామీ ఇస్తున్నా' అని రైడర్ చెప్పారు. మరోవైపు ఐసీసీ కూడా ప్రేక్షకుల భద్రతే తమకు ముఖ్యమని, ఈ విషయంలో స్థానిక పోలీసులతో కలిసి పని చేస్తున్నామని పేర్కొంది.

సుదీర్ఘ సాధన...

తొలి రోజు ఫిట్‌నెస్ ట్రెయినింగ్‌పైనే దృష్టి పెట్టిన భారత క్రికెట్ జట్టు రెండో రోజు పూర్తి స్థాయి నెట్ ప్రాక్టీస్‌కు హాజరైంది. ఆటగాళ్లంతా దాదాపు మూడు గంటల పాటు సాధన చేశారు. నాసా కౌంటీ గ్రౌండ్‌కు దాదాపు ఐదు మైళ్ల దూరంలో ఉన్న కాంటియాగ్ పార్క్‌లో ఈ ప్రాక్టీస్ సాగింది. ఇక్కడ ఆరు డ్రాప్ ఇన్ పిచ్‌లు ఉండగా భారత్ మూడు పిచ్‌లను వినియోగించుకుంది. రెండు పిచ్‌లపై బ్యాటర్లు సాధన చేయగా, మరో పిచ్‌ను బౌలింగ్ కోసమే టీమిండియా కేటాయించింది. రోహిత్, గిల్, సూర్యకుమార్, పాండ్యా, దూబే, పంత్, జడేజా బ్యాటింగ్‌లో శ్రమించారు. కోహ్లి ఇంకా జట్టుతో చేరకపోగా... ఆలస్యంగా అమెరికాకు వచ్చిన యశస్వి జైస్వాల్, సంజూ సామ్సన్, రింకూ సింగ్, యుజువేంద్ర చహల్ మాత్రం సాధనకు దూరంగా ఉన్నారు.



రోహిత్

గాయత్రి-ట్రెసా జోడీ సంచలనం

ప్రపంచ రెండో ర్యాంక్ జంటకు షాక్ • మారిన్ చేతిలో మళ్లీ ఓడిన సింధు



సింగపూర్: భారత మహిళల డబుల్స్ జోడీ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో సంచలన విజయంతో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. అయితే సింగిల్స్‌లో సీనియర్ షట్లర్, రెండు ఒలింపిక్ పతకాల విజేత పీవీ సింధుకు ప్రిక్వార్టర్ ఫైనల్లోనే చుక్కెదురైంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి-ట్రెసా జంట చక్కని పోరాటపటిమతో దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచ రెండో ర్యాంక్ జోడీ బేక్ హన-లీ సో హీని కంగుతినిపించింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్‌లో భారత ద్వయం 21-9, 14-21, 21-15తో కొరియన్ జంటకు ఊహించని షాక్ ఇచ్చింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ కిమ్ సో యోంగ్-కాంగ్ హీ యోంగ్ (దక్షిణ కొరియా)లతో గాయత్రి-ట్రెసా తలపడతారు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధుకు కొరకరాని కొయ్య, స్పెయిన్ స్టార్ కరోలినా మారిన్ చేతిలో మరోసారి పరాజయం ఎదురైంది. సింధు 21-13, 11-21, 20-22తో మూడో సీడ్ మారిన్ ధాటికి చేతులెత్తేసింది. వీళ్లిద్దరు ముఖాముఖిగా ఇప్పటివరకు 17 సార్లు తలపడగా... 12 సార్లు స్పెయిన్ షట్లరే నెగ్గింది. సింధు కేవలం ఐదుసార్లే గెలిచింది. మారిన్‌పై సింధు చివరిసారి 2018 జూన్‌లో మలేసియా ఓపెన్ టోర్నీలో గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ ప్రణయ్ ఆట కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. ప్రణయ్ 13-21, 21-14, 15-21తో కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో పరాజయం పాలయ్యాడు.

కార్ల్‌సన్‌కు ప్రజ్ఞానంద 'చెక్'

ప్రపంచ నంబర్‌వన్‌పై నెగ్గిన భారత టీనేజ్ గ్రాండ్‌మాస్టర్



స్టావెంజర్: భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద తన కెరీర్‌లోనే చిరస్మరణీయ విజయాన్ని సాధించాడు. గతంలో చెస్‌లోని మూడు ఫార్మాట్లలో (క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్) ఏకకాలంలో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన నార్వే దిగ్గజం, ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌పై ప్రజ్ఞానంద సంచలన విజయం నమోదు చేశాడు. కార్ల్‌సన్ సొంతగడ్డలో జరుగుతున్న నార్వే చెస్ టోర్నీ పురుషుల విభాగం మూడో రౌండ్‌లో 18 ఏళ్ల ప్రజ్ఞానంద ఈ అద్భుతం చేశాడు. తెల్లపావులతో ఆడిన ప్రజ్ఞానంద 37 ఎత్తుల్లో కార్ల్‌సన్ ఆట కట్టించాడు. ఈ గెలుపుతో మూడో రౌండ్ తర్వాత ప్రజ్ఞానంద 5.5 పాయింట్లతో అగ్రస్థానంలోకి వచ్చాడు. గతంలో ఆన్‌లైన్, ర్యాపిడ్, బ్లిట్జ్ ఫార్మాట్లలో కార్ల్‌సన్‌పై భారత యువ గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, గుకేశ్, అర్జున్ గెలిచినా... క్లాసికల్ ఫార్మాట్‌లో మాత్రం ప్రజ్ఞానంద తొలిసారి కార్ల్‌సన్‌ను ఓడించాడు. టైమ్ లిమిట్ ఉండని క్లాసికల్ ఫార్మాట్‌లో కార్ల్‌సన్ ప్రపంచ నంబర్‌వన్, ప్రపంచ చాంపియన్ అయ్యాక అతడిని ఓడించిన రెండో భారతీయ ప్లేయర్‌గా ప్రజ్ఞానంద గుర్తింపు పొందాడు. అంతకుముందు భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ ఈ ఘనత సాధించాడు.

వైశాలి, హంపి గెలుపు




ఇదే టోర్నీ మహిళల విభాగంలో ప్రజ్ఞానంద సోదరి వైశాలి కూడా 5.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండటం విశేషం. మూడో రౌండ్‌లో వైశాలితోపాటు భారత స్టార్ కోనేరు హంపి కూడా అర్మగెడాన్ గేమ్‌లలో గెలిచారు. క్లాసికల్ ఫార్మాట్‌లో వైశాలి-అనా ముజిచుక్ (ఉక్రెయిన్) గేమ్ 50 ఎత్తుల్లో... హంపి-లె టింగ్లీ (చైనా) గేమ్ 36 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. విజేతను నిర్ణయించేందుకు అర్మగెడాన్ గేమ్‌లు నిర్వహించగా... హంపి తెల్లపావులతో ఆడి 49 ఎత్తుల్లో లె టింగ్లీపై నెగ్గగా... అనా ముజిచుక్‌తో నల్ల పావులతో ఆడిన వైశాలి 70 ఎత్తుల్లో గేమ్‌ను 'డ్రా'గా ముగించింది. అర్మగెడాన్ నిబంధనల ప్రకారం నల్లపావులతో 'డ్రా' చేసుకున్న ప్లేయర్‌ను విజేతగా ఖరారు చేస్తారు.

'పారిస్'కు చేరువగా సచిన్



బ్యాంకాక్: పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించేందుకు ఆఖరి క్వాలిఫయింగ్ టోర్నీలో భారత బాక్సర్లు సచిన్ సివాచ్ (57 కేజీలు) క్వార్టర్ ఫైనల్ చేరగా... అమిత్ పంఘాల్ (51 కేజీలు), సంజీత్ కుమార్ (92 కేజీలు), జైస్మిన్ (57 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ బౌట్‌లో సచిన్ 5-0తో బతుహన్ సిఫ్టిసీ (టర్కీ)పై ఏకపక్ష విజయం సాధించాడు. రెండో రౌండ్ బౌట్‌లలో సంజీత్ 5-0తో లూయిస్ సాంచెజ్ (వెనిజులా)పై, అమిత్ 4-1తో మౌరిసియో రూయిజ్ (మెక్సికో)పై గెలిచారు. మహిళల 57 కేజీల రెండో రౌండ్‌లో జైస్మిన్ 5-0తో మహసతి హమ్‌జయేవా (అజర్‌బైజాన్)పై విజయం సాధించింది. ఈ టోర్నీలో సెమీఫైనల్ చేరిన బాక్సర్లకు పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లు ఖరారవుతాయి.



జూన్ తొలి వారంలో రాష్ట్రంలోకి నైరుతి

జూన్ 5 నుంచి 11 మధ్య రాష్ట్రమంతటా విస్తరించే అవకాశం

ఈలోగా మరింతగా దంచికొట్టనున్న ఎండలు

- మూడు రోజులపాటు రాష్ట్రంలో తీవ్రం కానున్న ఉష్ణోగ్రతలు.. ఈ సీజన్‌లోనే అత్యధికంగా మంచిర్యాల జిల్లా భీమారంలో గురువారం 47.2 డిగ్రీల సెల్సియస్ నమోదు

సాక్షి, హైదరాబాద్: కేరళలోకి గురువారం ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు క్రమంగా ముందుకు సాగుతూ జూన్ 5 నుంచి 11 మధ్య తెలంగాణలోకి ప్రవేశించి విస్తరించే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈలోగా పగటి ఉష్ణోగ్రతలు మరికొంత పెరగొచ్చని పేర్కొన్నారు. శుక్ర, శని, ఆదివారాల్లో ఎండలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం పశ్చిమ, వాయవ్య దిశల నుంచి వడగాడ్పులు వీస్తుండటంతో గురువారం రాష్ట్రంలో చాలాచోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంచిర్యాల జిల్లా భీమారంలో అత్యధికంగా 47.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతగా నమోదైంది. ఇప్పటివరకు ఈ వేసవిలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గరిమెల్లపాడులో 47.1 డిగ్రీల సెల్సియస్, కమాన్‌పూర్‌లో 46.7, కుంచవల్లిలో 46.6, కాగజ్‌నగర్, పమ్మిలో 46.5, పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగత నమోదైంది. చాలాచోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. అలాగే రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే ఖమ్మంలో 44.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది.

మానేసి చూడండి..



ఆరోగ్యంలో మార్పు చూడండి..



12 నిమిషాల తర్వాత
రక్తంలో కార్బన్ మోనాక్సైడ్ సాధారణ స్థాయిలకు..

20 నిమిషాల తర్వాత
గుండె వేగం తగ్గి నియంత్రణలోకి రక్తపోటు

రెండు రోజుల తర్వాత
దెబ్బతిన్న నరాలు కోలుకోవడంతో రుచి, ఘ్రాణశక్తి పెరుగుదల

ఒక నెల తర్వాత
ఊపిరితిత్తులు కోలుకొనే ప్రక్రియ మొదలు.. వాటి సామర్థ్యం మెరుగు. దగ్గు తగ్గి, శ్వాస తీసుకొనే ప్రక్రియ సులభతరం

ఒక ఏడాది తర్వాత
హృద్రోగాలు వచ్చే అవకాశం గణనీయంగా తగ్గుదల. సంతానం కలిగే అవకాశాల్లో పెరుగుదల.

ఐదేళ్ల తర్వాత..
రక్త నాళాలు, ధమనుల వ్యాకోచం.. మెరుగ్గా రక్తప్రసరణ. నోరు, గొంతు, అన్నవాహిక, బ్లాడర్ కేన్సర్ల ముప్పు సగానికి తగ్గుదల.

పదేళ్ల తర్వాత..
ఊపిరితిత్తుల కేన్సర్ సోకే అవకాశం గణనీయంగా తగ్గుదల.

నేడు ధూమపాన వ్యతిరేక దినం

క్లుప్తంగా...

ఒకే రోజు 8 లక్షల మందికి జీహెచ్‌ఎంసీ నోటీసులు

ఎస్‌ఎంఎస్‌ల ద్వారా ఆస్తిపన్ను చెల్లింపుల కోసం

సాక్షి, హైదరాబాద్: ఆస్తిపన్ను వెంటనే చెల్లించాల్సిందిగా జీహెచ్‌ఎంసీ ఈనెల 28వ తేదీన ఒకే రోజు 8 లక్షల మంది ఇళ్ల యజమానుల ఫోన్లకు బల్క్ ఎస్‌ఎంఎస్‌లతో డిమాండ్ నోటీసులు పంపింది. ఏప్రిల్ నెలలో ఎర్లీబర్డ్ ద్వారా ఆస్తిపన్ను చెల్లించిన యజమానులు పోనూ మిగతా వారికి మే నెల నుంచి ఎస్‌ఎంఎస్‌లు పంపుతుతోంది. నెల పూర్తవుతోందంటే సిబ్బంది జీతాల చెల్లింపులు, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపుల కోసం తిప్పలు పడుతోన్న జీహెచ్‌ఎంసీ ఇలా ఒకే రోజు 8 లక్షల మందికి పంపించడం చర్చాంశనీయమైంది. కాగా, ఈ నెలలో రోజుకు సగటున దాదాపు రూ.40 లక్షల ఆస్తిపన్ను వసూలవుతుండగా, 8 లక్షల మందికి డిమాండ్ నోటీసుల అనంతరం 29, 30 తేదీల్లో ఒక్కో రోజు దాదాపు రూ.2కోట్ల మేర వసూలు కావడంతో అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌ఎంస్‌తోపాటే ఆస్తిపన్ను డిమాండ్ నోటీసును, ఆస్తిపన్ను చెల్లించాల్సిన లింక్‌ను కూడా పంపుతుండటంతో ప్రజలు చెల్లించేందుకు కూడా సులభంగా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డిమాండ్ నోటీసును కూడా ఫోన్‌కే పంపడం, ఒకేరోజు ఏకంగా 8 లక్షల మందికి పంపడం ఇదే ప్రథమమని అధికారులు చెబుతున్నారు.

టెండర్లు పిలుస్తున్నాం... చేప పిల్లలు వదులుతాం

'చేప పిల్లలా? చేయూతా?' కథనానికి స్పందించిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: మత్స్యకారులకు ఉచిత చేపల పంపిణీకి సంబంధించి చర్యలు తీసుకుంటున్నామని, ఆగస్టులో చేపపిల్లలను వదిలేలా కార్యక్రమం చేపట్టినట్లు మత్స్యశాఖ అదనపు డైరెక్టర్ శంకర్ రాథోడ్ తెలిపారు. 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన 'చేప పిల్లలా? చేయూతా..? కథనానికి స్పందించి ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024–25కి చేప, రొయ్య పిల్లల విడుదలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. టెండర్ల ప్రక్రియలో జాప్యం లేదని, ఆగస్టు చివరి నాటికి చేప పిల్లలు వదిలేలా చూస్తామన్నారు. నాసిరకం చేప పిల్లలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని, కెమెరాలు, వీడియోలతో పంపిణీ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ఇందుకోసం మత్స్య మిత్ర యాప్ తెచ్చామన్నారు

నటి హేమకు మళ్లీ నోటీసులు


బనశంకరి: బెంగళూరులోని ఓ జీఆర్ ఫాం హౌస్‌లో రేవ్ పార్టీలో పాల్గొని డ్రగ్స్ తీసుకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న తెలుగు నటి హేమతోపాటు 8 మందికి నగర సీసీబీ పోలీసులు గురువారం మళ్లీ నోటీసులిచ్చారు. జూన్ 1లోగా విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. ఈ నెల 27న తమ ముందుకు రావాలని పంపిన నోటీసులకు స్పందించనందున మళ్లీ నోటీసులిచ్చారు.

ఉపాధి కూలీలకు వెండి నాణేలు లభ్యం

ఔరంగజేబు కాలం నాటివిగా గుర్తింపు



మద్దూరు(హుస్నాబాద్): ఉపాధి హామీ కూలీలు పనులు చేస్తుండగా వెండి నాణేలు లభ్యమయ్యాయి. సిద్దిపేట జిల్లాలో మద్దూరు మండలం నర్సాయపల్లికి చెందిన చల్లా మల్లారెడ్డి సాగు భూమిలో కూలీలు బుధవారం ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. చల్లా రాజిరెడ్డి గడ్డపారతో తవ్వుతుండగా.. చల్లా కవిత తట్టతో మట్టిని ఎత్తిపోస్తోంది. ఈ క్రమంలో కవితకు ఓ రాతి పెట్టె దొరకడంతో.. అది తనదేనని ఇంటికి తీసుకెళ్లింది. విషయం పోలీసులకు తెలియడంతో గురువారం ఉదయం పెట్టెను స్వాధీనం చేసుకుని తెరిచారు. అందులో 20 వెండి నాణేలు, 2 వెండి ఉంగరాలు లభ్యమయ్యాయి. వాటిని పోలీసులు పురావస్తు శాఖకు అప్పగించారు. ఇవి ఔరంగజేబు కాలం నాటివిగా చరిత్రకారులు గుర్తించారు.



అమ్మ అనే పిలుపు కోసం..

మా పిల్లలను మాకే దత్తతకు ఇవ్వండి

శిశువిహార్ వద్ద పెంపుడు తల్లిదండ్రుల పడిగాపులు

- సంతానం కలగకపోవడంతో నవజాత శిశువుల కొనుగోలు
- పిల్లలతో ఏళ్ల అనుబంధాన్ని వీడలేక తీవ్ర ఆవేదన
- చిన్నారులకు డీఎన్‌ఏ పరీక్షల కోసం కోర్టుకెళ్లిన పోలీసులు
- ఢిల్లీ, పుణే, ముంబై నగరాల్లోని పిల్లల కిడ్నాప్ కేసుల విశ్లేషణ

ముగ్గురు ప్రధాన నిందితుల కోసం ప్రత్యేక బృందాల గాలింపు

సాక్షి, హైదరాబాద్/ వెంగళరావునగర్



''నా పేరు దుర్గా భవాని. సంతానం లేకపోవడంతో ఏజెంట్ ద్వారా రూ.5 లక్షలకు 8 రోజుల పాపను తీసుకున్నాం. భవ్యశ్రీ అని నామకరణం చేశాం. మహాలక్ష్మిలాగా చూసుకుంటున్నాం. ఇప్పుడు పాపకు మూడేళ్లొచ్చాయి. పొలం పనులు చేసుకొని ఇంటికొచ్చాక పాపను చూస్తే చాలు ఆనందంతో కడుపు నిండిపోతుంది. మా ప్రాణం కంటే ఎక్కువగా అమ్మాయిని చూసుకుంటున్నాం. ఇప్పుడు పోలీసులు మా నుంచి బిడ్డను దూరం చేసి అనాథలా శిశువిహార్‌లో పెట్టారు''



''నా పేరు అరుణ. పెళ్లయి ఏళ్లు గడిచినా పిల్లలు కలగలేదు. ఆస్పత్రులకు వెళ్లినా, మందులు వాడినా ఫలితం లేకపోవడంతో దత్తత తీసుకోవాలని నిర్ణయించుకున్నాం. ఓ మధ్యవర్తి ద్వారా 5 నెలల బాబును తీసుకున్నాం. ఘనంగా ఫంక్షన్ చేసి శ్రీమన్విత్ అని పేరుపెట్టాం. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నాం. ఫస్ట్ బర్త్ డేను ఘనంగా చేశాం. నేను మా అమ్మకు ఒక్కగానొక్క కూతుర్ని. దాంతో ఆమె పేరు మీదున్న ఒకటిన్నర ఎకరాల పొలాన్ని కూడా అబ్బాయి పేరు మీదే రాసేందుకు సిద్ధమైంది. తీరా చూస్తే పోలీసులు మా అబ్బాయిని నా నుంచి దూరం చేసి శిశు విహార్‌లో అప్పగించారు..''



చిన్నారి భవశ్రీతో దుర్గాభవాని, చక్రపాణి

.. ఇదీ హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో శిశువిహార్ వద్ద పెంపుడు తల్లిదండ్రుల ఆవేదన. ఇటీవల పిల్లలను విక్రయిస్తున్న అంతరాష్ట్ర ముఠాను మేడిపల్లి పోలీసులు పట్టుకున్న సంగతి తెలిసిందే. వారి నుంచి పిల్లలను కొనుగోలు చేసినవారి నుంచి రక్షించిన 19 మంది చిన్నారులను పోలీసులు శిశువిహార్‌లో అప్పగించారు. దీంతో పెంపుడు తల్లిదండ్రులంతా తమ పిల్లలను తమకు అప్పగించాలంటూ మూడు రోజులుగా అక్కడే పడిగాపులు కాస్తున్నారు. శిశువిహార్ లోపల ఉన్న ఆ పిల్లలను చూసేందుకు కూడా అనుమతి ఇవ్వకపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల దత్తత కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ వారికి సూచించారు. సమగ్ర విచారణ అనంతరం పిల్లలను దత్తతకు ఇస్తామని, అయితే అదే చిన్నారి కావాలంటే కష్టమని ఆమె స్పష్టం చేశారు.



శ్రీమన్విత్‌తో అరుణ

దత్తతగా అయినా.. మా పిల్లల్ని మాకే ఇవ్వండి..

చిన్నారులను విక్రయించడం, కొనడం చట్టరీత్యా నేరం. అయితే ఫెర్టిలిటీ సెంటర్ల ఖర్చు భరించలేకపోవడం, పిల్లల దత్తత ప్రక్రియలో తీవ్ర జాప్యం వంటివాటితో సంతానంలేని దంపతులు అక్రమ మార్గంలో పిల్లలను పొందేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీన్ని ఏజెంట్లు ఆసరాగా చేసుకుని.. పేద తల్లిదండ్రులకు డబ్బు ఆశ చూపించి.. లేక ఇతర రాష్ట్రాల కిడ్నాపర్ల నుంచి పిల్లలను తీసుకొచ్చి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అలా మధ్యవర్తుల నుంచి పిల్లలను కొన్న పెంపుడు తల్లిదండ్రులు.. తాజా పరిణామాలతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఇన్నాళ్లూ అమ్మా, నాన్నా అనే పిలుపుతో ఆనందపడినవారు.. మూడు రోజులుగా పిల్లలు దూరమై తల్లడిల్లిపోతున్నారు. అధికారికంగా దత్తత తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని.. అయితే తాము పెంచుకున్న పిల్లలను తమకే అప్పగించాలని పెంపుడు తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇన్నాళ్లూ సొంత పిల్లల్లా పెంచుకున్న అనుబంధం ఏర్పడిందని.. ఇప్పుడు దత్తత కింద వేరే పిల్లలను ఇస్తే ఎలాగని ప్రశ్నించారు. ఆర్థికంగా బాగానే స్థిరపడ్డామని, కావాలంటే అధికారులు నిర్ధారించుకున్నాకే పిల్లలను అప్పగించాలని కోరుతున్నారు.

డీఎన్‌ఏ పరీక్షల కోసం..

మరోవైపు ఈ చిన్నారుల అసలు తల్లిదండ్రులు ఎవరనేది తేల్చడం పోలీసులకు సవాల్‌గా మారింది. ఏజెంట్లు ఢిల్లీ, పుణె, ముంబై నగరాల నుంచి పిల్లలను తీసుకొచ్చి, విక్రయించిన నేపథ్యంలో.. ఆయా నగరాల్లో పిల్లల కిడ్నాప్ కేసులపై రాచకొండ పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆయా నగరాల్లో పోలీసుల వద్ద ఉన్న రికార్డుల్లోని తల్లిదండ్రుల వివరాలను సేకరించి.. ఈ పిల్లల డీఎన్‌ఏలతో సరిపోల్చాలని నిర్ణయించారు. ఈ మేరకు పిల్లల డీఎన్‌ఏ పరీక్షల అనుమతి కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇక ఈ వ్యవహారంలో పరారీలో ఉన్న ప్రధాన నిందితులు ఢిల్లీకి చెందిన కిరణ్, ప్రీతి, పుణెకు చెందిన కన్నయ్యల కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. ఆ ముఠా ఇప్పటివరకు 60 మంది పిల్లలను విక్రయించినట్లు గుర్తించిన నేపథ్యంలో.. మిగతా చిన్నారులు ఎక్కడున్నారనే అంశంపై దృష్టిసారించారు. పిల్లలను కొనుగోలు చేసిన పెంపుడు తల్లిదండ్రులపై మేడిపల్లి పోలీసులు 41–సీఆర్‌పీసీ నోటీసులు జారీ చేసి, స్టేషన్ బెయిల్ ఇచ్చి వదిలేశారు.

తలెత్తుకు బతికేలా!

ట్రాన్స్‌జెండర్లకు పెట్రోల్ బంక్.. శాశ్వత ఉపాధికి సిరిసిల్లలో బాటలు

రూ.3 కోట్లతో ఏర్పాటు.. రాష్ట్రంలోనే తొలి ప్రయోగం

సిరిసిల్ల: అవమానాలు.. చీదరింపులు భరిస్తూ.. సమాజంలో 'చిన్న చూపు' జీవనాన్ని సాగిస్తున్న ట్రాన్స్‌జెండర్ల శాశ్వత ఉపాధికి రాజన్న సిరిసిల్ల జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ట్రాన్స్‌జెండర్లు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా రాష్ట్రంలోనే తొలిసారిగా ఓ పెట్రోల్‌బంక్ ఏర్పాటు చేస్తోంది. కలెక్టర్ అనురాగ్ జయంతి జనవరిలో జరిగిన జిల్లా అభివృద్ధి సమావేశంలో రూపకల్పన చేసిన ప్రతిపాదనలకు ఇప్పుడు మోక్షం లభించింది. దీనికి సంబంధించిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) జారీ అయింది. ఇండియన్ ఆయిల్ కంపెనీ(ఐఓసీ) మంజూరు చేసిన పెట్రోల్‌బంకును జిల్లా కేంద్రంలోని కరీంనగర్–కామారెడ్డి ప్రధాన రహదారి రెండో బైపాస్ రోడ్డులో మెడికల్ కాలేజీ ఎదురుగా వీవింగ్ పార్కు ఎదుట ఏర్పాటు చేస్తున్నారు. కాగా, జిల్లాలో ఇప్పటి వరకు 25 మంది ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు జారీ చేసి వారి స్వయం ఉపాధికి వివిధ శిక్షణ కార్యక్రమాల ఏర్పాటుకు వీ–హబ్‌తో ఒప్పందం చేశారు. ఇందులో భాగంగానే ఇప్పుడు పెట్రోల్‌బంకు ఏర్పాటు కానుంది.



సిరిసిల్ల రెండో బైపాస్ రోడ్డులో పెట్రోల్‌బంక్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ట్రాన్స్‌జెండర్లు

రూ.3 కోట్ల వ్యయం..: పెట్రోల్‌బంకు ఏర్పాటుకు రూ.3 కోట్ల ఖర్చు కానుంది. ప్రభుత్వ నిధులు, బ్యాంకు రుణ సాయంతో ఏర్పాటు కానున్న బంకుతో 15 మంది ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యక్ష ఉపాధి లభిస్తుండగా.. మరో పదిమందికి పరోక్షంగా పని లభించే అవకాశాలున్నాయి. ఈ బంకు నిర్వహణపై ట్రాన్స్‌జెండర్లకు త్వరలో శిక్షణ ఇవ్వనున్నారు.

నమ్మకాన్ని నిలబెడుతాం



మాపై ఉన్న నమ్మకాన్ని నిలబెడతాం. ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లేందుకు మార్గం ఏర్పడింది. మిగతా ట్రాన్స్‌జెండర్లకు మేం మార్గదర్శకులుగా నిలుస్తాం.
- పి.సుప్రియ, రాజన్న సిరిసిల్ల

చట్టం స్ఫూర్తితో అవకాశం



సమాన అవకాశాల చట్టం ప్రకారం జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు జిల్లాలో వినూత్న అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. జెండర్ సెన్సిటివిటీని వారు ఆశించిన విధంగా నమోదు చేసేందుకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గుర్తింపు కార్డులు ఇస్తున్నాం. ఇప్పుడు వారిలో కొందరికి శాశ్వత ఉపాధి కల్పనకు పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తున్నాం.
- లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ అధికారి, రాజన్న సిరిసిల్ల

ఫుడ్ లైసెన్స్ పేరిట మందుల తయారీకి చెక్

డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కొరడా

సాక్షి, హైదరాబాద్: సిద్దిపేట జోన్‌లో ఆహార ఉత్పత్తులు(ఫుడ్ ప్రొడక్ట్స్) పేరిట మందుల విక్రయంపై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) కొరడా ఝుళిపించింది. ఫుడ్ లైసెన్స్ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) పేరిట 'మెట్ న్యూరాన్–ఓడీ టాబ్లెట్ల'ను విక్రయించడాన్ని అడ్డుకుంది. ఈ మందులను హరియాణలోని మెడికాంట్ న్యూట్రియెంట్స్ అక్రమంగా తయారు చేయగా. హైదరాబాద్‌లోని సిరిమెడ్ సానూస్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ మార్కెటింగ్ చేస్తోంది. సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లోని మెడికల్ షాపులో అసిస్టెంట్ డైరెక్టర్ డా.జె.రాజు, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వినయ్ సుష్మి జరిపిన దాడుల్లో శాంపిల్స్‌ను సేకరించారు.

తప్పుడు ప్రకటనలపై నజర్
మధుమేహం, నరాల బలహీనత, జ్వరం, మానసిక రుగ్మతలకు చికిత్స పేరిట ప్రకటనలిచ్చి తప్పుదారి పట్టించడంపై దృష్టి పెట్టి డీసీఏ అధికారులు గత రెండురోజులుగా దాడులు నిర్వహించారు. ఆయా చోట్ల డీసీఏ దాడులను అసిస్టెంట్ డైరెక్టర్ అంజుమ్ అబీదా, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు వి.రవికుమార్, జె.నాగరాజే, ఎల్.రాజు, వి.అజయ్, పి.సంజయ్ నిర్వహించారు.

అక్రమాలపై ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చు
మందులు, వాటి విక్రయాలకు సంబంధించి ఏవైనా అక్రమ కార్యకలాపాలు, వాటికి సంబంధించిన ఫిర్యాదులను అన్ని పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలలోగా తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కు టోల్‌ఫ్రీ నెంబర్–1800–599–6969 ద్వారా తెలియజేయవచ్చని డీసీఏ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

నన్ను ఇష్టపడుతున్న అమ్మాయి ఎవరైనా ఉన్నారా?

ఉంటే పెళ్లి చేసుకుంటా.. అంటూ ఫ్లెక్సీ



చీరాల: పెళ్లి సంబంధాలు రాకపోవడంతో నిరుత్సాహంతో నీరసించిన ఓ పెళ్లికాని ప్రసాద్ వినూత్నంగా ర్యాలీ నిర్వహించాడు. 'నేనంటే ఇష్టం ఉన్న అమ్మాయి ఎవరైనా తన పేరు, మొబైల్ నంబర్ నమోదు చేసుకుని వీలున్న రోజున నన్ను కలవగలరు. కుల పట్టింపుల్లేవు. నమ్మకం ఉన్న వాళ్లు వివరాలివ్వండి' అంటూ ఫ్లెక్సీ వేయించి దానిని సైకిల్‌కు కట్టుకునీ మరీ చీరాల ప్రధాన కూడలిలో మకాం వేశాడు. బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గం దేశాయిపేట పంచాయతీ రామన్నపేటకు చెందిన దేవన నీలకంఠ అయ్యప్పకుమార్ డిగ్రీ చదివి.. వయస్సు పైబడిన బ్యాచ్‌లర్. తనను ఇష్టపడే అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని ఆకాంక్ష మాత్రం ఎక్కువగా ఉంది. తల్లిదండ్రుల్లేరు. ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. గతంలో కూడా ఇదే విధంగా చీరాలలోని కూరగాయల మార్కెట్ వద్ద నిలబడి ప్రచారం చేశాడు. తనను కోరుకునే అమ్మాయి వచ్చి తన ఇంటి ముందున్న గంట మోగించాలని ఇంటి ముందు రాశాడు. కరపత్రాలు ముద్రించి మరీ వేటపాలెంలో పంచాడు. ఈ వ్యవహారం పోలీసుల దృష్టికి వెళ్లడంతో కౌన్సెలింగ్ ఇచ్చారు. కొంత కాలం మిన్నకుండిన అతడు మళ్లీ గురువారం చీరాలలో ఇలా హల్‌చల్ చేశాడు.



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఖగోళ యాత్ర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అమెరికాలోని అట్లాంటాలో రామాలయం

2025 శ్రీరామ నవమి నాటికి సిద్ధం: పద్మనాభ ఆచార్యులు

పంజగుట్ట (హైదరాబాద్): అమెరికాలోని అట్లాంటాలో భద్రాచలం తరహాలో శ్రీరామ దేవాలయం రూపుదిద్దుకుంటోంది. భద్రాచలంలో ఆలయం ఎలా ఉంటుందో అచ్చం అదే తరహాలో అమెరికాలోనూ సీతారాముల దేవాలయం నిర్మిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు పద్మనాభ ఆచార్యులు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలిపారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని చెక్కిన శిల్పుల్లో సుమారు 200 మంది ఈ ఆలయ నిర్మాణంలో పాల్గొంటున్నారని చెప్పారు. ఓ అజ్ఞాత భక్తుడు ఇచ్చిన 33 ఎకరాల స్థలంలో 22 ఎకరాల్లో దేవాలయం, మిగిలిన 11 ఎకరాల్లో మల్టిపర్పస్ హాల్, వేద పాఠశాల, గోశాల, ఉద్యోగుల క్వార్టర్స్ నిర్మిస్తున్నట్లు పద్మనాభ ఆచార్యులు తెలిపారు. భక్తుల నుంచి సేకరించిన నిధులతో ఈ ఆలయాన్ని రూపొందిస్తున్నామని, ఇందుకు రూ.250–300 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని వివరించారు. 2025 శ్రీరామ నవమి నాటికి ఆలయాన్ని పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. 2016లో భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు అమెరికా నుంచి వచ్చామని.. అప్పుడే అట్లాంటాలో రామాలయాన్ని నిర్మించాలన్న ఆలోచన వచ్చిందని చెప్పారు. 2019లో దేవాలయ శంకుస్థాపన జరిగిందని, అయితే కరోనావల్ల రెండేళ్లు పనులు చేయలేకపోయామని, 2022లో పూర్తి అనుమతులు తీసుకుని ఆలయ నిర్మాణం ప్రారంభించామని వివరించారు. కాగా, ప్రపంచ శాంతి కోసం ఖగోళ యాత్ర (ప్రపంచ యాత్ర) చేస్తున్నట్లు తెలిపారు.



మావోయిస్టులారా.. మా జిల్లాకు రావొద్దు..

- ప్లకార్డులు ప్రదర్శిస్తూ అల్లూరి జిల్లా వాసుల ర్యాలీ
- మావోలు లేకుంటేనే అభివృద్ధి అంటూ నినాదాలు

జి.మాడుగుల(అల్లూరి సీతారామరాజు జిల్లా): 'మావోయిస్టులారా.. మా అల్లూరి సీతారామరాజు జిల్లాకు రావొద్దు'.. అంటూ మండలంలోని మద్దిగరువులో గురువారం జరిగిన వారపుసంతలో గిరిజనులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం బొయితిలి పంచాయతీ మద్దిగరువు వారపుసంతలో పెదబయలు, జి.మాడుగుల మండలాల్లో ఇంజరి, గిన్నెలకోట, జామిగూడ, కుంతుర్ల, పంచాయతీలకు చెందిన మావోల చేతిలో బలైన వ్యక్తుల కుటుంబాలతో పాటు 500 మంది గిరిజనులు వారికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగకుండా గతంలో మావోలు అడ్డుకునే వారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది నుంచి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో జరుగుతున్న సెల్ టవర్లు, రోడ్ల నిర్మాణాలపై వారు సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ఈ ప్రాంతంలో వారపుసంతకు వెళ్లడానికి కూడా భయపడేవాళ్లమని, ఇప్పుడు ఎలాంటి భయం లేకుండా పాడేరు, విశాఖపట్నం నుంచి కూడా వెళ్లగలుగుతున్నామని చెప్పారు. మావోలు లేకుంటేనే అభివృద్ధి జరుగుతుందని భావించి ఈ ర్యాలీ నిర్వహించినట్లు వారు వివరించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.